
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 20-4-2024
సంపుటి : 10 సంచిక : 110
సమగ్ర తెలుగు దినపత్రిక
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



ఎరుపెక్కిన భువనగిరి

కమ్యూనిస్టులను గెలిపించండి

బీజేపీతో దేశానికి ప్రమాదం

- రేవంత్ రెడ్డీ.. అహంకారం తగ్గించుకో..
- ఆ అవహంకారంతోనే కేసీఆర్ ఓడారు
- కేరళ వెళ్లి అడ్డగోలుగా మాట్లాడావ్..
- ఇండియా కూటమిలో అందరం ఉన్న విషయం మర్చిపోవద్దు : బీవీ. రాఘవులు
- జహంగీర్ జనం మనిషి : తమ్మినేని
- భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్ నామినేషన్
- రైల్వే స్టేషన్ నుంచి ఏఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ, సభ

"కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి లౌకికతత్వానికి హాని కలిగిస్తోంది. బీజేపీతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రాలను మున్సిపల్ స్థాయికి దిగజార్చుతోంది.. పన్నుల్లో 50 శాతం నిధులు రాష్ట్రాలకు ఇవ్వాలి.. మాజీ సీఎం కేసీఆర్ అహంకారంతోనే ఓడిపోయారు.. రేవంత్‌రెడ్డీ అలాగే వ్యవహరిస్తున్నారు.. అహంకారం తగ్గించుకోవాలి.. ఇండియా కూటమిలో అందరం ఉన్నామన్న విషయం మర్చిపోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవాలి.." అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుల బీవీ.రాఘవులు అన్నారు.

వివరాలు 14లో



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మాడి మసై పోతావ్..

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడు

- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మండిపాటు
- కారు అనుం చెడ్డది..తూకానికి అమ్మేయ్..
- పాలమూరు ఎంపీగా గెలిచిన నీవు ఏం చేశావ్
- గడీల దొరసానిని ఈ ప్రాంత ప్రజలు నమ్మబోరు
- కేసీఆర్ కమీషన్లకు మోడీ కక్కుర్తి : మహబూబ్‌నగర్‌లో నామినేషన్ ర్యాలీ,మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతరలో సీఎం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

"కేసీఆర్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడు.. మాడి మసై పోతావ్.. పదేండ్లు అధికారంలో ఉండి తెలంగాణను చెరబట్టినారు.. అధికార మార్పిడితో కారు అనుం చెడ్డది.. తూకానికి అమ్మేయ్.. తెలంగాణ ఉద్యమ సమయంలో నిన్ను ఇక్కడి నుంచి ఎంపీగా గెలిపిస్తే.. మా పాలమూరుకు ఏం చేశావ్.. మేము ఆగస్టులోగా ముదిరాజ్ బిడ్డను మంత్రిమండలిలోకి తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ దగ్గర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ప్రసంగించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చి ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా, ఉద్యోగాలను భర్తీ చేయకుండా నియంతలా పాలన కొనసాగించారని విమర్శించారు.

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టి 100 మీటర్ల లోతున పాతర పెట్టారన్నారు. ఇది వరకు ఎంపీగా ఉన్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఐదేండ్లపాటు ఢిల్లీలో ఉండి ఏ ఒక్క పనీ చేయలేదని.. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరడం సిగ్గు చేటన్నారు. మరో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడీల దొరసానిని ఈ ప్రాంత ప్రజలు ఏనాడూ నమ్మరని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గడీల ముందు ఉండే బానిస కాలం చెల్లిందని, మిమ్ములను తొక్కి విజయం సాధించి ఢిల్లీకి కాంగ్రెస్ ప్రతినిధులను పంపిస్తామన్నారు. ఐదేండ్లపాటు ...13లో

పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణిస్తాం



- కాంగ్రెస్, సీపీఐ(ఎం) వెల్లడి
- లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు కృషి
- ఇరు పార్టీల అభిప్రాయాలపై నేడు సీఎం, అధిష్టానంతో చర్చిస్తాం : భట్టి 13లో.

లోక్‌సభ బరిలో సీపీఐ(ఎం) అభ్యర్థులు

- 52 మంది పోటీ

న్యూఢిల్లీ : 18వ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థుల జాబితాను పార్టీ సెంట్రల్ కమిటీ కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం దేశవ్యాప్తంగా 52 ...3లో

కాగ్ సభ్యునిగా వేణుగోపాల్‌రావు

- తెలంగాణ స్టేట్ ఆడిట్ అడ్వైజరీ బోర్డ్ సభ్యులుగా రెండేండ్లపాటు బాధ్యతలు
- నియామకం పట్ల నవతెలంగాణ, ప్రజాశక్తి హర్షం

13లో.



కేసీఆర్ బస్సు యాత్ర

- ఎల్లుండి నుంచి మే 10 వరకు నిర్వహణ : షెడ్యూల్ ఖరారు 6లో..



(ఫైల్)

అంత సులువేం కాదు

ఈ ఎన్నికలు అధికార పార్టీకి కష్టమే

- అయినా విజయం తమదేనంటూ విశ్వాసం
- ప్రచారంలో మాత్రం ఎదురీత
- క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులు
- కాషాయపార్టీకి వ్యతిరేకంగానే ప్రజలు
- అయినా..'మోడీ కరిష్మా' అంటూ ప్రగల్భాలు : ఎన్నికల విశ్లేషకులు, నిపుణుల అంచనాలు



న్యూఢిల్లీ : ఎన్నికలు వస్తే ఏ పార్టీ అయినా ప్రజలకు ఏం చేస్తాం? ఎలా చేస్తాం? అనే విషయాలను వివరిస్తూ ముందుకు వెళ్తాయి. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం.. 'వ్యక్తి' ప్రతిష్ఠను మాత్రమే నమ్ముకున్నది. లోక్‌సభ ఎన్నికల్లో అదొక్కటే విజయం కలిగిస్తుందని ముందుకెళు తున్నది. ప్రధాని మోడీకి ఇప్పటికీ ప్రజల్లో విపరీతమైన జనాదరణ ఉన్నదనీ, ఆ కరిష్మాతోనే లోక్‌సభ ఎన్నికల్లో సునాయాసంగా గెలవొచ్చనే అతి విశ్వాసంలో కాషాయ పార్టీ ఉన్నది. బీజేపీకి స్వంతంగా 370 సీట్లు, ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయని మోడీ, బీజేపీ అధినాయకత్వం, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ప్రచారం చేసుకుంటు న్నారు. 'మోడీ కరిష్మా' ఒక్కటి చాలని బీజేపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. అయితే, ఆ పార్టీ ఇంత చెప్తున్నా.. ఎన్నికల్లో మాత్రం ఎదురీదుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాషాయపార్టీ చెప్పుకుంటున్నట్టుగా కాక, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయనీ, ప్రజలు ఆ పార్టీపై, మోడీ సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారని చెప్తున్నారు. బీజేపీ శ్రేణులు ఇంటా, బయట మోడీకి విపరీత ప్రచారం కల్పించి, ఆ అతివిశ్వాసంతో ముందుకు వెళ్తున్నాయనీ, ఇది ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించక మానదని విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. దక్షిణాదిలో మోడీకి కరిష్మా ఎక్కడిదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక మణిపూర్ పరిస్థితులు దేశవ్యాప్తంగా మైనారిటీల్లో తీవ్ర భయాందోళనలు తీసుకొచ్చాయనీ, దాని ప్రభావంతో ఆ వర్గాలలో కాషాయపార్టీకి ఉన్న అతి తక్కువ ఓటు బ్యాంకు కూడా దారుణంగా పడిపోయే

నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నుంచి ఆ పార్టీకి పెద్ద ఎత్తున ఎదురుదెబ్బ తగలనున్నదని హెచ్చరిస్తున్నారు.

రాజకీయమైనా, సినిమా రంగమైనా.. ఒక వ్యక్తికి ఉన్న ఆదరణ కొంత కాలం వరకేననీ, అదే ఎప్పుడూ పని చేస్తుందనుకోవటం తెలివి తక్కువ తనం అవుతుందని కొందరు రాజకీయ నాయకులు విమర్శిస్తున్నారు. ఈ విషయం మోడీకి కూడా తెలుసుననీ, అందుకే కొన్ని సున్నితమైన అంశాలను తాకుతూ, ప్రజల భావోద్వేగాలను ఆసరాగా చేసుకొని రాజకీయాలు చేశారని వారు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా, దక్షిణాదిపై దృష్టి పెట్టిన ఆయన.. కచ్చతీవు, లక్షద్వీప్ వంటి అంశాలను వాడుకున్నాడని వారు ఉదహరిస్తున్నారు. నాయకుడు అసమర్థుడైనపుడు మాత్రమే ఇలా భావోద్వేగ అంశాలను ముందుకు తీసుకొచ్చి, ప్రజలు ఓట్లతో లబ్ది పొందాలని చూస్తారని ప్రతిపక్ష పార్టీల నాయకులు కొందరు అంటున్నారు.

సుప్రీంకోర్టు ద్వారా అపఖ్యాతి పాలైన ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని సమర్థించిన మోడీ.. సెల్ఫ్ గోల్ చేసుకున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కోర్టు తప్పుబట్టిన అంశాన్ని ప్రధాని స్థాయి వ్యక్తి ఎలా సమర్థిస్తాడని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్టికల్ 370, రామ మందిర నిర్మాణం వంటి అంశాలనూ బీజేపీ ముందు పెట్టి ప్రచారాస్త్రాలుగా వాడుకుంటున్నదని అంటున్నారు. ఇక బీజేపీకి వ్యతిరేకత వస్తున్నదనుకున్న సమయంలో, ఎన్నికల బాండ్ల వంటి కొన్ని అంశాలను మరుగున పెట్టే ఉద్దేశంతో రాజకీయ నాయకుల అరెస్టులకు తెర తీసిందనీ, ఇందుకు కేంద్ర ఏజెన్సీలను వాడుకున్నదన్న రాజకీయ నాయకుల మాటలను విశ్లేషకులు ఉటంకిస్తున్నారు. ముఖ్యమంత్రులుగా ఉన్న హేమంత్ సొరెన్, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టులే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. అయితే, బీజేపీతో అంటకాగుతున్న పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలపై మాత్రం బీజేపీ నోరు మెదపటం లేదనీ, ఇది కాషాయపార్టీ వాషింగ్ మెషిన్ రాజకీయానికి తార్కాణమని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

భవన నిర్మాణ అనుమతుల ద్వారా భారీ ఆదాయం

- జీహెచ్ఎంసీకి రూ.1107.29 కోట్లు



మంజూరు చేసిన అనుమతుల వివరాలు..

కేటగిరి	అనుమతులు	హైరైజ్ భవనాలు
వాణిజ్య భవనాలు	140	44
ఆస్పత్రులు, ఇనిస్టిట్యూట్స్, సంబంధిత	34	12
నివాస భవనాలు	2282	74
మొత్తం	2456	130

రిజిస్ట్రేషన్ ద్వారా మంజూరు చేసిన అనుమతుల వివరాలు

కేటగిరి	మంజూరు చేసిన అనుమతులు
ఇన్ రిజిస్ట్రేషన్	496
ఇన్ అప్రూవల్	8122
సింగ్	2456
ఆక్యుపెన్సీ సర్టిఫికెట్	2567

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ 2023-24)కి ఈ సంవత్సరంలో భవన నిర్మాణ అనుమతుల మంజూరు ద్వారా రూ.1107.29 కోట్ల ఆదాయం సమకూరింది. 140 వాణిజ్య భవనాలకు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో బహుళ అంతస్తులు 44 ఉండటం విశేషం. అలాగే ఇనిస్టిట్యూట్స్, ఆస్పత్రులకు సంబంధించి 34 సాధారణ భవనాలకు, 12 బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చారు. 2282 సాధారణ అపార్ట్ భవనాలు కాగా, 130 బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. 2022-23లో రూ.1454.76 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.347.47 కోట్ల ఆదాయం తగ్గింది. 2021-22లో రూ.1144.08 కోట్ల ఆదాయం వచ్చింది. గత అక్టోబర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలు కావడంతోపాటు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో రియల్ ఎస్టేట్ మందగించిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎనిమిది నెలల నుంచి రియల్ రంగంలో స్తబ్దత నెలకొందని వ్యాపారులు అంటున్నారు. సాధారణంగా జీహెచ్ఎంసీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల ద్వారా రూ.వెయ్యి కోట్లకు అటు ఇటుగా ఆదాయం ఉంటుంది.

2023-24లో మొత్తం 13641 భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో 11074 భవన నిర్మాణాల అనుమతులు కాగా, 2567 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. రియల్ ఎస్టేట్ రంగం ద్వారా కేవలం రాష్ట్రాభివృద్ధి మాత్రమే కాక, జీడీపీ కూడా పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం వచ్చిన ఆదాయం తక్కువేమీ కాదంటున్నారు.

సమాజానికి మీ సేవలు అవసరం

- సంధ్యారాగం సినిమా దర్శకుడు శ్రీనివాస్ నేదునూరికి ఉగాది పురస్కారం ప్రదానం



నవతెలంగాణ-హైదరాబాద్

వివిధ రంగాల్లో నిష్ణాతులైన సుమారు 40 మంది కళాకారులు, విద్యావేత్తలు, వైద్యరంగ నిపుణులు, సినీ ప్రముఖులు తదితరులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. బేగంపేటలోని ప్లాజా హోటల్లో సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ ముఖ్యతిథిగా హాజరై ఉగాది పురస్కారాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ లక్ష్మీకాంతం, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్, పారిశ్రామిక వేత్త ఆర్క్‌గ్రూప్ సీఎండీ గుమ్మి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సినిమా విభాగంలో సంధ్యారాగం సినిమా దర్శకుడు శ్రీనివాస్ నేదునూరు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నేదునూరి మాట్లాడుతూ తన రచనలను, సంధ్యారాగం సినిమాను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ జ్యూరి కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందన్నారు. సీనియర్ సినిమా జర్నలిస్ట్ వినాయకరావు, ప్రైమ్ 9 న్యూస్ చైర్మెన్ బండి శ్రీనివాస్, సామాజిక సేవలో బి. విజయ్‌కుమార్, లయన్ బీవీఎస్ రావు, డాక్టర్ ఎస్ఎన్వీ సుబ్బారావు, కోన శ్రీనివాస రావు, ఎం.ఎస్ విజయ కుమార్, భవాని, వినోద్, వ్యాపార వేత్త, నిశ్చయం గ్రూప్ సీఈవో విష్ణు ప్రియ తదితరులున్నారు.

స్పోర్ట్స్ కోటాలో వెరిఫికేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్ 4 రాత పరీక్షల స్పోర్ట్స్ కోటాలో అర్హత మార్కుల సాధించిన 1569 వారి వివరాలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఈ నెల 22 నుంచి మే 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయనున్నారు.

వివిధ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్లలో పీఈటీ పోస్టుల భర్తీలో జీవో నెంబర్ 3ని వర్తింపజేయనున్నట్టు టీఎస్ పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో మహిళలకు హారిజెంటల్ రిజర్వేషన్ వర్తింపజేయనున్నారు. గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో గెజిటెడ్ క్యాటగిరీ పోస్టుల భర్తీలోనూ హారిజెంటల్ రిజర్వేషన్ వర్తిస్తుంది.

లోక్‌సభ బరిలో సీపీఐ(ఎం) అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

స్థానాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

క్రమసంఖ్య	రాష్ట్రం/యుటి	నియోజకవర్గం	అభ్యర్థి పేరు
1.	అండమాన్‌నికోబార్	అండమాన్‌నికోబార్ ద్వీపాలు	డి.అయ్యప్పన్
2.	ఆంధ్రప్రదేశ్	అరకు(ఎస్‌టి)	పి.అప్పలనర్స
3.	అస్సాం	బర్పెట	మనోరంజన్ తలుక్దర్
4.	బీహార్	ఖగరియా	సంజయ్‌కుమార్
5.	జార్ఖండ్	రజ్మహల్(ఎస్‌టి)	గోపిన్ సోరెన్
6.	కర్ణాటక	చిక్కాబళ్లాపూర్	ఎంపి మునివెంకటప్ప
7.	కేరళ	కసరగోడ్	ఎంవిబాలకృష్ణన్ మాస్టర్
8.		కన్నూర్	ఎంవి జయరంజన్
9.		వడకర	కెకె శైలజా టీచర్
10.		కోజికోడ్	ఎలమరం కరీం
11.		పోన్నాని	కె.ఎస్.హంస
12.		మలప్పురం	వి వసీఫ్
13.		అలథోర్(ఎస్‌సి)	కె.రాధాకృష్ణన్
14.		పాలక్కడ	ఎ.విజయరాఘవన్
15.		ఛలకుడీ	సి.రవీంద్రనాథ్
16.		ఎర్నాకులం	కె.జె.షైన్ టీచర్
17.		ఇడుక్కి	జోయస్ జార్జ్
18.		అలప్పుజ	ఎఎం అరిఫ్
19.		పథంమిథట్ట	టిఎం థామస్ ఐజాక్
20		కొల్లాం	ఎం. ముకేశ్
21.		అట్టింగల్	వి జోయ్
22.	మహారాష్ట్ర	హింగోళి	విజయ్ గభనే
23.	పంజాబ్	జలంధర్ (ఎస్‌సి)	పురుషోత్తమ్ లాల్‌బిల్గా
24.	రాజస్థాన్	సికార్	అమ్రా రామ్
25.	తమిళనాడు	మధురై	సు వెంకటేశన్
26.		దిండిగుల్	ఆర్.సచిదానందం
27.	తెలంగాణ	భువనగిరి	ఎండి జహంగీర్
28.	త్రిపుర	త్రిపుర ఈస్ట్(ఎస్‌టి)	రాజేంద్ర రెంగ్
29.	వెస్ట్ బెంగాల్	జల్‌పైగురి(ఎస్‌సి)	దెవ్‌రాజ్ వర్మన్
30.		కృష్ణానగర్	ఎస్.ఎం. సాది
31.		డుమ్ డుమ్	సుజన్ చక్రవర్తి
32.		జాదవ్‌పూర్	శ్రీజన్ భట్టాచార్యా
33.		కొల్‌కత్తా దక్షిణ్	సైరా సాహా హలీం
34.		హౌరా	సబ్యాసి ఛటర్జీ
35.		శ్రీరాంపూర్	దిప్సితా ధార్
36.		హుగ్లీ	మోనోదీప్ ఘోష్
37.		తమ్లుక్	సయాన్ బెనర్జీ
38.		బనుకుర	నిలంజన్ దాస్‌గుప్తా
39.		విష్ణుపూర్(ఎస్‌సి)	సితల్ కైబర్త
40.		బర్ధమాన్ పుర్బా(ఎస్‌సి)	నిరబ్ ఖాన్
41.		అసంసోల్	జహనారా ఖాన్
42.		ముర్షిదబాద్	ఎండి. సలీమ్
43.		రాణాఘాట్(ఎస్‌సి)	అలకేశ్ దాస్
44.		బర్ధమాన్-దుర్గాపూర్	సుకృతి గోషల్
45.		బోలాపూర్ (ఎస్‌సి)	శయమలి ప్రధాన్
46.		బరక్‌పూర్	దేవ్‌దత్ ఘోష్
47.		బసిర్‌ఘాట్	నిరపదా సర్దార్
48.		డైమెండ్ హర్బర్	ప్రతిక్ ఉర్ రహ్మన్
49.		మధురపూర్(ఎస్‌సి)	డా. శరత్ చంద్ర హల్దార్
50.		జర్‌గ్రామ్(ఎస్‌టి)	సోనామణి తుడు
51.		అరంబాగ్(ఎస్‌టి)	విప్లవ్‌కుమార్ మెయిత్రా
52.	ఒడిషా	భువనేశ్వర్	సురేష్‌చంద్ర పాణిగ్రాహి

ఐదేండ్లు మాకు ధోకా లేదు

- పన్నులు వేయకుండానే రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతాం
- బీఆర్‌ఎస్ సర్కారు 'మైనస్ బడ్జెట్'ను అప్పగించింది
- ఎవరైనా, ఎక్కడికైనా చర్చకు రండి...మాట్లాడుదాం
- ప్రాజెక్టుల నుంచి నీళ్లొదిలి కరువు సృష్టించింది
- మంచి నీటి కొరతను నివారిస్తాం...నిధులిస్తాం...
- రైతుల ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ రాజకీయం
- విద్యా హక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేస్తాం
- జోడెద్దుల్లా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు
- కరెంట్ కోతల్లేవ్...నాణ్యమైన కరెంటు అందిస్తున్నాం :'మీడియాతో ముఖాముఖి' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎవరెన్ని కుట్రలు చేసినా ఐదేండ్లపాటు తమ ప్రభుత్వానికి ధోకా లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. నాటి బీఆర్‌ఎస్ విధ్వంసకర పాలనను గాడిన పెట్టి, నేడు ప్రజాపాలనను అందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ధనిక రాష్ట్రమంటూనే తమకు మైనస్ బడ్జెట్‌ను అప్పగించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ నాలుగు నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ. 26,374 కోట్లు చెల్లించామన్నారు. కేసీఆర్ సర్కారు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయగా రూపాయి, రూపాయి పోగేసి గాడిలో పెట్టి ఒకటో తారీఖున ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు వేతనాలు చెల్లించే స్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు. దీనిపై ఎవరైనా, ఎక్కడికైనా చర్చకు రావొచ్చని సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజే, ఐజేయూ సంయుక్తంగా నిర్వహించిన 'మీడియాతో ముఖాముఖి' కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. మీడియా అకాడమీ చైర్మెన్ కె శ్రీనివాసరెడ్డి, యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకు రూ.3690 కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పజెప్పిందని విమర్శించారు. కానీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం రైతు బంధుకు రూ.7వేల కోట్లు కేటాయించిందనీ, ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తే రైతుల ఖాతాల్లో వేస్తామని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ఆ నిధులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.

కరువు సృష్టి కర్త కేసీఆరే

ఎన్నికల సమయంలో ఓట్లు పొందేందుకు ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను తోడేసి కృత్రిమ కరువును సృష్టించిన సృష్టి కర్త కేసీఆరేనని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా విమర్శించారు. శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా భద్రపరుచుకుని వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాల్వల వెంట నీళ్లు పారించి వృథాగా సముద్రంలోకి వదిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ కుంగిపోవడం వల్ల గత పాలనలోనే నీళ్లను దిగువకు వదిలారన్నారు. గత పాలకుల తప్పిదాల వల్లనే ఇప్పుడు నీటి కొరత ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ఎద్దడిని అధిగమించేందుకు అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తూ...రూ.100 కోట్లను అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మంచి నీటి కొరతను రానివ్వబోమన్నారు. అందుకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రూ.43వేల కోట్లతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ప్రయోజనం కనిపించాలి కదా? ఎందుకు కనిపించడం లేదని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లపాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా పాలన అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలపై పన్నుల భారం మోపకుండానే ఆదాయం పెంచుతామన్నారు.

త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్

ప్రభుత్వం త్వరలోనే 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తోందని భట్టి చెప్పారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే మొదటి బడ్జెట్‌లో ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ భవనాల నిర్మాణాలకు రూ.4వేల కోట్లు కేటాయించామని చెప్పారు. విద్యను వ్యాపారంగా మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. పదేండ్లుగా అమలు కాని విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణపై దృష్టి సారించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానన్నారు. రైతుల ఆత్మహత్యలపై రాష్ట్రంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తామన్నారు. ప్రాధాన్యతా క్రమంలోనే ఆర్థిక శాఖ నుంచి పెండింగ్ బిల్లులను విడుదల చేస్తున్నట్టు చెప్పారు.

పీక్ అవర్స్‌లో విద్యుత్ కొనుగోలు

తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలు లేవనీ, నాణ్యమైన కరెంట్ అందిస్తున్నట్టు భట్టి ఈ సందర్భంగా చెప్పారు. కరెంట్ కోతలపై బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. యూనిట్ కరెంట్‌ను రూ.20 చొప్పున కొని రాష్ట్ర ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. తమ ప్రభుత్వం పవర్ ఎక్స్ఛేంజ్‌లో పీక్ అవర్స్‌లో కూడా యూనిట్‌కు రూ.10 చొప్పున మాత్రమే పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నదని వివరించారు. తక్కువ ధరకు వచ్చే గ్రీన్ పవర్ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. విభజన చట్టంలో 4వేల మెగావాట్ల ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కేటాయించినప్పటికీ, పదేండ్లలో దాన్ని బీఆర్‌ఎస్ సర్కారు విస్మరించిందన్నారు. రాష్ట్రానికి గుదిబండగా మారిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లను ఆ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ఎన్టీపీసీ విద్యుత్తు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే 25 సంవత్సరాలకు సోలార్ విద్యుత్తును యూనిట్‌కు రూ.5.59 చొప్పున అందించడానికి టెండర్లు వస్తున్న నేపథ్యంలో యూనిట్‌కు రూ.8 నుంచి 9 చొప్పున ఖర్చయ్యే ఎన్టీపీసీతో పీపీఏలు చేసుకోవడం లేదంటూ విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలపై భారం మోపకుండా తక్కువ ధరకు గ్రీన్ ఎనర్జీని అందించే సోలార్, పంప్డ్ స్టోరేజీ, సాలీడ్ వేస్ట్, విండ్ పవర్ ఇచ్చే విధంగా కొత్త పవర్ పాలసీని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

తొలి దశలో 60.03 శాతం పోలింగ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి దశ ప్రశాంతంగా ముగిసింది. అయితే పోలింగ్ చాలా తక్కువగా నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ రాత్రి 7 గంటల వరకు జరిగింది. 60.03 శాతం పోలింగ్ నమోదయిందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 77.57 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 47.49శాతం పోలింగ్ నమోదయింది. ఇది చాలా తక్కువ శాతం పోలింగ్‌గానే అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం మొదటి దశలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. అదేవిధంగా అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు అందిన లెక్కల ప్రకారం.. తమిళనాడులో 72.09 శాతం, రాజస్థాన్‌లో 50.95 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 57.61 శాతం, మధ్యప్రదేశ్‌లో 63.33 శాతం, మహారాష్ట్రలో 55.29 శాతం, అస్సాంలో 71.38 శాతం, చత్తీస్‌గఢ్‌లో 63.41 శాతం, ఉత్తరాఖండ్‌లో 53.64 శాతం, మణిపూర్‌లో 68.62 శాతం, మేఘాలయాలో 70.26 శాతం, మిజోరాంలో 54.18 శాతం, నాగాలాండ్‌లో 56.77 శాతం, త్రిపురలో 79.90 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్ముకాశ్మీర్ లో 65.08 శాతం, లక్షద్వీప్‌లో 59.02 శాతం, అండమాన్ నికోబార్ దీవులులో 56.87 శాతం, పుదుచ్చేరిలో 73.25 శాతం నమోదయింది. అదేవిధంగా అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 65.46 శాతం, సిక్కిం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 68.6 శాతం ఓట్లు పోలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా కూచ్ బెహార్‌లో బిజెపి, టిఎంసి మధ్య ఘర్షణలు జరిగాయి.

మణిపూర్ లో కాల్పులు.. ఈవీఎంలు ధ్వంసం

మణిపూర్‌లో ఉద్రిక్తతల నడుమ తొలి దశ పోలింగ్ జరిగింది. ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానానికి పోలింగ్ సందర్భంగా పలుచోట్ల కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. మొయిరాంగ్ కాంపు ప్రైమరీ స్కూల్ దగ్గర జరిగిన కాల్పుల్లో ఒకరికి గాయాలయ్యాయి. మరికొన్ని చోట్ల దుండగులు ఈవీఎంలను ధ్వంసం చేశారు. ఇలా ఉద్రిక్తతల నడుమనే సాగిన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది.పోలింగ్ ముగిసే సమయానికి ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానంలో 68.62 శాతం పోలింగ్ నమోదైంది. బమన్ కాంపు, సెక్మైజిన్ ఖునావో మమాంగ్, ఖోంగ్‌మాన్ జోన్-5, ఖురాయ్ తొంగమ్ పోలింగ్‌స్టేషన్‌లలో ఇవీఎంలను ధ్వంసం చేసిననట్లు సమాచారం. అదేవిధంగా అరపాటి మానింగ్, మొయిరాంగ్ కాంపు ప్రైమరీ స్కూల్, వాంగూ, తమ్నపొక్పీ పోలింగ్ స్టేషన్‌ల దగ్గర కాల్పుల ఘటనలు జరిగాయి. అదేవిధంగా ఖైడెమ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పోలింగ్‌ను నిలిపివేశారు. కాగా, మణిపూర్ రాష్ట్రం మొత్తాన్ని రెండు లోక్‌సభ నియోజకవర్గాలుగా విభజించారు. అందులో ఒకటి ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గం కాగా, రెండోది అవుటర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గం. తొలి విడతలో ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానానికి పోలింగ్ నిర్వహించారు.

నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల్లో జీరో ఓటింగ్

నాగాలాండ్‌లోని ఏకైక లోక్‌సభ స్థానానికి శుక్రవారం ఒకే దశలో పోలింగ్ జరిగింది. అయితే, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల్లో జీరో ఓటింగ్ నమోదైంది. ఫ్రాంటియర్ నాగాలాండ్ టెరిటరీ (ఎఫ్‌ఎన్‌టి)ని ఏర్పాటు చేయాలని తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పిఓ) 2010 నుంచి డిమాండ్ చేస్తున్నది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై స్పందించకపోవడంపై ఏడు గిరిజన సంఘాలతో కూడిన ఈ సంస్థ లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం ఏ రాజకీయ పార్టీని అనుమతించబోమని పేర్కొంది. అలాగే 20 అసెంబ్లీ సీట్లున్న ఆరు జిల్లాల్లో పబ్లిక్ ఎమర్జెన్సీ ప్రకటించింది. కాగా, ఈ ఆరు జిల్లాల్లో సుమారు నాలుగు లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. దీంతో 738 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు భారీగా బందోబస్తు ఉంచారు. అయితే తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పిఓ) నిరసన పిలుపునకు ఆరు జిల్లాల ప్రజల మద్దతిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌కు సంఘీభావంగా శుక్రవారం ఇంట్లోనే ఉండిపోయారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరు జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఓటింగ్ నమోదు కాలేదని ఎన్నికల అధికారి తెలిపారు.

గ్రాఫిక్స్ హీరోలు : జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ నేతలు గ్రాఫిక్స్ హీరోలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ గ్రాఫ్ పడిపోవడంతో మోడీ, అమిత్‌షాలకు నిద్ర పట్టడం లేదన్నారు. అందుకే తామే దేశ భక్తులమంటూ డూప్లికేట్ బీజేపీ నేతలు డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అసలైన దేశభక్తులు రాహుల్ గాంధీ కుటుంబమేనని చెప్పారు. రాహుల్ గాంధీకి డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేసీఆర్ బయటకు వస్తే తమ అస్త్రాలు తాము బయటకి తీస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తోపు, భట్టి విక్రమార్క ఇంకో రకం తోపు, ఉత్తమ్ బ్రిలియంట్, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ తోపే, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రేణుక చౌదరి, జీవన్‌రెడ్డి, వీహెచ్ తోపులు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తోపులేనన్నారు. కేసీఆర్ ఏం చేసినా తమకు ఏం కాదని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో ముగ్గురు, బీజేపీలో ఇద్దరు మాత్రమే లీడర్లని చెప్పారు. కాంగ్రెస్‌లో లీడర్లకు కొదవ లేదన్నారు. తాము పాండవులమనీ, విజయం తమవైపే ఉంటుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ఏఐసీసీకి పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. కేసీఆర్ మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. ఆయన మాటలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదని చెప్పారు. తమకు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు.

కాంగ్రెస్ పనైపోయింది

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. బీజేపీ దేశ నిర్మాణంపై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నదని చెప్పారు. శుక్రవారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ జోనల్ ఆఫీసులో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటరీ స్థానం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అంతకుముందు సికింద్రాబాద్ మహంకాళీ దేవాలయం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహబూబా కళాశాల మైదానంలో జరిగిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ..తెలంగాణ గేట్ వే ఆఫ్ సౌతిండియా అనీ, ఇక్కడ బీజేపీకి మంచి ఫలితాలు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వాజ్‌పేయి నుంచి నేటి మోడీ వరకు తమ పార్టీ నేతలంతా అవినీతిరహిత పాలన అందించారని చెప్పారు. ఇప్పుడు దేశాభివృద్ధికి ప్లాన్ వేసుకుని మరీ ముందుకెళ్తున్నామనీ, 2027 నాటికి ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నదని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్టికల్ 370, త్రిబుల్ తలాఖ్‌ను రద్దు చేశామన్నారు. దీనిపై ముస్లింల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డినీ, మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ అభ్యర్థులకు రాష్ట్రంలో డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని చెప్పారు. నైతిక విలువలతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలందిస్తున్నాననీ, భవిష్యత్తులో మరింత సేవ చేసేందుకు గెలిపించాలని ప్రజలను కోరారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ..తాను 2004 నుంచి కిషన్‌రెడ్డిని చూస్తున్నాననీ, ఆయన నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే వ్యక్తి అని కొనియాడారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నేత కేసీఆర్ చెబుతున్నట్టుగా తమకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలే ఆ ప్రభుత్వాన్ని కూలుస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, మాజీమంత్రి కృష్ణయాదవ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కేటీఆర్ చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు..

- టెక్స్‌టైల్ పార్క్ వరంగల్ పోతుంటే ఆపలేని దద్దమ్మలు : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - సిరిసిల్ల

కేటీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోనక్కరలేదని, ఆయన బావమరిది కాంగ్రెస్‌లో చేరితే ఎందుకు ఆశ్చర్యపడటం అని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థులు పోటీ చేయబోమని వెళ్లిపోతున్నారని, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కాం అని ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారన్నారు. 282 పోలింగ్ బూత్‌లు ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలో 100బూత్‌లలో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చిందని గుర్తుచేశారు. తనకు గతంలో పార్లమెంట్ మెంబర్‌గా సిరిసిల్ల ప్రజలు అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న 2004నుంచి 2014వరకు ప్రతి హామీ అమలు చేశామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. 10లక్షల ఆరోగ్యశ్రీ, నియోజకవర్గానికి 3500 ఇండ్లు, వచ్చే ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ చేస్తామని, వచ్చే వానాకాలం పంటలోపు వరికి రూ.500బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎక్కడా అదనపు తూకం లేకుండా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. వచ్చిన ఒక్క టెక్స్‌టైల్ పార్కు వరంగల్ పోతుంటే ఆపలేని దద్దమ్మలు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులని విమర్శించారు. చేనేతపై కేంద్రం జీఎస్టీ విధిస్తే కేటీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండదని, విశ్వగురువు పేరుమీద రాజ్యాంగ ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. నాడు కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగల్లు అంటే దాని రాజకీయం చేసి బండి సంజయ్ గెలిచాడన్నారు. తన తల్లిని కించపరిచిన మాటలే.. బండి సంజయ్‌కి రాజకీయ సమాధి కాబోతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో మీ ఎంపీగా అలుపెరగని సాధన చేసిన మీ బిడ్డగా చెబుతున్న.. సిరిసిల్లలో 282 పోలింగ్ స్టేషన్‌లలో మెజారిటీ ఇవ్వండి. హుస్నాబాద్‌లో బరాబర్ సిరిసిల్ల కన్నా మెజారిటీ తెచ్చుకుంటానని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు కోసం రామనామం

- ఎన్నికలకు ఒక రోజు ముందు బీజేపీ మత రాజకీయం
- అయోధ్య రాముడి విగ్రహ ఫొటోను పోస్ట్ చేసిన కాషాయ పార్టీ
- ' పవర్ ఆఫ్ వన్ ఓట్' అంటూ క్యాప్షన్ జత
- వివాదంగా మారిన కాషాయపార్టీ సోషల్ మీడియా పోస్ట్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌కు ఒక రోజు ముందు బీజేపీ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ వివాదాస్పదమవుతున్నది. ఓట్ల కోసం మళ్లీ మతాన్ని, రాముడి పేరును వాడుకున్నది. 'పవర్ ఆఫ్ వన్ ఓట్' అంటూ అయోధ్యలో బాల రాముడి నుదిటిని తాకిన సూర్యతిలకంగా చెప్పబడుతున్న ఒక ఫొటోను ఆ పార్టీ పోస్ట్ చేసింది. శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా తొలి విడత ఎన్నికలు జరగనుండగా.. ఈనెల 18న(గురువారం) తన పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఈ వివాదాస్పద పోస్ట్‌ను పెట్టింది. అయితే, మతం పేరుతో ఒక వర్గాన్ని ప్రభావితం చేసేలా ఆ బీజేపీ 'ఎక్స్' హ్యాండిల్ ఇలాంటి పోస్ట్ చేయటం పట్ల ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ)ని కోరుతున్నాయి. భారత్‌లో ఎన్నికలు ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం నియంత్రించబడతాయి. 123 (3) సెక్షన్ ప్రకారం మతాన్ని ఓట్ల కోసం ఉపయోగించటమనేది అవినీతి పద్ధతులుగా పరిగణించబడుతుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం 48 గంటల సైలెన్స్ పీరియడ్ ఉంటుంది. ఇలాంటి సమయంలోనూ బీజేపీ ఈ విధమైన పోస్ట్ చేయటాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ సమయంలో అభ్యర్థులు, పార్టీలు ఎన్నికలకు వెళ్లే నియోజకవర్గాల్లో ప్రచార సందేశాలను వ్యాప్తి చేయకుండా మౌనం పాటించాలి. కానీ, కాషాయ పార్టీ ఇవేమీ పట్టనట్టు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పోస్టులను సామాజిక మాధ్యమాల్లో వదులుతున్నదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. కాగా, ప్రచారంలో మతం, వీడియో వినియోగంపై ఎన్నికల సంఘానికి సామాజిక కార్యకర్తలు కొందరు లేఖ రాసినట్టు సమాచారం. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఏ ప్రార్థనా స్థలాలనూ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదని ఈసీ ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు స్పష్టం చేసింది. అయినప్పటికీ.. బీజేపీ అదేమీ పట్టనట్టుగా వ్యవహరించటం గమనార్హం.

రూ.1.05 కోట్ల నగదు పట్టివేత

- వికారాబాద్ జిల్లా నవాబుపేటలో ఘటన



నవతెలంగాణ-నవాబుపేట్

అనుమతిపత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.కోటీ 5లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ భరత్ భూషణ్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. పార్లమెంటు నోటిఫికేషన్ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం పులిమామిడి క్రాస్ రోడ్స్-మెయిన్ రోడ్ వద్ద నవాబుపేట పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇన్నోవా కారులో తరలిస్తున్న రూ. కోటీ 5లక్షల నగదును గుర్తించారు. ఆ డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సంపాదకీయం

షహనాయి సందేశం

హిందువుల శుభకార్యాలన్నింటా ఓ మనోరంజకమైన మంగళవాద్యం తప్పనిసరిగా వినిపిస్తూ ఉంటుంది. చాలా కుటుంబాల్లో పూజలు చేస్తున్నప్పుడు కూడా ఏ సెల్‌ఫోన్ నుంచో లేదా ఏ సౌండ్ సిస్టమ్ నుంచో ఈ ప్రఖ్యాత సంగీత స్వరఝరి సర్వసాధారణం. విశేషమేమిటంటే అది సచ్చా ముసల్మాన్, భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ షహనాయి వాద్యం. ఇదే కదా మతతత్వానికి తావులేని వ్యక్తిగత మతాచరణ. ఇలా స్వచ్ఛంగా, విశ్వాసంతో వ్యక్తిగత మతాచరణ చేసే వాళ్ళు ఎవరూ మతతత్వవాదులు కాదు, కాలేరు. వారి దృష్టి దేవుడి మీదనే ఉంటుంది తప్ప ద్వేషం మీద, ద్వేషపూరితమైన ప్రచారం మీద ఉండదు. ఎవరికైనా ఈ విద్వేష ప్రచారయావ ఉందంటే వారు మతతత్వవాదిగా మారుతున్నారని అర్థం. నిజానికి ఈ సమాజంలో మతాచారకులే ఎక్కువ. అయినా నేడు మతతత్వం పెచ్చరిల్లుతుండటం ఒక విషాదం. ఈ విషాదానికి కారణం మతరాజకీయాలే అనే అభిప్రాయా లను కాదనలేం. సాక్షాత్తూ ప్రధానమంత్రే ఈ తరహా రాజకీయాలకు పాల్పడుతుంటే దేశం ఎటుపోతుంది?

> భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ హజ్ యాత్ర చేసిన సచ్చా ముసల్మాన్. కానీ ఉదయాన్నే గంగా నదిలో స్నానం చేసి, తన షహనాయికి ఆ నదీ జలాలతో సంప్రోక్షణ చేసిన తర్వాతనే రోజువారీ కార్యక్రమాలు మొదలు పెట్టేవారు. ఒకసారి అమెరికాలో నిర్వహించిన కచేరీలో పాల్గొన్న కొందరు సంపన్నులు "ఉస్తాద్... మీరు ఇక్కడనే ఉండిపోండి. మీకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం" అన్నారట. దానికి ఆయన "మీరు నా కోసం స్వర్గాన్నే సృష్టించగలరు. కానీ కాశీలో ఉన్న గంగా మాయిని తేగలరా?" అన్నారట. గంగామాయితో హిందువులకే కాదు బిస్మిల్లాఖాన్ లాంటి సచ్చా ముసల్మాన్‌లదీ విడదీయలేని అనుబంధం. ఇదే భారత దేశ సమ్మిళిత సహజీవన సంస్కృతి. మతతత్వం మన సంస్కృతి కాదు.

ఈ దేశానికి మత ప్రమేయం లేని రాజకీయాలను నిర్దేశిస్తోంది భారత రాజ్యాంగం. అందుకు భిన్నంగా సాగుతోంది ప్రధాని వ్యవహారం. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని ప్రసంగాలను పరిశీలించిన వారెవరికైనా ఈ విషయం బోధపడుతుంది. ప్రత్యేకించి ఈ ఎన్నికల సమయంలోనే వచ్చిన శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో ఈ తరహా విద్వేష ప్రసంగాలకు ఆయన మరింత పదును పెట్టారు. "రాముడిని వ్యతిరేకించే వారంతా ఓట్లడగడానికి వస్తున్నారు" అంటూ పదేపదే వల్లించారు. ప్రతిపక్షాలన్నీ అయోధ్య రామాలయ నిర్మాణానికి, ఇటీవలి ప్రాణప్రతిష్ఠకు వ్యతిరేకమైనవిగా ప్రవచిస్తున్నారు. నిజానికి ప్రతిపక్షాలేవీ రాముడికి వ్యతిరేకం కాదు. మందిర నిర్మాణానికి ముందున్న వివాదాలు, ఆలయప్రతిష్ఠ జరిగినతీరు పట్లే అభ్యంతరాలూ అభిప్రాయాలూ ఉన్నాయి తప్ప... రాముడి పట్ల ఎవరికీ ఏ వ్యతిరేకతా లేదు. ఉన్నదల్లా రాముడు రాజకీయం



కాకూడదన్న ఆకాంక్ష మాత్రమే. కానీ దీనిని వక్రీకరిస్తూ ప్రజల్లో చీలికలు తీసుకొచ్చేలా, విద్వేషాలు రెచ్చ గొట్టేలా ప్రధాని ప్రచారం సాగిస్తున్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని రాముడిని ఒక ప్రచార అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికే కాదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కూడా పూర్తి విరుద్ధం. దీన్ని గుర్తుచేస్తూ సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి ఎన్నికల సంఘానికి ఆధారాలతో కూడిన లేఖ రాశారు. ఇప్పటివరకూ చోద్యం చూస్తున్న ఎన్నికల సంఘం ఈ లేఖకు ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఇప్పుడు కేవలం ఆలయాలే కాదు, ఆహారం కూడా రాజకీయ ప్రచార సాధనంగా మారడం వైచిత్రి! అప్పుడెప్పుడో "జబ్ తక్ సమోసా మే రహేగా ఆలూ, బీహార్ మే రహేగా లాలూ" అంటూ లాలూప్రసాద్ యాదవ్ చమత్కరించారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఆహారంలో కూడా మతకోణాలు వెతకడం, ప్రజలను భావోద్వేగాలకు గురిచేయడం ప్రధానికి పరిపాటిగా మారింది. దక్షిణాది ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఉప్మా తనకు ఇష్టమైన తమిళ ఆహారం అని, పొట్టలో తేలికగా, సులభంగా జీర్ణం కావడానికి తను పొంగల్‌ను కూడా ఇష్టపడతానని చెపుతారు. ఉప్మా అంటే తనకు చెప్పలేనంత ఇష్టమున్నట్టు ఫోజులిస్తారు. దానిని ఆయన పరివారం సామాజిక మాధ్యమాలలో తెగ ప్రచారం చేస్తుంది. కానీ బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ తన ప్రచారంలో రోటీ, చేపలు తింటున్న వీడియోను పోస్ట్ చేయడంపై మాత్రం దాడి చేస్తుంది. నవరాత్రులలో మాంసాహారం తినడం హిందూ ధర్మానికి అపరాధమని ఆరోపిస్తున్నది. (ఈ వీడియో నవరాత్రులకు ముందు చిత్రీకరించినదని తేజస్వి స్పష్టం చేశారు) తానేమో స్వచ్ఛమైన శాఖాహారినంటూ ఉప్మా తింటూ ప్రధాని మోడీ ఫోజులిస్తారు, ఈశాన్య రాష్ట్రాల్లోని బీజేపీ నేతలంతా గొడ్డు మాంసాన్ని తెగ లాగించేస్తారు. దీనిపై మాత్రం ఆయన నోరు విప్పరు.

ఆహారం విషయంలోనైనా ఆచారాల విషయంలోనైనా ఎవరి ఇష్టాలు వారివి. కాదనే హక్కు ఎవరికీలేదు. కానీ ప్రత్యర్థులను హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరించేందుకు బీజేపీ ఏ అంశాన్నీ వదలడం లేదు. అవినీతి, అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి బీజేపీ చేస్తున్న మతరాజకీయమిది. ఈ మతతత్వానికి ఏ మతస్తులూ బలికాకూడదు.

భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ హజ్ యాత్ర చేసిన సచ్చా ముసల్మాన్. కానీ ఉదయాన్నే గంగా నదిలో స్నానం చేసి, తన షహనాయికి ఆ నదీ జలాలతో సంప్రోక్షణ చేసిన తర్వాతనే రోజువారీ కార్యక్రమాలు మొదలు పెట్టేవారు. ఒకసారి అమెరికాలో నిర్వహించిన కచేరీలో పాల్గొన్న కొందరు సంపన్నులు "ఉస్తాద్... మీరు ఇక్కడనే ఉండిపోండి. మీకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం" అన్నారట. దానికి ఆయన "మీరు నా కోసం స్వర్గాన్నే సృష్టించగలరు. కానీ కాశీలో ఉన్న గంగా మాయిని తేగలరా?" అన్నారట. గంగా మాయితో హిందువులకే కాదు బిస్మిల్లాఖాన్ లాంటి సచ్చా ముసల్మాన్‌లదీ విడదీయలేని అనుబంధం. ఇదే భారత దేశ సమ్మిళిత సహజీవన సంస్కృతి. మతతత్వం మన సంస్కృతి కాదు. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలు ఇవ్వాళ విచ్ఛిన్నమవుతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి, సమున్నతంగా నిలబెట్టుకోవడానికి ఈ ఎన్నికలు ఓ అవకాశం.

మీ పిల్లల్ని మీరే కాపాడుకోండి

పిల్లల్ని పాఠశాలలకు, కళాశాలలకు పంపించే తల్లిదండ్రులారా.. పరీక్షలు అయిపోయాయి. వాటి ఫలితాలు రాకముందే మీరు మీ పిల్లలకి ధైర్యమివ్వండి, ఎందుకంటే మనం ప్రతి ఏడాది చూస్తున్నదే. పరీక్షల ఫలితాలు వచ్చిన రోజే ఆత్మహత్యల న్యూస్ టీవీల్లో, తెల్లవారి పేపర్లలో చూస్తున్నాం. దయచేసి పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని తిట్టడం గాని, మార్కులు తక్కువ వచ్చాయని కోప్పడటం గాని, అలాగే ర్యాంకులు రాలేదని పిల్లల్ని అవహేళన చేయడం గాని, ఇలాంటి పనులు మాత్రం అస్సలు చేయొద్దు. ఎందుకంటే మార్కులే జీవితం కాదు. పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన మన జీవితమే ఆగిపోదు. ఇంకా చాలా దారులు ఉన్నాయనే ధైర్యాన్ని పిల్లలకివ్వండి. ఇదంతా గురువులే చెప్పాలి కదా అనుకోవచ్చు. కానీ ఇప్పుడు వేసవి సెలవుల్లో గురువుల దగ్గర పిల్లలు ఉండరు, తల్లిదండ్రుల దగ్గరనే ఉంటారు. కాబట్టి ఇది మన బాధ్యత. 'నేను ఫెయిల్ అయినా మా తల్లిదండ్రులు నన్నేమనరు' అనే విశ్వాసం పిల్లలకు కలిగేలా చేయాలి. ఉదాహరణకు సచిన్ టెండూల్కర్ టెన్త్ ఫెయిల్ అయ్యాడు. కానీ ఏనాడు బాధపడలేదు. తన పని తను చేస్తూ పోయాడు, ఈరోజు ప్రపంచంలోనే క్రికెట్ లో అత్యధిక స్కోర్ చేసిన బ్యాట్స్‌మెన్‌గా చరిత్రలో నిలిచాడు. అత్యున్నత భారతరత్న కూడా అందుకున్నాడు. ఇలాంటి క్రీడాకారులు కావచ్చు, లేదా చదువులేని వారు సాధించిన విజయాలు కావచ్చు. వారి గురించి చెప్పండి. ఈ పరీక్షల్లో పాస్ అవ్వకపోతే మళ్లీ రాసి పాస్ కావచ్చనే విషయాన్ని వారికి అర్థం చేయించగలిగితే ఆత్మహత్యలనేవి ఉండవు. మీరు సంపాదించిన ఆస్తి ఎవరికోసం, మీ పిల్లల కోసం, మీరు తీసుకున్న కారు, బైక్ ఎవరికోసం, అంతా మీ పిల్లల కోసమే కదా? మీ పిల్లలు పరీక్షల్లో ఫెయిల్ అయితే చుట్టు పక్కల వారి దగ్గర, బంధువుల దగ్గర అవమాన పడాల్సి వస్తుందని వారికి చెబితే గనుక తల్లిదండ్రులకు తానే అవమానం చేశానని సుసైడ్ చేసుకునే అవకాశాలుంటాయి. అందుకని జీవితంలో ఏదైనా సాధించాలంటే చదువుక్కొటే ప్రాముఖ్యం కాదు. మనిషన్నాక ఏదో ఒక టాలెంట్ కచ్చితంగా ఉంటుంది. దాన్ని వారినుంచి వెలికితీసి ఆ రంగంలోనే రాణించేలా ప్రోత్సహించాలి. లేదంటే ఎందులో వీక్‌గా ఉన్నాడో, ఎక్కడ ఫెయిల్యూర్ కనిపిస్తుందో దాని పట్ల శ్రద్ధ పెరిగేలా చూడాలి. కానీ పరీక్షలో ఫెయిలైతే ఇంటికి రావద్దని, తలదించే పనులు చేయద్దని, మంచి ర్యాంకు రాకుంటే బాగుండదని హెచ్చరిస్తే గనుక వారి మనసుల్లో అవి నాటుకు పోతాయి. ఒకవేళ పరీక్షల్లో తప్పితే తల్లిదండ్రులు ఏమంటా రోననే భయం వారిని వెంటా డుతుంది. ఆ ఆందోళన నుంచే ఏదైనా అఘాయిత్యానికి ఒడిగడితే కన్నీటిశోకం తప్ప మిగిలేది ఏమీ ఉండదు. అందుకే పిల్లల మనసును గాయపరచకుండా వారిని అర్థం చేసుకుని మనల్ని వారు అర్థం చేసుకునేలా వెన్నుతట్టి ప్రోత్సహించండి.

- జాడే లక్ష్మణ్
9542390483

అవినీతికి మూలాధారం బీజేపీ



ఎన్నికల బాండ్ల పథకాన్ని కోర్టులో సవాల్ చేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ(మార్క్సిస్ట్). పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ ఆక్ట్), చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) లాంటి చట్టాల రద్దు, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ చర్యల్ని నిరోధించాలని సీపీఐ(ఎం) ఎన్నికల మ్యానిఫెస్టోలో పిలుపునిచ్చింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఫ్రంట్ లైన్ ప్రతినిధి టీ.కే.రాజ్యలక్ష్మికి 2024 ఎన్నికలు, ప్రజాస్వామ్యానికి ఎందుకు కీలకమైనవో వివరించారు.

సాధారణ ఎన్నికలపై సీపీఐ(ఎం),వామపక్షాల వైఖరి ఏమిటి?

పదేళ్ల మోడీ పాలనలో భారత లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్, అస్తిత్వ ముప్పునెదుర్కొంటున్న తరుణంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. రాజ్యాంగానికి మూల స్తంభాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయాల్ని కూల్చుతున్న తీరును భారతదేశం చూస్తున్నది. పార్లమెంట్‌లో ఆధిక్యత, రాజ్యాధికారాలను దుర్వినియోగపర్చడం ద్వారా శ్రామికుల హక్కుల్ని హరించేందుకు, అసమాన సమాజాల్లో భారత్‌ను ఒక సమాజంగా మార్చేందుకు, ప్రజల్ని మత ప్రాతిపదికన విభజించి, విషపూరిత మతతత్వ భావ జాలాన్ని రుద్దడానికి నిరంకుశ, మతతత్వ మోడీ పాలన ఫాసిస్ట్ విధానాల్ని ఉపయోగిస్తున్నది. "ప్రజలమైన మనం" ఓటు ద్వారా రాజ్యాంగం నిర్దేశించిన భారత రిపబ్లిక్ యొక్క లౌకిక, ప్రజాస్వామిక లక్షణాన్ని రక్షించగలమా లేదా అనేది ఈ ఎన్నికల ఫలితాలు నిర్ణయిస్తాయి.

అవినీతిని సమర్థించేందుకే 'ఇండియా' కూటమి ఐక్యంగా ఉందన్న బీజేపీ వైఖరి పై మీ స్పందన ఏమిటి?

ఇది హాస్యాస్పదమైన ఆరోపణ. 'ఇండియా' కూటమిలో కొన్ని పార్టీల నాయకులపై సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలు అవినీతి కేసులు బనాయిస్తే, ఆ నాయకులు బీజేపీలో చేరిన వెంటనే ఆ ఆరోపణలన్నీ మాయమవుతాయి. దేశంలో అవినీతికి మూలం, మోడీ నాయకత్వంలోని బీజేపీ అనేది వాస్తవం.

వామపక్షాలు, దాని ఎన్నికల ఎత్తుగడలు, బీజేపీ ఓటమి లక్ష్యంలో తమ పాత్రను పోషిస్తాయా? కేరళలో వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య పోటీ, పశ్చిమ బెంగాల్‌లో త్రిముఖ పోటీ ఉంది. ఇవి, బీజేపీని ఓడించే లక్ష్యాన్నెలా నెరవేరుస్తాయి?

భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, భారత రిపబ్లిక్ లౌకిక ప్రజాస్వామిక స్వభావాన్ని కాపాడేందుకు, బీజేపీని ఓడించే లక్ష్యంతో ఇటీవల 'ఇండియా' కూటమి, ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ కూటమిలోని కొన్ని పార్టీల మధ్య వైరుధ్యాలున్నాయి. అయితే అలాంటి వైరుధ్యాలు కొత్తేమీ కాదు. ముఖ్యంగా ఇలాంటి వైరుధ్యాల కారణంగానే బీజేపీ బలహీనపడి, ఎన్నికల్లో ఓటమి పాలైంది. రాజకీయాలంటే అంక గణితం కాదనే విషయం గుర్తుంచుకోవాలి. కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ మధ్యనే పోటీ నెలకొన్న ఫలితంగా బీజేపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం లేదు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బీజేపీకి మాత్రమే లబ్ది చేకూర్చుతుంది. త్రిముఖ పోటీలోని వామపక్షాలు-కాంగ్రెస్‌ల కలయిక బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్‌లను ఎదుర్కొంటుంది. ఈ త్రిముఖ పోటీ, బీజేపీ ప్రయోజనం పొందకుండా అడ్డుకుంటుంది. ఢిల్లీలో, ఇతరచోట్ల ఆప్, కాంగ్రెస్‌ల మధ్య అవగాహన ఉన్నప్పటికీ పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు విడిగా పోటీచేస్తున్నాయి. ప్రతి రాష్ట్రంలో బీజేపీ ఓటమికి ఎన్నికల సర్దుబాట్లు జరుగుతున్నాయి.

జేడీ(యు), ఆర్ఎల్డీ, పల్లవి పటేల్ అప్నాదళ్, ప్రకాష్ అంబేద్కర్ వీబీఏల నిష్క్రమణ, ఎన్సీపీలోని చీలికను మీరు పెద్ద తిరోగమనంగా చూస్తారా? ఎంత వరకు విపక్షాల కూటమి పుంజుకుంటుంది?

'ఇండియా' కూటమి నాయకులంతా కలిసి ఉండడం వల్ల (చాలా ముఖ్యం అయినప్పటికీ) మాత్రమే ఈ కూటమి ఐక్యంగా ఉండటం కాదు. భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న ప్రజల మధ్య ఐక్యతే ఈ కూటమి ఐక్యతలోని ముఖ్యమైన అంశం. దీనిని ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో చూశాం. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలన్న ప్రజల ఆకాంక్షే, ఎమర్జెన్సీ ప్రతిఘటనను బలోపేతం చేసి, అన్ని పార్టీల నాయకులు ఏకం అయ్యేలా ఒత్తిడి తెచ్చింది. ఆ దృష్టితో చూస్తే, 'ఇండియా' కూటమి క్షేత్రస్థాయి నుంచి పుంజుకుంటున్నది. "భారత్ ఐక్యంగా ఉంటుంది, 'ఇండియా' గెలిస్తుంది" అనే ప్రజాదరణ పొందిన నినాదమే దీనికి నిదర్శనం.

> 'ఇండియా' కూటమి నాయకులంతా కలిసి ఉండడం వల్ల (చాలా ముఖ్యం అయినప్పటికీ) మాత్రమే ఈ కూటమి ఐక్యంగా ఉండటం కాదు. భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న ప్రజల మధ్య ఐక్యతే ఈ కూటమి ఐక్యతలోని ముఖ్యమైన అంశం. దీనిని ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో చూశాం. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలన్న ప్రజల ఆకాంక్షే, ఎమర్జెన్సీ ప్రతిఘటనను బలోపేతం చేసి, అన్ని పార్టీల నాయకులు ఏకం అయ్యేలా ఒత్తిడి తెచ్చింది. ఆ దృష్టితో చూస్తే, 'ఇండియా' కూటమి క్షేత్రస్థాయి నుంచి పుంజుకుంటున్నది. "భారత్ ఐక్యంగా ఉంటుంది, 'ఇండియా' గెలిస్తుంది" అనే ప్రజాదరణ పొందిన నినాదమే దీనికి నిదర్శనం.

'ఇండియా' కూటమికి ఒక ఉమ్మడి మ్యానిఫెస్టోను తీసుకొచ్చే అవకాశం ఉందా? అత్యంత ధనికుల పైన, సంపదపైన పన్నులు, వారసత్వ పన్ను విధించాలనీ, ప్రభుత్వ రంగ పెట్టుబడుల ఉపసంహరణ గురించి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లాంటి సూచనలు మీ మ్యానిఫెస్టోలో సూచించారు. మీ భాగస్వామ్య పార్టీలు వీటిని అంగీకరించకపోవచ్చేమో?

'ఇండియా' కూటమిలోని పార్టీలకు ప్రత్యేకమైన మ్యానిఫెస్టోలుండడం సహజం. ఎన్నికలు సమీపించే సమయానికి కేంద్రంలో ఏర్పడబోయే ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం చేపట్టే కనీస ప్రాథమిక చర్యలతో ఒక ఉమ్మడి ఎజెండాను విడుదల చేస్తారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్, 1999లో ఎన్డీయే లేదా 2004 లో యూపీఏ ప్రభుత్వాలు ఏర్పడినపుడు జరిగిన విధంగానే, ఒకసారి ప్రభుత్వం ఏర్పడినపుడు ఒక ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని రూపొందిస్తారు. కొన్ని పార్టీలకు, కొన్ని సమస్యలపై ప్రత్యేక వైఖరులు ఉన్నప్పటికీ 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ కలిసి ఒక అంగీకారానికి వచ్చిన కనీస ఉమ్మడి ఒప్పందం ఒకటి ఉంటుంది.

ఈడీ చర్యల్ని నిరోధించాలని, పీఎంఎల్ఏ, ఉపా చట్టాల్ని రద్దు చేయాలని మీ పార్టీ మ్యానిఫెస్టోలో పిలుపునిచ్చింది. ఈ రెండు చట్టాల్ని యూపీఏ పాలనలో మరింత కఠినతరం చేశారని మీ పార్టీ గుర్తించింది. అవినీతిని, తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు మాత్రమే ఈ చట్టాల్ని వినియోగిస్తున్నట్టు బీజేపీ చెపుతున్నది. ఈ చట్టాల దుర్వినియోగం గురించి మాత్రమే 'ఇండియా' కూటమి ఆందోళన చెందుతుందా? లేక దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు నిబంధనల పుస్తకం నుండి వాటిని తొలగించాలని కోరుకుంటుందా?

మోడీ ప్రభుత్వం తెచ్చిన సవరణల ద్వారా ఈ రెండింటినీ ఆయుధాలుగా ఉపయోగించారు కాబట్టి ఈడీ చర్యల్ని నిరోధిస్తూ, పీఎంఎల్ఏ, ఉపా చట్టాలను రద్దు చేయాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. ఈ రెండు చట్టాలు (బెయిల్ పొందడానికి) అనాగరికమైన నిబంధనలు కలిగి ఉన్నాయి. ఈ రెండు కలిసి న్యాయశాస్త్ర సూత్రాన్ని, న్యాయాన్నందించే ప్రాథమిక నియమాన్ని తలకిందులు చేశాయి. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చేంతవరకు, నేరం రుజువయ్యేంతవరకు ఒక వ్యక్తి నిర్దోషి అని మనకు న్యాయశాస్త్రం తెలియ జేసింది. నేడు, ఒక వ్యక్తి తాను నిర్దోషి అని రుజువు చేసుకునేంత వరకు, దోషిగానే ఉంటాడు. ఈ కారణంగానే ఎలాంటి అభియోగాలు మోపబడకుండానే ప్రజలు జైళ్ళలో మగ్గుతున్నారు. భీమా కోరేగావ్ కేసులో వలె ఛార్జ్ షీట్ వేయకుండానే అనేకమంది పౌరులు సంవత్సరాల పాటు నిర్బంధంలో ఉంటున్నారు. కాబట్టి ఈ అనాగరిక నిబంధనలు పోవాలి.

> మోడీ ప్రభుత్వం తెచ్చిన సవరణల ద్వారా ఈ రెండింటినీ ఆయుధాలుగా ఉపయోగించారు కాబట్టి ఈడీ చర్యల్ని నిరోధిస్తూ, పీఎంఎల్ఏ, ఉపా చట్టాలను రద్దు చేయాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది.ఈ రెండు చట్టాలు (బెయిల్ పొందడానికి) అనాగరికమైన నిబంధనలు కలిగి ఉన్నాయి. ఈ రెండు కలిసి న్యాయశాస్త్ర సూత్రాన్ని, న్యాయాన్నందించే ప్రాథమిక నియమాన్ని తలకిందులు చేశాయి. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చేంతవరకు, నేరం రుజువయ్యేంతవరకు ఒక వ్యక్తి నిర్దోషి అని మనకు న్యాయశాస్త్రం తెలియ జేసింది. నేడు, ఒక వ్యక్తి తాను నిర్దోషి అని రుజువు చేసుకునేంత వరకు, దోషిగానే ఉంటాడు. ఈ కారణంగానే ఎలాంటి అభియోగాలు మోపబడకుండానే ప్రజలు జైళ్ళలో మగ్గుతున్నారు.

2024లో భారతదేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయా? ఈ సవాల్‌ను ఎదుర్కోవడంలో ప్రతిపక్షాల వ్యూహం ఏమిటి?

అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే స్వేచ్ఛగా, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైన అంశం. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడం ద్వారా దానికి ఇప్పటికే తీవ్ర విఘాతం కలిగింది. ఇది బీజేపీకి భారీ ప్రయోజనాల్ని సమకూర్చింది. ఎన్నికల బాండ్లతో పాటు ఎలాంటి లెక్కలు, ఆడిట్ లేని, పూర్తి పారదర్శకత లేని "పీ.ఎం కేర్స్" నిధులున్నాయి. ఇది ప్రధాని ఆధ్వర్యంలో ఒక ప్రయివేట్ నిధిగా ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిధి 10 వేల కోట్ల రూపాయలున్నట్లు సమాచారం. ఆ విధంగా బీజేపీ అవసరానికి మించిన ప్రయోజనాలు పొందింది. శక్తివంతులకు ప్రవర్తనా నియమావళి నమూనా వర్తించే పరిస్థితి లేదు.

ఎన్నికల బాండ్ల పథకం ద్వారా నిధులను తీసుకోబోమని మీ పార్టీ ప్రకటించింది.దానికి కారణం ఏమిటి?

2017లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ఆర్థిక బిల్లులో భాగంగా చట్టవిరుద్ధంగా, రహస్యంగా పార్లమెంట్ ముందుకు తెచ్చినప్పుడు సీపీఐ(ఎం) వ్యతిరేకించింది. పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఇతరులతో కలిసి నేను రాజ్యసభలో ప్రతిపక్షాన్ని నడిపించాను. దీనిని మేము రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడంగా పరిగణించి, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే ఇలాంటి ప్రక్రియ ద్వారా నిధులను సమకూర్చుకునే పార్టీ కాదు సీపీఐ(ఎం) అని ప్రకటించాం.

ఎన్నికల బాండ్ల నిషేధం అందరికీ సమాన అవకాశాల కల్పనకు హామీ ఇస్తుందా? లెక్కల్లో చూపించని డబ్బు కూడా భారీగానే ఉందనే భావన ఉంది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగవిరుద్ధమన్న సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాలి. అయితే ఇంతకుముందే ఈ తీర్పు వచ్చి ఉండాల్సింది. పథకం వివరాలు స్పష్టంగా నిర్ధారించిన అంశాలు:

ఏ) ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి ఏజెన్సీల దుర్వినియోగం ద్వారా దోపిడీకి పాల్పడటం,

బీ) భారీ విరాళాలకు ప్రతిఫలంగా ప్రాజెక్టులు, అడ్డంకుల తొలగింపులు మంజూరుచేసే ప్రేమపూర్వక ఒప్పందాలు,


సీ) అనేక సంస్థలు తమ ఆస్తి అప్పుల పట్టికలో చూపిన లాభాల కంటే అనేక రెట్లు ఎన్నికల బాండ్లు కొనడంతో భారీగా మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డాయి. ఈ మూడు అంశాలపై వీలైనంత త్వరలో స్వతంత్ర సంస్థల ద్వారా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) కోరుతుంది.

ఆదాయపు పన్నుల శాఖ మీ పార్టీకి నోటీసులు పంపడం దైనందిన చర్యల్లో భాగమా లేక వేధించే ఉద్దేశ్యమా?

సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను స్తంభింపజేయడం, ఎన్నికల సమయంలో పార్టీని వేధించేందుకు తీసుకున్న ముందస్తు చర్య. ఈ ఖాతా వివరాలు రాష్ట్ర స్థాయిలో ఏకీకృతం చేయబడిన దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ ఖాతాల్లో భాగంగా ఉంది. ఇవి జాతీయ స్థాయిలో ఆదాయ పన్నుల శాఖకు, భారత ఎన్నికల కమిషన్‌కు చట్ట ప్రకారం సమర్పించడం జరుగుతుంది, వాటిని వారి వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. ఏడాది పొడవునా ఎలాంటి ఆక్షేపణలు కూడా వ్యక్తం కాలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో ఇలా జరగడం రాజకీయ ప్రేరేపితంగా అర్థం చేసుకోవాలి. త్రిస్సూర్ నియోజకవర్గంలో బీజేపీ పోటీ చేయడం యాదృచ్ఛికమా? ఖాతా స్తంభింపచేసిన చర్యను ఖండిస్తూ, ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యలకు భారత ఎన్నికల కమిషన్ ఎలా అనుమతించి, ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాల కల్పనకు ఎందుకు విఘాతం కలిగిస్తుందో అడుగుతూ లేఖను కూడా రాశాం.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

పరిశ్రమల్లో 'చితి'కి పోతున్నారు!



గొల్లపల్లి జయరాజు
9490098706

ఏప్రిల్ 3న సాయంత్రం 5గంటలకు పెద్ద పేలుడు శబ్దాలు, దట్టమైన పొగలు, అరుపులు, ఆర్తనాదాలు చుట్టుపక్కల గ్రామాల భయాందోళనలు... కనుచూపు మేర ఏం కనిపించటం లేదు. ఏదో పెద్ద ప్రమాదమే జరిగి ఉంటుందని స్థానికులు పరిశ్రమల వద్దకు ఉరుకులు, పరుగులు. అయితే తమవారికి ఏమైందోననే ఆందోళన ఒకవైపు, మరోవైపు రక్షించేవారి కోసం ఎదురుచూపు? ఇలా ఏడుపులు,పెడబొబ్బలతో ఆ ప్రదేశం దద్దరిల్లింది. కానీ ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ అక్కడకి రాలేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేయడం చూస్తే కార్మికుల ప్రాణాలకు విలువే లేదా? అనే సందేహం రాకమానదు.

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్బీ ఆర్గానిక్ పరిశ్రమలో ఇటీవల రియాక్టర్ పేలిన ఘటనలో పరిశ్రమ డైరెక్టర్‌తో పాటు మరో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 16 మంది పైగా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో అత్యధికంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులే ఉన్నారు. పరిశ్రమలో పేలుడు ఘటన జిల్లాలో సంచలనమైంది.ఒక్కసారిగా ప్రజానీకం ఉలిక్కిపడింది. వెంటనే జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. ఉన్నఊళ్లో ఉపాధి లేక పొట్టచేత పట్టుకొని ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో చితికిపోతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి వేరే మార్గం లేక అరకొర సౌకర్యాల మధ్యే బతుకులీడుస్తున్నారు. వారికి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి కల్పించాల్సిన సౌకర్యాల పట్ల యజమానులు నిర్లక్ష్యం చేయడంతో కార్మికులు నిండు ప్రాణాలను కోల్పోతున్నారు. బతుకుదెరువు కోసం అయినవారితో వచ్చి స్వస్థలాలకు విగతజీవులుగా పోవడం కడు శోచనీయం.

ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్‌చెరు పేరుగాంచింది. ఈ పారిశ్రామిక ప్రాంతం మినీ ఇండియాను తలపిస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ కుటుంబాల్ని పోషించుకుంటున్నారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో సంగారెడ్డి జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతున్న విషయం తెలిసిందే. అయితే జిల్లాలో పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, కాజిపల్లి, గడ్డపోతారం, బోరపట్ల, కొండాపూర్, సదాశివపేట, జహీరాబాద్‌తో పాటు 24 పారిశ్రామికవాడలున్నాయి. జిల్లాలో 1300 పైగా భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల్లో 3 లక్షలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నవారే ఎక్కువ. పరిశ్రమల యజమానులు కార్మికుల రక్షణకు తగిన చర్యలు తీసుకోకపోవడం మూలానా ఈ రెండేండ్లలో జరిగిన ప్రమాదాల్లో 72 మంది కార్మికులు మృతిచెందారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా బల్క్ డ్రగ్స్ ఫార్మా కెమికల్ ఇండస్ట్రీస్‌లోనే ఉంటున్నాయి. వీటిలోనే 40 వరకు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.ఇప్పటివరకు చనిపోయినవారిలో ఇక్కడే ఎక్కువ. ఈ ఘటనలు మచ్చుకు మాత్రమే. బయటకు రానివి, తెలియని ఎన్నో? 72 మంది కార్మికులు చనిపోయి, 225 మంది క్షతగాత్రులయ్యారని మీడియాలో ప్రసారమవుతున్నా పాలకుల్లో స్పందన లేదంటే కార్మికులంటే వారికి ఎంత చిన్నచూపో అర్థమవుతుంది.

పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల సంక్షేమం మరిచి ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నాయి. 2023 అక్టోబర్‌లో ఐడీఏ బొల్లారంలోని అమరల్యాబ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు చనిపోగా, రోజుకొకరు చొప్పున మరో ముగ్గురు మృతిచెందారు. ఏడాది క్రితం గడ్డ పోతారం పారిశ్రామిక వాడలోని మైలాన్ పరిశ్రమలో ఇద్దరు కార్మికులు సజీవ దహనమయ్యారు. మార్చి 4 నుంచి 10 వరకు జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగానే గుండ్లమాచనూర్ పరిధిలోని కొవలెంట్ పరిశ్రమలో ప్రమాదాలు జరిగి ఇద్దరు కార్మికులు మృతిచెందారు, మరి కొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల కాలంలో ఈ పరిశ్రమలో మూడుసార్లు ప్రమాదాలు జరిగి ఐదుగురి వరకు చనిపోయారు. గత నెల పాశమైలారం సిఎంహెచ్ పరిశ్రమలో ప్రమాదం జరిగి ఒక కార్మికుడు మృతిచెందగా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తే యాజమాన్య లోపాలే ఎక్కువ కనిపించాయి. ఇలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశ్రమల యజమానులకు వారు ఆదేశాలిచ్చారు. అయినా నిత్యం ఏదో ఓచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. బొల్లారం అమర్ కెమికల్, పాశమైలారంలోని మోనాక్షి లైఫ్ సైన్సెస్, టైర్ల పరిశ్రమ, జిన్నారం మండలంలోని మైలాన్, లీ ఫార్మాలో భారీ ప్రమాదాలు జరిగాయి. ఫసల్వాది గణపతి షుగర్ పరిశ్రమలో కార్మికుడు మృతిచెందగా, బోర్పట్ల అరబిందోలో మరో కార్మికుడు చనిపోయాడు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా గడ్డపోతారం, బొల్లారం, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాలలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. సేఫ్టీ భద్రతా చర్యలు తీసుకోవాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, యజమానుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రమాదాలు జరిగి విలువైన కార్మికుల ప్రాణాలు పోతున్నాయి. పర్మినెంట్ నేచర్ ఆఫ్ వర్క్‌లో కాంట్రాక్ట్ కార్మికులను పెట్టి పని చేయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నా లేబర్ డిపార్ట్‌మెంట్ పట్టించుకోవడం లేదు.ఫైర్ సేఫ్టీ సిబ్బంది కూడా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఇన్ని ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? యజమానులను ఎందుకు శిక్షించడం లేదు? ప్రమాదాలకు బాధ్యులైన అధికారులను సస్పెన్షన్ చేయకపోవడానికి కారణలేంటి? కార్మికుల రక్షణ గాలిలో దీపమేనా? కార్మికుల కుటుంబాలను నిత్యం వేధిస్తున్న ప్రశ్నలివి.

> ఈ ప్రభుత్వం కార్మికుల కోసం కాదు, యజమానులు కోసమే పనిచేస్తున్నట్టు కనబడుతున్నది. 'ప్రభుత్వం మా చేతులు కట్టేసిందని ఓ జిల్లా అధికారి మాట్లాడటం విచిత్రం'. పరిశ్రమల్లో కార్మికులతో పన్నెండు గంటలు పని చేయించుకుంటూ సేఫ్టీ, కనీస సౌకర్యాలు కల్పించకుంటే పర్యవేక్షించి యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడా కనిపించరేం? ప్రమాదం జరిగినప్పుడు కార్మిక, ప్రజాసంఘాలు ఆందోళన చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతున్నాయి. కానీ ప్రభుత్వాలు మాత్రం స్పందించడం లేదు.

గడిచిన రెండేండ్ల కాలంలో 72 మంది కార్మికులు చనిపోతే దీనికి బాధ్యులెవరో ఇప్పటివరకు ప్రభుత్వం తేల్చలేదు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయడం లేదు. పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోని ఏ ఒక్క యాజమాన్యాన్ని శిక్షించింది లేదు. అంటే ఈ ప్రభుత్వం కార్మికుల కోసం కాదు, యజమానులు కోసమే పనిచేస్తున్నట్టు కనబడుతున్నది. 'ప్రభుత్వం మా చేతులు కట్టేసిందని ఓ జిల్లా అధికారి మాట్లాడటం విచిత్రం'. పరిశ్రమల్లో కార్మికులతో పన్నెండు గంటలు పని చేయించుకుంటూ సేఫ్టీ, కనీస సౌకర్యాలు కల్పించకుంటే పర్యవేక్షించి యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడా కనిపించరేం? ప్రమాదం జరిగినప్పుడు కార్మిక, ప్రజాసంఘాలు ఆందోళన చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతున్నాయి. కానీ ప్రభుత్వాలు మాత్రం స్పందించడం లేదు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్ డిపార్ట్మెంట్, ఫైర్ సేఫ్టీ డిపార్ట్మెంట్ సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో ప్రమాదాలు నివారించాల్సిన అవసరం ఉన్నది. ఈ ఘటనలన్నిటికీ ప్రధానంగా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. ఎందుకంటే కార్మికుల చట్టాలను పరిశ్రమ యజమానులకు అనుగుణంగా మార్చడం వల్లనే వారు అధిక పనిగంటలు పనిచేయాల్సి వస్తోంది. ఈ దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. కేంద్రం విధానాల్ని అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటం కూడా సరికాదు. ఎవరికి వాళ్లు స్వప్రయోజనాలు చూసు కుంటున్నారు .కానీ కార్మికుల ప్రయోజనాలను గాలికొదిలేశారు. కార్మికులకు న్యాయం జరగాలంటే సంఘటిత పోరాటం తప్ప మరో మార్గం లేదు. 'పోరాడితే పోయేదేమీ లేదు...బానిస సంకెళ్లు తప్ప' అన్న కార్ల్‌మార్క్స్ మాటలు గుర్తు చేసుకొని జిల్లాలో కార్మికవర్గం ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది.



గ్రోమోర్ దుకాణానికి తాళం

- నకిలీ విత్తనాలు సరఫరా చేయడంతో నష్టపోయామని రైతుల ఆవేదన
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



నవతెలంగాణ-నసురుల్లాబాద్

నకిలీ విత్తనాలు అంటగట్టడంతో వరి పైరు దిగుబడి అమాంతం తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేస్తే వచ్చి పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ ఎలాంటి సాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు గ్రోమోర్ దుకాణానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణ సముదాయానికి శుక్ర వారం తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బీర్కూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులమంతా యాసంగికి వరి విత్తనాలను బీర్కూర్‌లోని గ్రోమోర్ షాప్‌లో కొనుగోలు చేశామన్నారు. తాము గంగా కావేరి విత్తనాలు ఇవ్వాలని కోరగా గ్రోమోర్ బీర్కూర్ కంపెనీ, ఆర్కే సోనా కరీంనగర్ ప్రయివేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి తమకు విక్రయించినట్టు తెలిపారు. వేసిన పంట తెగుళ్ల బారినపడి దిగుబడులు తగ్గిపోవడంతో శాస్త్రవేత్తలను సంప్రదించినట్టు చెప్పారు. వారం రోజుల క్రితం జగిత్యాల, రుద్రూర్, కరీంనగర్, ప్రాంతాలకు చెందిన వరి విత్తన శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి నకిలీ విత్తనాలతో నష్టపోయినట్టు తెలిపారని వెల్లడించారు. తమకు పరిహారం చెల్లించాలంటూ వారం రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని, అందుకే తాళం వేసి నిరసన చేపట్టినట్టు తెలిపారు. సోమవారమే పరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని వాపోయారు. యాసంగి సీజన్ పూర్తయినా తమకు నష్టపరిహారం ఇవ్వడం లేదని, తమ పంటలు దెబ్బ తినడానికి నకిలీ విత్తనాలిచ్చిన మన గ్రోమోర్స్ కంపెనీ తక్షణం రైతులకు పరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. తమకు పరిహారం ఇచ్చేవరకు ఆందోళన విరమించేదే లేదంటూ రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. ఈ విషయమై డివిజన్ వ్యవసాయాధికారి స్వామి రైతులతో మాట్లాడుతూ.. విచారణ చేపట్టామని, రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పగలు భగభగ.. సాయంత్రం వడగండ్ల వర్షం

- అన్నదాతలను వదలని అకాల వర్షాలు
- ఉరుములు, మెరుపులతో రాళ్ల వర్షం
- ఈదురుగాలుల ధాటికి పంటలకు తీవ్రనష్టం
- పిడుగుపాటుకు మూడు గేదెలు మృత్యువాత



నవతెలంగాణ-నిజామాబాద్ విలేకరులు

పొద్దంతా భానుడి భగభగలు.. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షంతో రైతులు ఆగమాగమవుతున్నారు. శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో ఆరబెట్టిన ధాన్యం పలుచోట్ల తడిచి ముద్దవగా, కోతకు వచ్చిన వరి నేలవాలింది. ఏప్రిల్ నెలలో తరుచూ రాళ్ల వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ధాన్యం సేకరణ వేగంగా చేపట్టడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నవీపేట్, మాక్లూర్, వర్ని, నందిపేట్ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. మాక్లూర్‌లో వడగండ్ల వాన కురవడంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. నవీపేట్‌లో ధాన్యం తరుచూ తడుస్తుండటంతో మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షం కారణంగా వరి కోతలు చేసి ఆరబెట్టేందుకు నానా కష్టాలు పడుతున్నారు. పంట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో, రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టగా రెండు, మూడు రోజులుగా వర్షం తరచూ కురుస్తుండటంతో ధాన్యం తడిసి మొలకెత్తి తీవ్రంగా నష్టపోతున్నారు. దానికి తోడు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల నత్త నడకన సాగుతుండటంతో చిన్న, సన్నకారు రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పండించిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడేందుకు నానాతంటాలు పడుతున్నారు. ధాన్యంపై కప్పేందుకు పట్టాల ఖర్చులు సైతం పెరిగి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. లారీలు సమయానికి రాకపోవడంతో వరి ధాన్యం కాంటా చేసిన బస్తాలు తడిసి ముద్దయి తీవ్రంగా నష్టపోతున్నామని, ఇకనైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో చిన్న, సన్నకారు రైతులకు నష్టం వాటిల్లకుండా త్వరితగతిన కొనుగోళ్ల చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా డిచ్‌పల్లిలో ఈదురుగాలుల ధాటికి చెట్లు, స్తంభాలు నెలకొరిగాయి. కరెంట్ సరఫరాలో ఆటంకం కలిగింది. నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో పిడుగుపాటుకు మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. వెల్మల్‌లో సొసైటీకి ఎదురుగా ఉన్న మంచి నీళ్ల ట్యాంక్ పిడుగు పాటుకు పాక్షికంగా దెబ్బతిన్నది.

చంద్రబాబుకు టీడీపీ తెలంగాణ నేతల పుట్టిన రోజు శుభాకాంక్షలు




నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ తెలంగాణ నేతలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, అధికార ప్రతినిధి శ్రీనివాస్‌నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో బాబును కలిశారు. శనివారం చంద్రబాబు పుట్టినరోజు నేపథ్యంలో ముందస్తుగా అభినందించారు. పూలబొకే, శాలువాతో సన్మానించారు. చంద్రబాబు మళ్లీ ఏపీకి ముఖ్యమంత్రి అవుతారని ఆకాంక్షించారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు!

5 రోజులుగా జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్ బంద్



- మద్దతు ధర ఇవ్వని మిల్లు యాజమానులు
- సీఎం రేవంత్ ఆదేశించినా మెరుగుపడని పరిస్థితి
- అవస్థలు పడుతున్న రైతులు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

నవతెలంగాణ-జనగామ

ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన కొద్దిపాటి ధాన్యాన్ని అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఇందుకు ఉదాహరణే జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు. ఏప్రిల్ ఒకటవ తేదీన ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. వారం కిందట ధాన్యం తీసుకొచ్చిన రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో ఆందోళన చేపట్టారు.

ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు చేరుకుంది. స్పందించిన సీఎం.. రైతులకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మద్దతు ధరతోనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో జనగామ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ సస్పెండ్ అయ్యారు. అయినప్పటికీ జనగామ మార్కెట్ యార్డ్‌లో పరిస్థితి మెరుగుపడలేదు. కాగా, గత వారం నాలుగు రోజుల సెలవుల అనంతరం 16వ తేదీన ప్రారంభమైన మార్కెట్ యార్డ్‌కు రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని తీసుకువచ్చారు. ఈ ధాన్యాన్ని పూర్తిస్థాయిలో వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో పాటు మద్దతు ధరనూ ఇవ్వకపోవడంతో రైతులు మళ్లీ ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళనతో అధికారులు మార్కెట్ యార్డ్‌కు మళ్లీ ఐదు రోజులు సెలవులు ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేయాల్సిన అధికారులు.. కుంటిసాకులు చెబుతూ, కారణం లేకుండా సెలవులు ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఒక్కరోజు పడుతుందని, కానీ 5 రోజులు సెలవులు ఎందుకు



ఇచ్చారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

జనగామ జిల్లాలో 1,80,500 ఎకరాల్లో వరి సాగు చేయగా 4.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వీటిలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేపడుతుందని, మిగిలిన ధాన్యమంతా ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తారని అధికారుల అంచనా. ఇందులో ఎక్కువ శాతం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారస్తులు కొనుగోలు చేసే పరిస్థితి ఉంది. ఈ మార్కెట్‌కు జనగామ జిల్లాతో పాటు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వస్తారు.

పై అధికారుల ఆదేశాల మేరకే..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనగాం మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు నిలిపివేశాం. ఎప్పుడు ప్రారంభించేది చెప్పలేం. శుక్ర, శని, ఆదివారాల్లో మార్కెట్‌లో ఉన్న ఖరీదుదారులు, హమాలీ తదితర సమస్యల పరిష్కారానికి అధికారులు ఆదేశించారు.

శ్రీనివాస్, మార్కెట్ ఇన్‌చార్జి సెక్రటరీ

మద్దతు ధర కరువు..

జనగామ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయలేమని వ్యాపారస్తులు తెగేసి చెబుతున్నారు. 16వ తేదీన కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు సెలవులు ప్రకటించామని వ్యవసాయ శాఖ అధికారులు సాకుగా చెబుతున్నారు. కాగా, ధాన్యాన్ని రెండు రోజుల్లో తరలించే అవకాశం ఉన్నా.. మార్కెట్‌కు 17వ తేదీ నుంచి 21 వరకు సెలవులు ప్రకటించడం గమనార్హం. గతేడాది ఏప్రిల్ వరకే 95 వేల క్వింటాళ్ల వరకు వ్యాపారస్తులు ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు 69,930.10 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. దీనికి తోడు రైతులకు మద్దతు ధర కరువైంది. గరిష్ట ధర రూ.1800 కాగా కనిష్ట ధర రూ.1500కు వ్యాపారస్తులు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత మార్కెట్ సెక్రటరీ సస్పెండ్ కావడం, కొందరు వ్యాపారస్తులపై కేసు నమోదు కూడా జరిగింది. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించింది. కానీ, జనగామ మార్కెట్ యార్డ్‌లో మద్దతు ధరలు కల్పించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే మార్కెట్‌లో రైతుల ఆందోళనలు జరుగుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



జనగామ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే చేపట్టాలి. ఒక్కరోజు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వారాల తరబడి తరలించడం, ఆ సాకుతో ఐదు రోజుల సెలవు ప్రకటించడం దుర్మార్గం. పంటలు పండించిన రైతులు అమ్ముకోలేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి మద్దతు ధరతో రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి.

మోకు కనకారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు

ముగిసిన మావోయిస్టు శంకర్రావు దంపతుల అంత్యక్రియలు



- కన్నీటి వీడ్కోలు పలికిన చల్లగరిగ గ్రామస్తులు
- నివాళులర్పించిన పలు ప్రజా, పౌర హక్కుల సంఘాల నాయకులు

నవతెలంగాణ-చిట్యాల

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ సమీపంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు నేత సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, ఆయన భార్య సర్వర్ సుమన అలియాస్ రజిత అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజా, పౌర సంఘాల నాయకులు హాజరయ్యారు. సిరిపెల్లి సుధాకర్ దంపతుల మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే తల్లి రాజపోచమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. చల్లగరిగ గ్రామస్తులు సుధాకర్ దంపతుల మృతదేహాలకు నివాళులర్పించి విప్లవ జోహార్లు తెలిపారు. కాగా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇంటెలిజెన్స్, సివిల్ పోలీసులు మఫ్టీలో అంత్యక్రియలను పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సుధాకర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పౌర, ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ.. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో సుమారు 70 మందికి పైగా మావోయిస్టులను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారని అన్నారు. విషపూరితమైన ఆహారాలు ఇచ్చి డ్రోన్ కెమెరాలతో వారి ఆచూకీ తెలుసుకొని వారిని కాల్చి చంపుతున్నారని తెలిపారు. ఉద్యమంలో అసువులు బాసిన సిరిపెల్లి సుధాకర్-రజిత దంపతుల మృతదేహాలకు ఎర్రజెండా కప్పి అమర్ రహే అంటూ నివాళులర్పించారు.

డిండితో పాలమూరును కలపొద్దు

- సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శికి రిటైర్డ్ ఇంజినీర్ల విజ్ఞప్తి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కలపొద్దని రిటైర్డ్ హైదరాబాద్ ఇంజినీర్ల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జాకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఎదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడం మూలంగా కొత్త సమస్యలు తలెత్తుతాయని రిటైర్డ్ ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. దీని మూలంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు అవసరాలకు నష్టం జరుగుతుందని గుర్తు చేశారు. డిండికి జీవో నెంబరు 107 ద్వారా శ్రీశైలం రిజర్వాయర్‌లోని 30 టీఎంసీల్లో నుంచి రోజుకు 0.5 టీఎంసీల నీటిని అనుమతించారని చెప్పారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు 1.5 టీఎంసీల నీరు సరిపోదని ఇంజినీర్ల రౌండ్‌టేబుల్ సమావేశం అభిప్రాయపడిందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డికి కనీసం 2 టీఎంసీల నీరు అవసరమని వివరించారు. ఈ మేరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘానికి పంపించారని తెలియజేశారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-1 నుంచి గ్రాంట్లు ఉన్నాయని చెప్పారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్వతంత్ర ప్రాజెక్టు అని, దీనికి పాలమూరులోని ఎదుల రిజర్వాయర్ నుంచి నీటి కేటాయింపుల్లేవి గుర్తు చేశారు. శ్రీశైలం నుంచి పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీలు ఎత్తిపోస్తారని అసెంబ్లీలో సీఎం చెప్పిన విషయాన్ని సైతం ముఖ్యకార్యదర్శి దృష్టికి తెచ్చారు. డిండి ఎత్తిపోతల అవసరాలు కూడా శ్రీశైలం నుంచే నెరవేరుస్తారని చెప్పారని వివరించారు. పరిస్థితులు, వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యకార్యదర్శికి రిటైర్డ్ ఇంజినీర్లు విజ్ఞప్తి చేశారు.

తెలుగు విశ్వవిద్యాలయాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్

- ఘనంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 38వ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ-దుండిగల్

తెలుగు సాహిత్యాన్ని పరిరక్షిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి కృషి జరగాలని పద్మశ్రీ, ఎస్వీ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వ విద్యాలయం ప్రతి ఏటా సాహిత్య, సాంస్కృతిక, లలిత కళా రంగాల నుంచి ప్రముఖులను ఎంపిక చేసి విశిష్ట పురస్కారం పేరిట వారిని సత్కరిస్తుంది. ఈ ఏడాదికిగాను ప్రముఖ చిత్రకారులు సి.వి అంబాజీని విశిష్ట పురస్కారం జ్ఞాపికతో పాటు లక్ష రూపాయలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. పురస్కారాలను అందించడమే కాకుండా దేశీయ జానపద, సంప్రదాయ కళలను సమాజానికి అందించే దిశగా వర్సిటీ పనిచేయాలని సూచించారు. భరతనాట్యం వంటి సంప్రదాయ నృత్య గానాలను అందించే విద్యార్థులు వర్సిటీలో ఉండటం అదృష్టమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో వెయ్యేండ్ల కాలం వరకు నిలిచే విధంగా తెలుగు విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాలని, వర్సిటీలోని శాఖలన్నింటికీ పూర్తిస్థాయి భవనాలు నిర్మించే విధంగా రూపకల్పన జరగాలనే సంకల్పంతో బాచుపల్లి ప్రాంగణంలోకి అడుగు పెట్టామని తెలిపారు. ఉపాధ్యాయ బోధన సిబ్బంది, విద్యార్థుల సమిష్టి సహకారం ఉండటం వల్లే 38వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మెదక్ జిల్లాలోని పేద కుటుంబం నుంచి వచ్చి ఎంతో కష్టపడి దేశ ఖండాంతరాలను దాటి గుర్తింపు పొందిన అంబాజీకి విశిష్ట పురస్కారం ఇవ్వడం గౌరవంగా ఉందని తెలిపారు.

ప్రభుత్వ ఉన్నతాధికారి, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి.. మాట్లాడుతూ.. విశిష్ట పురస్కారానికి తెలుగు సాహితి సాంస్కృతిక రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖుని పేరును జత చేస్తే మరింత శోభాయమానంగా ఉంటుందని సూచించారు. పురస్కార గ్రహీత అంబాజీ మాట్లాడుతూ.. పురస్కారాన్ని అందచేసినందుకు వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విశిష్ట అతిథులను సత్కరించారు. అంతకుముందు ప్రముఖులను వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్ స్వాగతం పలుకుతూ విశ్వవిద్యాలయ స్థాపక ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా విస్తరణ సేవ విభాగం సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి వ్యవహరించారు. విశ్వ విద్యాలయ లలిత కళా పీఠం జానపద సంగీత నృత్య విద్యార్థి, విద్యార్థినుల ప్రదర్శనలు రక్తి కట్టించాయి.

కాంగ్రెస్ లో చేరిన రవీంద్రనాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రవీంద్రనాయక్ హస్తం గూటికి చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే (రాజేంద్రనగర్ నియోజకవర్గం) ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రి కలిశారు. ఒకట్రెండు రోజుల్లో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరతానని ఆయన రేవంత్ రెడ్డితో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా సభ్యత్వాన్ని అడ్డుకున్న అమెరికా



ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా సభ్యత్వానికి మార్గాన్ని సుగమం చేసే భద్రతా మండలి తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఏకైక సభ్యదేశంగా అమెరికా నిలిచింది. అంతేకాకుండా అమెరికా తన వీటో అధికారాన్ని వినియోగించి పాలస్తీనా ఐక్యరాజ్య సభ్యత్వ ఆకాంక్షను నిరోధించింది. ఐక్యరాజ్య సమితిలోని అమెరికా డిప్యూటీ రాయబారి రాబర్ట్ వుడ్ ఏప్రిల్ 18, 2024న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో పాలస్తీనాకు ఐక్యరాజ్య సమితి సభ్యత్వాన్ని అనుమతించే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాడు. పాలస్తీనాకు ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో శాశ్వత పరిశీలక దేశం హెూదా ఉంది. ఇది సమావేశాలలో పాల్గొంటుంది కానీ ఓటింగ్ హక్కులు ఉండవు. 'పాలస్తీనా ఒక దేశంగా పరిగణించబడే ప్రమాణాలకు అనుగుణంగా ఉందా లేదా అనే దానిపై అపరిష్కృత ప్రశ్నలు ఉన్నాయి' అని ప్రత్యేక రాజకీయ వ్యవహారాల అమెరికా ప్రత్యామ్నాయ ప్రతినిధి రాబర్ట్ వుడ్ అన్నాడు. మిలిటెంట్ గ్రూప్ హమాస్ గాజాను నియంత్రిస్తున్నంత వరకూ పాలస్తీనాను ఐక్యరాజ్యసమితిలో చేర్చుకోలేమని ఆయన వాదించాడు. ఇజ్రాయిల్, పాలస్తీనా కోసం రెండు-దేశాల పరిష్కారానికి వాషింగ్టన్ మద్దతునిస్తూనే ఉందని వుడ్ చెప్పాడు. పాలస్తీనియన్లు వారి స్వంత దేశాన్ని కలిగి ఉండటానికి అర్హులు కాదు అనే భావనను అమెరికా ఓటు చూపించిందని భద్రతా మండలిలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా మాట్లాడుతూ అన్నాడు. ఈరోజు అమెరికా ప్రతినిధి బందం వీటోను ఉపయోగించడం అనేది చరిత్ర యొక్క అనివార్యమైన గమనాన్ని ఆపడానికి ఒక నిస్సహాయ ప్రయత్నం. అమెరికా తన ఓటు, వీటోతో నేడు అంతర్జాతీయ సమాజంలో ఒంటరి అయింది" అని నెబెంజియా చెప్పాడు. పాలస్తీనా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం మా ప్రయత్నం కొనసాగుతుంది" అని పాలస్తీనా రాయబారి మజేద్ బామ్యా నొక్కి చెప్పాడు.గాజాలో ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధం ఏడో నెలలోకి ప్రవేశించిన సందర్భంగా భద్రతా మండలి సమావేశం జరిగింది. అక్టోబర్ 7 నుండి దాదాపు 34,000 మంది పాలస్తీనియన్లు చంపబడ్డారని స్థానిక అధికారులు నివేదించారు.

ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి



ఇజ్రాయిల్ శుక్రవారం తెల్లవారుజామున ఇరాన్‌పై వరుస క్షిపణి దాడులు చేసిందని పలు వార్తా సంస్థలు రిపోర్ట్ చేశాయి. ఇజ్రాయిల్‌పై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులతో పెద్ద ఎత్తున దాడిచేసిన వారంలోపే ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేసినట్టు తెలుస్తోంది. మధ్య ఇరాన్ నగరమైన ఇస్ఫహాన్ మీదుగా ఆకాశంలో స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 4 గంటలకు అనేక పేలుళ్ల వినిపించాయని ఇరాన్ వార్తా సంస్థ మెహర్ పేర్కొంది. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో వాయు రక్షణ వ్యవస్థను ,సిరియా, ఇరాక్‌లలోని మిలిటరీ ఎయిర్‌ఫీల్డ్‌లు, రాడార్ సైట్లపై కూడా ఇజ్రాయిల్ దాడి చేసిందని ఐఆర్ఎస్ఏ వార్తా సంస్థ తెలిపింది.

ఇరాన్ పౌర అంతరిక్ష కార్యక్రమ ప్రతినిధి హెుస్సేన్ దాలిరియన్, ఇస్ఫాహాన్ నగరంపై అనేక డ్రోన్‌లను కాల్చివేసినట్లు ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో రాశాడు. నగరంపై మూడు డ్రోన్లు ధ్వంసమయ్యాయని ఇరాన్ టీవీ తర్వాత తెలిపింది. టెహ్రాన్, ఇస్ఫాహాన్‌తో సహా అనేక విమానాశ్రయాలలో విమానాలను ఇరాన్ నిలిపివేసిందని అల్ జజీరా ప్రసారం చేసింది. అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోలేదని పేరు చెప్పని అమెరికా అధికారిని సీఎన్ఎన్ ఉదహరించింది. ఇరాన్, సిరియాలలో దాడుల గురించి అడిగినప్పుడు ఇజ్రాయిల్ సైన్యం ఏఎఫ్‌పీ వార్తా సంస్థకి ఇలా చెప్పింది. ఈ సమయంలో మేము ఎటువంటి వ్యాఖ్యనూ చేయదలచలేదు. ఇస్ఫాహాన్‌లో వినిపించిన పేలుళ్లకు ఇజ్రాయిల్ కారణమని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్‌కు ధవీకరించడానికి ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం నిరాకరించింది. సిరియా రక్షణ మంత్రిత్వ శాఖ ఇజ్రాయిల్ దాడిని ధవీకరించింది.

ఇది స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగిందని, దేశం దక్షిణానగల వైమానిక రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్టు పేర్కొంది. దాడి ఫలితంగా భౌతిక నష్టం జరిగిందని మరిన్ని వివరాలను అందించకుండానే మంత్రిత్వ శాఖ తెలిపింది.ఏప్రిల్ 1వ తేదీనాడు ఇజ్రాయిల్ సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంపై దాడి చేసింది. ఆ దాడిలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కుడ్స్ ఫోర్స్‌కు చెందిన ఏడుగురు సీనియర్ అధికారులు చనిపోయారు. ఏప్రిల్ 13న ఇజ్రాయిల్‌పై కామికేజ్ డ్రోన్‌లు, క్షిపణులతో ఇరాన్ దాడి చేసింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ మెజారిటీ క్షిపణులను విజయవంతంగా అడ్డగించామని, స్వల్ప నష్టం మాత్రమే జరిగిందని ప్రకటించింది.ఇజ్రాయిల్ తన దేశానికి వ్యతిరేకంగా ఏదైనా తదుపరి సైనిక చర్య తీసుకుంటే, ఇరాన్ ప్రతిస్పందన తక్షణమే గరిష్ట స్థాయిలో ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్- అబ్దోల్లాహియాన్ సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ చెప్పాడు. ఇజ్రాయిల్ పాలన మరోసారి ఘోరమైన తప్పిదానికి పాల్పడితే, మా నిర్ణయాత్మక ప్రతిస్పందన వారికి కచ్చితంగా విచారాన్ని కలిగిస్తుంది అని టెహ్రాన్‌లోని స్విస్ రాయబార కార్యాలయం ద్వారా వైట్ హౌస్‌కు హెచ్చరిక పంపినట్లు ఆయన వివరించాడు.

కేసీఆర్ బస్సు యాత్ర

- ఎల్లుండి నుంచి మే 10 వరకు నిర్వహణ షెడ్యూల్ ఖరారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొత్తం 19 రోజులపాటు బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈనెల 22 నుంచి మే 10 వరకు ఆయన ఈ యాత్రను నిర్వహించనున్నారు. సంబంధిత షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. గురువారం ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో యాత్రకు సంబంధించి పలు రకాల ప్రతిపాదనలొచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించి ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ మరోసారి రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే సూచించాలంటూ కేసీఆర్ నేతలను ఆదేశించారు. ఏయే జిల్లాల్లో ఎక్కడెక్కడి నుంచి యాత్రను ప్రారంభించాలి, ఎక్కడ ముగించాలనే దానిపై ఇంకొంత స్పష్టత రావాల్సి ఉందని తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు బస్సు యాత్రకు అనుమతివ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను ఆ పార్టీ కోరింది. ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేసీఆర్ యాత్ర వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా అధికారులందరూ ఈసీ పరిధిలోకి వస్తారు కాబట్టి, యాత్రకు సంబంధించి తగు భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, అవసరమైతే కేంద్ర బలగాలను మొహరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడుతోందని వాసుదేవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఫ్లెక్సీలు, బ్యానర్లను కాంగ్రెస్ నేతలు చించేస్తున్నారని వాపోయారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో జరిగిన కొన్ని ఘటనలను ఆయన ఈ సందర్భంగా ఈసీ దృష్టికి తెచ్చారు.

నామినేషన్ల దాఖలుకు ఆ ఇద్దరు గైర్హాజరు...

ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు హాజరవుతుండగా, బీఆర్ఎస్‌లో అందుకు భిన్నంగా పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సన్నద్ధమవుతున్న సంగతి విదితమే. అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గురువారం పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్ దాఖలుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరు కావాల్సి ఉంది. కానీ వారిద్దరూ ఆయా కార్యక్రమాలకు హాజరు కాలేదు. బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారుపై కసరత్తులు చేయాల్సి ఉన్నందున నందినగర్‌లోని తన నివాసానికి రావాలంటూ కేసీఆర్ సూచించిన దరిమిలా వారిద్దరూ ఆయన వద్దకు వెళ్లినట్టు సమాచారం. అందుకే నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి వారు వెళ్లలేకపోయారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు సికింద్రాబాద్‌లో పద్మారావు, నాగర్ కర్నూల్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ల దాఖలు కార్యక్రమాలకు ఆయా లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

రేపు టీఎస్ఆర్జేసీ పరీక్ష

- హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ఆర్జేసీ సెట్ రాతపరీక్ష ఆదివారం జరగనుంది. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సి హెచ్ రమణకుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీలో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశం కోసం పదో తరగతి పరీక్షలకు హాజరైన రాష్ట్రంలోని 73,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో ఇప్పటి వరకు 60 వేల మంది విద్యార్తులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు హాల్‌టికెట్లను హ్ట్ప్స్://ట్స్ర్జ్ద్క్.cగ్గ్.గొవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో ఈనెల 21వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టీఎస్ఆర్జేసీ రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాలమూరుకు పట్టిన దరిద్రమే కాంగ్రెస్

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమూరుకు పట్టిన దరిద్రమే కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. నాలుగున్నర దశాబ్దాల ఆ పార్టీ పాలనలో 14 లక్షల మంది పాలమూరు బిడ్డలు ఉపాధి లేక వలస బాట పట్టారని గుర్తు చేశారు. ఇలాంటి వాస్తవాలను పక్కన పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి జూరాల, కెఎల్ఐ కింద 13 వేల ఎకరాలు మినహా ఉమ్మడి పాలమూరులో ఎక్కడా ఆయకట్టు లేదని తెలిపారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రెండేండ్లలో జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు నీరందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి పరిధిలో ఉన్న ఉద్దండాపూర్ కాలువ ద్వారా నీళ్లు తీసుకెళ్లకుండా రేవంత్ తన ప్రాంతానికి లబ్ది చేకూర్చేందుకు నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో కొత్త నాటకానికి తెరతీసారని విమర్శించారు. తెలంగాణను అన్ని రంగాల్లో పరుగులు పెట్టించిన కేసీఆర్‌ను కన్ను మిన్ను కానకుండా సీఎం మాట్లాడటం సరికాదన్నారు. ఇప్పటికైనా రేవంత్ తన బాషను మార్చుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ సర్కార్ మంజూరు చేసిన విద్యాసంస్థలు, 30 వేల ఉద్యోగాలను తామే ఇచ్చామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మీడియా మేనేజ్ మెంట్, పీఆర్ స్టంట్లతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపిస్తోందనిఎద్దేవా చేశారు. ఎన్నికల ముందిచ్చిన హామీలు నెరవేర్చకుంటే జనం కాంగ్రెస్‌ను బండకేసి కొడతారని హెచ్చరించారు.

ఎండావాన

- రాష్ట్రంలో విభిన్న వాతావరణం
- 90 కిపైగా ప్రాంతాల్లో వర్షం
- నిజామాబాద్ జిల్లా గంగారంలో 5.55 సెంటీమీటర్ల వాన
- మాద్గులపల్లి(నల్లగొండజిల్లా)లో 44.8 డిగ్రీల ఎండ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శుక్రవారం విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు భానుడు భగభగ మండుతూ తన ప్రతాపాన్ని చూపగా..అదే సమయంలో పలుజిల్లాల్లో వర్షం కూడా పడింది. శుక్రవారం రాత్రి 10 గంటలకు 90కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గంగారంలో అత్యధికంగా 5.55 సెంటీమీటర్ల వర్షం పడింది. నిజామాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, రాజన్నసిరిసిల్ల, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, జనగాం, పెద్దపల్లి, ఆదిలాబాద్, వనపర్తి, నారాయణపేట, సిద్ధిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలుచోట్ల వర్షం పడింది. మొత్తం 18 ప్రాంతాల్లో మోస్తరు వానపడగా, మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వచ్చే మూడ్రోజులు కొంతమేర ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే ఐద్రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయి. 30 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కట్టంగూర్(నల్లగొండ) 44.7 డిగ్రీలు, సుజాతానగర్(భద్రాద్రి కొత్తగూడెం) 44.6 డిగ్రీలు, చాప్రాల్ (ఆదిలాబాద్) 44.6 డిగ్రీలు, ములుగు 44.6 డిగ్రీలు, తిరుమలగిరి సాగర్(నల్లగొండ) 44.6 డిగ్రీలు, అల్లీపూర్(జగిత్యాల)44.5 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

రెండో రోజూ భారీగా నామినేషన్లు

51 మంది అభ్యర్థులు దాఖలు

- ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున కొంతమంది మొదటి సెట్టు నామినేషన్
- స్వతంత్రులూ రంగంలోకి..



నవతెలంగాణ- విలేకరులు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండో రోజూ శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 51 మంది నామినేషన్లు వేశారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా ముహమ్మద్ చాంద్ పాషా, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతి నామినేషన్ వేశారు.నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు దాఖల య్యాయి. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ధర్మసమాజ్ పార్టీ తరపున తలారి రాంబాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) తరపున వసుకుల మట్టయ్య, కిన్నెర యాదయ్య స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనకు వీరు నామినేషన్ పత్రాలను సమర్పించారు. భువనగిరిలో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ ఒక సెట్ నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, సోషలిస్ట్ పార్టీ (ఇండియా) అభ్యర్థిగా రచ్చ సుభద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా మెగావత్ చందు నాయక్, రేకల సైదులు ఒక సెట్ నామినేషన్ వేశారు.నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నామినేషన్ వేశారు. మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వంశీచందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా హరేందర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సరోజమ్మ, ఉమా శంకర్ నామినేషన్లు వేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైంది. కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఓ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, కరీం, నాయకులు శ్రీలేఖ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయి.

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రెండోరోజూ ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి అరవింద్ ధర్మపురి నామినేషన్ దాఖలు చేశారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థులు రాపెల్లి శ్రీనివాస్, రాగి అనిల్ ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కండెల సుమన్ నామినేషన్ వేశారు.

మెదక్ లోక్‌సభ నియోజక వర్గానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరి గౌడ్, స్వతంత్ర అభ్యర్థులు బొమ్మల విజయ్ కుమార్, తుమ్మలపల్లి పద్వీరాజ్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి గొల్లపల్లి సాయి గౌడ్ నామినేషన్లు వేశారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధిం చి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బి.మారుతీరావు, కె.ఆనందీశ్వర్ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు, మహాదేవ్ స్వామి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులు పాల్వంచ దుర్గ, బోడ అనిల్ నాయక్, ఆధార్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జాటోత్ రఘు నాయక్ నామినేషన్ దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. ఖమ్మం పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ వేసిన సందర్భంగా ఖమ్మంలో భారీ రోడ్ షో నిర్వహించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇద్దరు నామినేషన్లు చేశారు. హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ అక్రమ్ అలీఖాన్ ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్ అనుదీప్ దురిశెట్టికి సమర్పించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండో రోజు ఆరుగురు నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి 4 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీఆర్ఎస్ నుంచి పద్మారావు గౌడ్ 2 సెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి చంద్రశేఖర్ ఒక్క సెట్, ఎస్‌యూసీఐ (కమ్యూనిస్టు) నుంచి ఆర్.గంగాధర ఒక్క సెట్, యుగ తులసి పార్టీ నుంచి కె.శివకుమార్ ఒక్క సెట్, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) నుంచి బి.సునితారాణి ఒక్క సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ ఆఫీసర్ హెమంత్ కేశవ్ పాటిల్‌కు అందజేశారు. మేడ్చల్ పార్లమెంట్ స్థానానికి ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయి వరప్రసాద్, రాజేష్ మిశ్రా శివ్, చలిక చంద్రశేఖర్, ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, కుడుపూడి వివిఎస్ నారాయణ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు వేశారు.

ఈబీ కుంభకోణంపై విచారణ జరపాలి

- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నల్లధన్నాన్ని తెల్లధనంగా మార్చేందుకే ఈ బాండ్లు
- ప్రత్యక్ష పన్నుల వాటాను 12 నుంచి 13 శాతానికి పెంచాలి
- పౌరసమాజంలో చైతన్యం మరింతగా పెరగాలి
- అప్పుడే నల్లధనానికి అడ్డుకట్ట : వెబినార్‌లో ప్రముఖ ఆర్థిక వేత్త, జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ఎన్నికల బాండ్ల కుంభకోణంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, లేదా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఆర్థిక వేత్త, జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఎన్నికల బాండ్లు...నల్లధన్నాన్ని అరికట్టాయా?" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. బీజేపీ సర్కార్ తీసుకొచ్చిన ఈ విధానం వల్ల నల్లధనం తగ్గక పోగా, వాటిని చట్టబద్ధంగా చలామణి చేసేందుకు మార్గం సుగమమైందని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, బడా కాంట్రాక్టర్లు, వ్యక్తులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, అందుకు బదులుగా వారి నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీ లబ్ది పొందుతోందని విమర్శించారు. తమ మాట వినని వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ తదితర సంస్థలతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. రూ.76 వేల కోట్ల నష్టాల్లో ఉన్న భారతీ ఎయిర్‌టెల్ సంస్థ బాండ్లు కొనుగోలు చేసిన తర్వాతే టెలికాం, స్పెక్ట్రమ్ పాలసీని వారికనుకూలంగా మార్పులు చేశారని గుర్తు చేశారు. ఫలితంగా ఆ సంస్థకు అనేక రాయితీలు దక్కాయని చెప్పారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అప్రూవర్‌గా మారిన వ్యక్తి బీజేపీకి రూ.5 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో చెల్లించిన తర్వాతే అతనికి బెయిల్ లభించిందని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు రూ.లక్ష కోట్ల వరకు ఖర్చవుతాయని భావిస్తున్న నేపథ్యంలో అందుకు అభ్యర్థులు చేసే ఖర్చును రెండు నుంచి మూడు శాతం మాత్రమే ఎన్నికల సంఘానికి చెబుతున్నారని గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్థి రూ.75 నుంచి రూ.95 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలి, కానీ నేడు సగటున రూ.50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో లెక్కకు రాని మిగతా సొమ్మంతా నల్లధనమేనని పేర్కొన్నారు. ఈ విధానంలో ఎవరు ఎన్ని నిధులిస్తున్నారు? ఎవరికి ఇస్తున్నారు? అనే విషయం గోప్యంగా ఉంచారని తెలిపారు. ఫలితంగా ఈ నిధుల సేకరణలో అనేక అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. "ఎన్నికల బాండ్ల వల్ల రాజకీయాల్లో కార్పొరేట్లు, పెట్టుబడిదారులు, కంపెనీల ప్రాబల్యం పెరుగుతోంది. ఫలితంగా దేశ రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక, సామాజిక రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. పాలన, పాలసీల రూపకల్పన, సంక్షేమ పథకాల అమలు అన్ని వారి కనుసన్నల్లోనే జరుగుతాయి. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. నల్లధనాన్ని అరికట్టేందుకు ప్రత్యక్ష పన్నుల వాటాను స్థూల జాతీయోత్పత్తిలో 12 నుంచి 13 శాతం వరకు పెంచాలి. ప్రశ్నించే తత్వంతో పాటు అన్ని రంగాల్లో జవాబుదారీ తనం పెరగాలి. ప్రజల్లో చైతన్యం రావాలి. అప్పుడే నల్లధనాన్ని కొంతలో కొంతైనా అరికట్టవచ్చు" అని ఆయన తెలిపారు. ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో కొండూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే

- ఆసక్తికరంగా సార్వత్రికం
- మూడు పార్టీల మధ్య 'జంగ్'
- సర్వే సంస్థల హడావిడి
- ఇంటెలిజెన్స్ ఆరాటం
- ఎర్రటి ఎండల్లో ప్రచారం
- అప్రమత్తతలో రాజకీయ పార్టీలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు ఆసక్తిని రేపుతున్నాయి. మరో మూడు వారాల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో హడావిడి పెరిగింది. రెండు రోజులుగా నామినేషన్ల స్వీకరణ సైతం జరుగుతోన్నది. 17 లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ నిర్వహించనున్నారు. దేశవ్యాప్త ఎన్నికల ప్రక్రియలో భాగంగా నాలుగో దశలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, సీపీఐ(ఎం), ఏఐఎంఐఎం తదితర పార్టీలు ఎన్నికల బరిలో ఉన్నాయి. తమ సత్తా చాటేందుకు శ్రమిస్తున్నాయి. ఎర్రటి ఎండల్లో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నాయి. దాదాపు 3.31 కోట్లకుపైగా ఓటర్లు తమ తమ ఎంపీలను ఎన్నుకోనున్నారు. ఇదిలావుండగా మధ్యలో ప్రముఖ టీవీలు, సర్వే సంస్థలు, ప్రభుత్వ ఇంటెలిజెన్స్ సైతం హడావిడి చేస్తున్నాయి. ఆరాటపడుతున్నాయి. వచ్చే ఐదేండ్ల దేశ భవిత్యాన్ని ప్రజలు ఎవరి చేతుల్లో పెట్టబోతున్నారనే సంగతిని ముందుగానే పసిగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆసక్తి, అప్రమత్తతను ప్రదర్శిస్తున్నాయి. మధ్యలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ సైతం దేగ కన్నేసింది. రాష్ట్రంలో అణువణువూ గాలిస్తోంది. కాగా ఈ ఎన్నికల్లో అన్నీ పార్టీలు తమ గెలుపు పట్ల ధీమాతో ఉన్నాయి.

ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తమ పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎక్కడిక్కడ సభలు, సమావేశాల ద్వారా ప్రజలను కూడగట్టి ఓట్లరూపంలో సొమ్ముచేసుకునేందుకు కృషిచేస్తున్నాయి. మ్యానిఫెస్టోల ద్వారా తమ విధానాలను ప్రజల ముందుంచే ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ ఏకంగా తమ జాతీయ పార్టీ మ్యానిఫెస్టోను హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో విడుదల చేసింది. బీజేపీ సైతం తెలుగు కాపీని ప్రజలకు పంపింది. బీఆర్ఎస్ తమ విధానాలను ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంది. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకుగాను మూడు ఎస్సీ, రెండు ఎస్టీ సీట్లు. ఎలాంటి పరిస్థితుల్లోనూ 14 నుంచి 15 స్థానాల్లో గెలుపొందాలని కాంగ్రెస్ చెమటోడుస్తోంది. తమ బలాన్ని మరింత పెంచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. టికెట్లు తీసుకుని పోటీ చేయడానికి నిరాకరించిన పరిస్థితుల్లో పరువు కాపాడుకునే యత్నాల్లో బీఆర్ఎస్ ఉంది. ఎక్కువ సర్వే సంస్థలు కాంగ్రెస్‌కే డప్పుకొడుతున్నాయి. కొన్ని సీట్లు ఇతర పార్టీలకూ వస్తాయని చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు మాత్రం గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో జల్లెడపడుతున్నాయి. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లల్లోనూ ప్రజల అంతరంగాన్ని తెలుసుకుంటున్నాయి. నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్,వరంగల్,నిజామాబాద్ ,మల్కాజ్‌గిరి ,సికింద్రాబాద్, మహబూబ్ నగర్,భువనగిరి, మహబూబాబాద్, పెద్దపల్లి సీట్లపై ఆసక్తి నెలకొంది. వేగులు సైతం ఈ సీట్లపై పదే పదే ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలో గత మూడు వారాల్లో రెండేసీసార్లు జనం నాడిని పట్టుకునేందుకు ప్రయ త్నాలు జరిగినట్టు సమాచారం. ఎస్సీ, ఎస్టీ సీట్లపైనా ప్రత్యేక దృష్టి ఉంది.భారీ బహిరంగసభలు పెడు తూనే సామాజిక తరగతులవారీగా గంపగుత్తగా ఓట్లను మూటకటుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ వ్యూహరచన చేస్తున్నాయి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు తెలంగాణ ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే పాల్గొన్నారు. అలాగే విచ్చలవిడిగా డబ్బులను ఖర్చుపెడుతున్నాయనే సంగతి బహిరంగ సత్యం.

రెండో రోజూ 69 నామినేషన్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రెండో రోజూ 69 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ (ఎస్టీ), నాగర్‌కర్నూల్ (ఎస్సీ), ఖమ్మం ఎంపీ స్థానాలకు ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు వేశారు. మిగిలిన స్థానాల్లో ఒక్కరి కన్నా ఎక్కువ మంది నుంచి నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా మొదటి రోజు 48 నామినేషన్లతో కలుపుకుని ఇప్పటి వరకు మొత్తం 117 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 25 వరకు నామినేషన్లను దాఖలు చేసేందుకు గడువుంది.

టెట్ దరఖాస్తుకు నేడే ఆఖరు

- ఇప్పటి వరకు 2.63 లక్షల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు గడువు శనివారంతో ముగియనుంది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 93,817 మంది, పేపర్-2కు 1,69,411 మంది కలిపి 2,63,228 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. శుక్రవారం ఒక్క రోజే పేపర్-1కు 899 మంది, పేపర్-2కు 2,420 మంది కలిపి మొత్తం 3,319 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఇప్పటి వరకు 14,302 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సవరణ చేసుకున్నారని తెలిపారు. ఇందులో పేపర్-1కు 5,329 మంది, పేపర్-2కు 8,973 మంది ఉన్నారని పేర్కొన్నారు. దరఖాస్తుల సవరణకూ శనివారం వరకే గడువుందని వివరించారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఏపీ తరహాలో మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలి

- బుర్రా వెంకటేశానికి టీఎంఎస్‌టీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ మోడల్ స్కూల్ టీచర్ల మాదిరిగా తెలంగాణలో కూడా మోడల్ స్కూల్ టీచర్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు, ఉపాధ్యక్షులు సిలివేరు స్వామి కలిసి వినతిపత్రం సమర్పించారు. 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 357 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో 194, ఏపీలో 163 స్కూళ్లు ఉన్నాయని వివరించారు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం సొసైటీ పరిధిలో పనిచేస్తున్నారని తెలిపారు. ఏపీలో పనిచేస్తున్న మోడల్ స్కూల్ టీచర్లను ఇటీవల పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. తెలంగాణలో 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న మూడు వేల మంది రెగ్యులర్ ఉపాధ్యాయులను కూడా పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు.

బంజారాహిల్స్ ఏసీపీ సెస్పెండ్

- జూబ్లీహిల్స్ సీఐ, ఎస్సైల పైనా వేటు
- డీజీపీ ఆదేశాలు

నవతెలంగాణ-ప్రత్యేకప్రతినిధి:

రాష్ట్రంలో ఒక ఏసీపీ, సీఐ, ఎస్సై లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్, జూబ్లిహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఇదే పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డిలు సస్పెండైనవారిలో ఉన్నారు. రెండేండ్ల క్రితం జూబ్లిహిల్స్ పరిధిలో జరిగిన ఒక కార్ యాక్సిడెంట్ కేసుకు సంబంధించి దీనికి బాధ్యుడైన రాహెల్ షకీల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవటంలో విఫలమయ్యారని విచారణలో తేలింది. దీంతో ఈ ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు రాహెల్ షకీల్ అప్పటి బోదన్ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు. ఈ రోడ్డు ప్రమాదం కేసు ఆ సమయంలో రాష్ట్రంలో సంచలనం రేపింది.

సివిల్స్‌లో 200 మంది విజయానికి ఐపీఎస్ మహేశ్ భగవత్ టీం కృషి

- పట్టుదల, దీక్షతోనే అభ్యర్థులు ఫలితాలు సాధించారన్న అదనపు డీజీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఇటీవల యూపీఎస్సీ ప్రకటించిన సివిల్ సర్వీస్ ఫలితాల్లో దాదాపు 200 మంది అభ్యర్థులను నెగ్గించటంలో తమ టీం విజయం సాధించిందని రాష్ట్ర రైల్వే పోలీసు అదనపు డీజీ మహేశ్ ఎం. భగవత్ శుక్రవారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన సివిల్స్ రాసిన అభ్యర్థులకు ఇందులో సక్సెస్ సాధించటానికి తమ బృందం ఇచ్చిన పలు మార్గదర్శకాలు, సూచనలు, సలహాలు ఆశించిన ఫలితాన్నిచ్చాయని ఆయన చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా, వాట్సాప్ గ్రూపుల ద్వారా అభ్యర్థులకు శిక్షణనివ్వటం జరిగిందనీ, దీని వలన ముఖ్యంగా ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని అన్నారు. సివిల్స్ ఫలితాల్లో నెగ్గిన 3, 5, 16, 23 మొదలుకొని వంద ర్యాంకు లోపల మంచి ఫలితాలు సాధించారనీ, ఆ పైన కూడా ర్యాంకులలో విజయం వరించిందని ఆయన తెలిపారు.

నెగ్గినవారిలో మహబూబ్‌నగర్‌కు చెందిన అనన్య రెడ్డి మూడో ర్యాంకు సాధించగా, తెలంగాణ, ఆంధ్ర, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు పోలీసు ఉద్యోగస్తుల కుమారులు కూడా సివిల్స్ సాధించారనీ, ఇందులో ఒకరు కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ సివిల్స్ పరీక్షకు ప్రిపేరై విజయం సాధించారని ఆయన వివరించారు. వీరికి మార్గదర్శకత్వం నెరిపిన తమ టీంలో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, కస్టమ్స్ తదితర ఉన్నత విభాగాలకు చెందిన అధికారుల సేవలున్నాయనీ, ఈ ఫలితమంతా తమ సమిష్టి కృషికి దక్కిన విజయమని మహేశ్ భగవత్ అన్నారు. కృషి, పట్టుదల, దీక్షలతోనే సివిల్స్‌ను ఈ అభ్యర్థులంతా నెగ్గగలిగారని ఆయన అభినందించారు. వీరంతా విధి నిర్వహణలో తమతో పాటు దేశానికి మంచి పేరు, ప్రతిష్టలను తీసుకొస్తారనే ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలు

- ఏప్రిల్ 23న స్క్రీనింగ్ టెస్ట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు ఈనెల 23న పేరు నమోదు, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీకి చెందిన ఫెడరల్ ఎంప్లామెంట్ ఏజెన్సీ భాగస్వామ్యంతో అక్కడి బాషలో శిక్షణ ఇచ్చి, అనంతరం వారికి ఆ దేశంలోని నర్సు ఉద్యోగాల్లో అవకాశం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని గుర్తింపు కాలేజీల్లో బీఎస్సీ నర్సింగ్ చేసి, 21 నుంచి 38 సంవత్సరాల వయస్సుగలవారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. అలాగే ఐసీయూలో రెండు నుంచి మూడేండ్లు పని చేసిన అనుభవం ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9908830438, 8919047600, 7032379066 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దళితులపై దాడులను అరికట్టాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ - హస్తినాపురం

దళితులపై అక్కసుతో అగ్రవర్ణాలు చేస్తున్న దాడులను అరికట్టాలని, ఇలాంటి దాడులు చేస్తున్న వారిని చట్టపరంగా శిక్షించాలని సీపీఐ(ఎం) నందన వనం శాఖ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేవీపీఎస్ నాయకులు ఎల్లయ్య మాట్లాడుతూ అల్మాస్ గూడ విశాఖనగర్ ఫేస్ 3లో కాలనీ ఎన్నికల నేపథ్యంలో దళిత, బీసీ నాయకులు గడ్డం రవీందర్ వారి ప్యానల్ సభ్యులు గెలుపొందడం జీర్ణించుకోలేని కొంత మంది అగ్రవర్ణాల నాయకులు.. శ్రీ రామ నవమి రోజున వారి కుటుంబాలపైన దాడి చేయడం నీచమైన చర్య అని మండిపడ్డారు. ఈ ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసలకు తావు లేదని అన్నారు. అగ్రవర్ణాలు అహంకారంతో, విచక్షణ రహితంగా దుర్భాషలాడుతూ దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. రాజ్యంగ విలువలకు విరుద్ధంగా దాడులు చేస్తున్న వారికి చట్టపరమైన శిక్షలు అమలు చేయాలని సీపీఐ(ఎం) నాయకులు మంథని యాదయ్య కోరారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్టు



నవతెలంగాణ - చైతన్యపురి

ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పి అండ్ టి కాలనీ కోదండరాం నగర్‌లో నివాసముండే బి. శ్రీనివాస్ బైక్ మెకానిక్ చేస్తూ ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా.. గతంలో కూడా మూడు ద్వి చక్ర వాహనాలను దొంగిలించినట్లు తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.లక్ష యాభై వేలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



జహంగీర్ నామినేషన్‌కు

తరలిన సీపీఐ(ఎం) శ్రేణులు

నవతెలంగాణ-తుర్కయంజాల్

భువనగిరి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ నామినేషన్ సందర్భంగా భవన గిరి పట్టణంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ సీపీఐ(ఎం) పార్టీ నాయకులు రాగన్నగూడలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయం నుండి శుక్రవారం వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ పార్టీ కన్వీనర్ డి. కిషన్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల రథసారథి, కార్మిక, కర్షక వారధి, పేదల పెన్నిధి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌ను ప్రజలు ఆదరించి అభిమానించి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇతర పార్టీల నాయకులు వారి వారి రాజకీయ, వ్యాపార స్వ ప్రయోజనాల కోసం రోజుకో జెండా మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని, వారేనాడు ప్రజా సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ధన ప్రభావంతో, మత విద్వేషాలతో ప్రజల్ని మభ్యపెట్టి రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవాలని చూసే పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ ర్యాలీలో కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎంజె ప్రకాష్ కారత్, సీపీఐ(ఎం) పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు ఏం. సత్యనారాయణ, ఐ. భాస్కర్, కొండిగారి శంకర్, ఐ. కృష్ణ, కే. వెంకటకృష్ణ, జె. ఆశీర్వాదం, కె. అరుణ్ కుమార్, బి. మాల్యాద్రి, కె. సత్యం, యం.యాదయ్య, పి.శ్రీను, సాయి, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'170'కి పర్మిషన్..

నిర్మాణం 600 గజాల్లో..



మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

నోటీసులిచ్చి కూల్చేస్తున్నాం..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులకు నోటీసులు ఇస్తున్నాం. నూతనంగా ఇంటి నిర్మాణాలను చేపట్టే యజమానులు తప్పకుండా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలను చేపట్టే ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చి మరి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నాం.

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్
టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అడ్డూ అదుపు లేకుండా రోజు రోజుకూ విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే..మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ 14వ డివిజన్ పరిధిలో ఉన్న ఓ వ్యక్తి 170 గజాల ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని.. 600గజాల స్థలంలో సెల్లారు ఏర్పాటు చేసి భారీ ఎత్తున ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు.

ఈ విషయంపై స్థానికులు ప్రశ్నిస్తే.. తాను కంటెస్టెంట్ కార్పొరేటర్‌నని...ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇంటి నిర్మాణం చేస్తానని, నన్ను ఎవరూ ఏం చేసుకుంటారో చేసుకోండంటూ స్థానికులకు సమాధానం ఇస్తూ బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులను యథేచ్ఛగా చేస్తున్నాడు.

ఈ విషయంపై బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ .. చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చివేయాలని కోరారు. అంతేకాదు అక్రమ నిర్మాణ, సెల్లార్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సేవ చేసేందుకే

స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్



- **వైష్ణవీ ప్రసాద్**

నవతెలంగాణ- ఎల్బీనగర్

అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు మల్కాజిగిరి పార్లమెంట్ నియాజకవర్గం ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) వెల్లడించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియజకవర్గం ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కొత్తపేట మారుతినగర్‌లోని భాగ్యనగర్ బ్రహ్మణ సమాజం భవనం నుంచి శుక్రవారం ర్యాలీగా బయలు దేరారు. మోహన్ నగర్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట, న్యూనాగోలు, సమతపూరి కాలనీల మీదుగా ర్యాలీ కొనసాగింది. మల్కాజిగిరిలోని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్ నామినేషన్ పత్రాలను సమపర్పించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల మనిషిగా, ప్రజల మధ్యలోకి అడుగులు వేస్తున్నానని ప్రజాపాలనతో, అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ.. ప్రజా సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని స్పష్టం చేశారు. పేద ప్రజలకు మరింత మెరుగైన సేవే లక్ష్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తనను ఎంపీ గెలిపిస్తే నిరంతరం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియాజకవర్గాల అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ ఉచిత విద్య, వైద్యం, ప్రతి అసెంబ్లీ నియాజకవర్గంలో ఆదర్శ ఆసుపత్రి, విద్యా సంస్థలు ఏర్పాటుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల వినతుల స్వీకరణ, పరిష్కారానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కార్యాలయం ఏర్పాటు చేస్తానని అన్నారు. సరికొత్త పరిశ్రమల స్థాపనకు రూపకల్పన యువతకు ఉపాధి అవకాశాలు, చెరువుల సంరక్షణ, సుందరీకరణ, కబ్జాల నుంచి చెరువులను కాపాడేందుకు నిరంతరం కృషిచేస్తానని పేర్కొన్నారు. జవహర్‌నగర్‌లో ఉన్న వ్యర్థాల గుట్టను తొలగించడానికి, కరిగించడానికి ప్రణాళిక అమలు చేస్తానని చెప్పారు. వాహనాల రద్దీ క్రమబద్ధీకరణకు ప్రత్యేక వ్యూహం, నియాజకవర్గంలో పలు ప్రాంతాలకు మెట్రోరైల్ తీసుకురావడం కోసం ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మణ సంఘాల నాయకులు దుడ్డు సుబ్రహ్మణ్యం, జంటనరాల బ్రాహ్మణ సంఘాల సమైక్య పూర్వ అధ్యక్షులు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్‌రావు, గొల్లపూడి రాజేశ్వరరావు, ప్రబల విశ్వానాథం, కైలాస్, కర్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ - సంతోష్‌నగర్

బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రవీందర్ నాయక్ నగర్ కాలనీవాసుల డిమాండ్ చేశారు. ఈ మేరకు రవీందర్ నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫలకనుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఏ కృష్ణనాయక్ మాట్లాడుతూ వైన్స్ యాజమాన్యం సహకారంతో రవీంద్ర నాయక్ నగర్ కాలనీలో కొంతమంది బెల్టుషాపులను విచ్చల విడిగా నడిపిస్తున్నారని ఆరోపించారు. కాలనీలోకి బయటివారు ఎక్కువ మంది రావడం, వాహనాల రద్దీ పెరగడంతో స్థానికంగా ఉన్న మహిళలు, చిన్న పిల్లలు, యువతీ యువకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కొన్ని సందర్భాలలో ఇతర కమ్యూనిటీ వాళ్లు కాలనీ ప్రజలపై దాడులు కూడా చేశారని చెప్పారు. కానీ బెల్టుషాపుల ఆగడాలు మాత్రం ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే బెల్టుషాపు నిర్వాహకులపై, వెన్స్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి అందజేసిన వారిలో రవీందర్ నాయక్ నగర్ కాలనీవాసులు కిషన్, రాజేష్, రాజ, నరేందర్, మహేష్ ,వినోద్, వికాస్ ఉన్నారు.



అభ్యర్థుల ప్రకటనకు

అనుమతులు తప్పనిసరి

- ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



నవతెలంగాణ - సిటీబ్యూరో

రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రకటనకు 'ఎంసీఎంసీ' కమిటీ అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ కేబుల్, సోషల్ మీడియా, ఇతర ఆన్ లైన్ మాధ్యమాలలో ప్రకటనలు, ఆడియో, ఎఫ్ఎం రేడియోలో ప్రకటనలు, బల్క్ ఎస్.ఎం.ఎస్‌లు, వీడియో మెసేజ్‌లు, సినిమా థియేటర్లలో ప్రకటనలు, కరపత్రాల ప్రింటింగ్ అనుమతులను ఏం.సీ.ఎం.సీ కమిటీ ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీ.పీ.ఆర్.ఓ కార్యాలయంలో ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రకటనల కొరకు తప్పనిసరిగా ఏం.సీ.ఎం.సీ అనుమతి తీసుకోవాలని అన్నారు. అందుకోసం 48 గంటల ముందు నిర్ణీత దరఖాస్తు ద్వారా అప్లై చేసుకోవాలని అన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థిగానీ తన ఏజెంట్‌గానీ అప్లై చేసుకోవచ్చున్నారు. ప్రింటింగ్ ప్రెస్ ప్రింటింగ్ చేసిన కరపత్రాల పై పబ్లిషర్ పేరు, అడ్రస్, హ్యాండ్ బిల్ ఇతర పత్రాలు ముద్రించిన సందర్భంలో తప్పని సరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని తెలిపారు. అట్టి కరపత్రాల పోస్టర్లో ఎవ్వరిపై వ్యతిరేకంగా ప్రచారం చేయడం కానీ కులం, మతం విమర్శించడం, కోర్టు కేసులు, కోర్టు తీర్పు పై విమర్శించడం లేకుండా కరపత్రాలు ప్రింటింగ్ చేయాలని తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127ఏ ప్రకారంగా ఏదైనా ప్రింటింగ్ చేసిన పబ్లిషర్ పేరు అడ్రస్ ప్రింటింగ్ చేసే వ్యక్తి పేరు లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ కరపత్రమైనా ఏంసీఏంసీ ఎంసిఎంసి కమిటీ అనుమతి తీసుకొని ప్రింటింగ్ చేయాలని ఈ విషయంలో ప్రింటింగ్ యాజమాన్యం సహకరించాలని కోరారు. హైదరాబాద్ జిల్లాలో ప్రింటర్స్ ఇతర జిల్లాల సంబంధించిన ప్రింటింగ్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అట్టి జిల్లా ఎంసీఎంసి కమిటీ అనుమతి తీసుకున్న తర్వాత నే ప్రింట్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

గోపిసింగ్ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రసేన రెడ్డి నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేతావత్ గోపిసింగ్ నాయక్ గుండె పోటుతో మరణించడం దురదృష్టకరమని ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోపిసింగ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మ శ్రీనివాస్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి, నాయకులు నారగొని శ్రీనివాస్ యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి
- సీఎంను కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నవతెలంగాణ నాగోల్

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల రాజకీయాలకు అతీతంగా నిరుపేద, పేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆర్యవైశ్యులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా కాంగ్రెస్ గూటికి చేరడం శుభపరిణామం అని అన్నారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావులను కూడా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ పబ్బా చంద్రశేఖర్, ట్రెజరర్ కొడిపాక నారాయణ, కటకం శ్రీనివాస్, ఐవీఎఫ్ యూత్ ప్రెసిడెంట్ కట్టా రవికుమార్, ట్రెజరర్ నరేష్ గుప్తా తదితరులు ఉన్నారు.




కాంగ్రెస్ పార్టీలో చేరిన పూర్వ తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) అంతర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి, ఆయా వర్గాల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, అమిత్ శుక్లా



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఆయా నోడల్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన విధులను నిర్వర్తించాలని వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, అమిత్ శుక్లాలు సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన, జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎన్నికల అధికారి, సీపీ, రిటర్నింగ్ అధికారులు, ఆయా నోడల్ అధికారులు, ఆయా శాఖల ఎన్ఫోర్స్మెంట్ నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులందరూ నడుచుకోవాలన్నారు. ఆయా అధికారులందరూ తమ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా చేసిన ఏర్పాట్లు, వివిధ కమిటీల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ప్రొఫైల్, జనాభా, ఓటర్ల సంఖ్య, పోలింగ్ బూత్ లు, ఏర్పాటు చేసిన వివిధ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు, ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన నోడల్ అధికారుల వివరాలు, ఆయా కమిటీలు చేస్తున్న పనులు, జిల్లాలో ఇప్పటి వరకు పట్టుకున్న నగదు, ఇతర వస్తువులు, లిక్కర్ వివరాలు, జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా రిలీజ్ చేసిన నగదు వివరాలు, సువిద అనుమతులు, సివిజిల్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించిన వివరాలు, కార్యక్రమాలు, అందుబాటులో వున్న పోలింగ్ సిబ్బంది, ఇచ్చిన శిక్షణలు, తదితరాలను అబ్జర్వర్స్‌కు వివరించారు. అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్ పోలీస్ శాఖ ద్వారా చేస్తున్న ఆయా పనులు, ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో సీపీ శ్రీనివాస్ రెడ్డి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్, ఈ.వీ.డీ.ఏం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఎన్నికల ఆడిషనల్ కమిషనర్ అలివేలు మంగ తయారు, ఆయా ఎన్ఫోర్స్మెంట్ నోడల్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, ఎయిర్ పోర్ట్, నార్కోటిక్, రవాణా, జీఎస్టీ ఇన్కమ్ టాక్స్, స్టేట్ బ్యాంకర్స్, ఆయా నోడల్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ తరువాత చేపట్టిన ఎన్ఫోర్స్మెంట్ చర్యలు, నగదు, వస్తువులు తదితర అంశాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.

లో ప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలి

చింతల శ్రీనివాస్ ముదిరాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

లో ప్రెషర్ నీటి సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జైస్వాల్ గార్డెన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పరిధిలోని వాటర్ వర్క్ మేనేజర్ రోహిత్‌తో కలిసి మంచినీటి సమస్యను పరిశీలించి త్వరలోనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, వీణ, మంగ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించేందుకు యువత కృషి చేయాలి

- భారత జాతీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో రానున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఓడించేందుకు యువత కృషి చేయాలని భారత జాతీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అబద్దాలతో కాంగ్రెస్, మతోన్మాదంతో బీజేపీ పార్టీలు వచ్చే లోక్ సభ ఎన్నికల్లో గెలవాలని అనేక కుట్రలు చేస్తున్నాయని వాటిని ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన సూచించారు. పదేళ్ళ పాటు సుపరిపాలన అందించిన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల తరువాత ఆరు గ్యారంటీల ఊసు ఇక ఉండదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యామ్, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం చెబుతాం



- అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లుపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ, కుల, ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సు

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ ఇతర రాజకీయ పార్టీలు బీసీలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పిస్తామని బీసీ బిల్లు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ పై తమ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు , ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 86 బీసీ కుల సంఘాలు, 22 బీసీ సంఘాలు, 18 బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీ అజీజ్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు ఏ రంగంలో కూడా ప్రజాస్వామిక విద్య ఉద్యోగ ఆర్థిక రంగాలలో వాటా ఇవ్వలేదన్నారు. రాజకీయ పారిశ్రామిక జనాభా ప్రకారం 76 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని ఆలోచన ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదన్నారు. ప్రధానమంత్రి ఒక బీసీ కులానికి చెందిన వారు ఉండి కూడా బీసీల అభివృద్ధికి యొక్క చిన్న డిమాండ్‌ను కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనకపోవడం దేశంలోని 70 కోట్ల మంది బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య దేశం బీసీలు బిచ్చగాళ్లు కాదు వాటాదారులు వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు ఇదేమి న్యాయం భారతమాత ముద్దుబిడ్డలం అందరికీ సమన్యాయం పాటించాలని కోరుతున్నామని బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీజేపీ బీసీల అనుకూల వైఖరి అవలంబించి బీసీలకు చటసభల్లో 50% రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చిత్తుగా ఓడిస్తామని కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ భద్రత కల్పించాలని బీసీ యాక్ట్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోలా జనార్ధన్, భరత్, లక్ష్మణ్ యాదవ్, కొండ దేవయ్య, గుజ్జ సత్యం, నీల వెంకటేష్, ఎర్ర మధు వెంకన్న, చిలంపల్లి రమేష్ కుమార్, శ్రీనివాస్, యాదగిరి, నందగోపాల్ వేముల రామకృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు

రెండోరోజు 8 నామినేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహనగర పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, లోక్‌సభ స్థానాలకు రెండో రోజు శుక్రవారం 8 నామినేషన్లు దాఖలు అయ్యాయి. హైదరాబాద్ స్థానానికి ఏఐఎంఐఎం అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహమ్మద్ అక్రమ్ అలీ ఖాన్‌లు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సికింద్రాబాద్ లో బీజేపీ అభ్యర్థిగా జి.కిషన్‌రెడ్డి నాలుగు సెట్లు, బీఆర్ఎస్ నుంచి పద్మారావు గౌడ్ 2 సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను సమర్పించారు. సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బి.సునీతా రాణి, యుగతులసి పార్టీ పక్షాన కొలిశెట్టి శివకుమార్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) అభ్యర్థిగా గంగాధర్, ఇండిపెండెంట్‌గా చలిక చంద్రశేఖర్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు ప్రారంభమైన 18వ తేదీ గురువారం రెండు పార్లమెంట్ నియోజవర్గాల పరిధిలో ఒక్క నామినేషన్ దాఖలు చేయలేదనే విషయం తెలిసిందే. కాగా ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించే నామినేషన్లను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

మల్కాజిగిరిలో అయిదుగురు..

ఈ లోక్‌సభ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయి వరప్రసాద్, రాజేష్ మిశ్రా శివ్, చలిక చంద్రశేఖర్ నామినేషన్ పత్రాల దాఖలు చేయగా, కుడుపూడి వీవీఎస్ నారాయణ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

చేవెళ్ల నుంచి ముగ్గురు..

ఎంసీపీఐ(యూ) పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియా నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా మహమ్మద్ చాంద్ పాషాలు రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు సమర్పించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తరపున మేకల భిక్షపతి నామినేషన్ దాఖలు చేశారు.

ప్రార్థనల అనంతరం..
నామినేషన్ దాఖలు చేసిన అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి ఏఐఎంఐఎం అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ పాతబస్తీలోని మక్కామసీదులో జుమా-ఏ-నమాజ్ ప్రార్థనలు నిర్వహించి చార్మినార్ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా లక్డీకాపూల్‌లో హైదరాబాద్ కలెక్టరేట్‌కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట ఆయన కుమారుడు సుల్తాన్‌సలాఉద్దీన్ ఒవైసీతో పాటు పార్టీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.





అసదుద్దీన్ ఒవైసీ ఆస్తులు.. రూ.23.87 కోట్లు



హైదరాబాద్ లోక్‌సభ ఏఐఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తన స్థిర, చర ఆస్తి వివరాలను ప్రకటించారు. హైదరాబా ద్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి బరిలో నిలిచిన నేపథ్యంలో తాజాగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినే షన్ పత్రాల్లో ఎన్నికల అఫిడవిట్‌లో తన కుటుంబానికి రూ. 23.87 కోట్ల ఆస్తులు, రూ. 7.05 కోట్ల అప్పులు ఉన్నట్టు తెలి పారు. వివిధ కోర్టుల్లో అయిదు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం ఆస్తుల్లో తన పేరిట రూ. 16.01 కోట్ల విలువగల స్థిరాస్తులు, రూ. 2.80 కోట్ల విలువగల చరాస్తులు, తన భార్య పేరిట రూ. 4.90 కోట్ల విలువగల స్థిరాస్తులు, రూ.15.71 లక్షల విలువగల చరాస్తులు ఉన్నట్టు తెలిపారు. తన చేతిలో రూ.2లక్షలు, తన భార్య చేతిలో రూ.50 వేల నగదు, భార్యకు 20 తులాల బంగారం ఉందని, తన పేరు మీద రూ. 4.30 కోట్ల అప్పులు, తన భార్య పేరిట రూ.2.75 కోట్ల అప్పులు ఉన్నాయని వివరించారు. తనకు, తన భార్యకు ఎలాంటి వాహనం లేదని అఫిడవిట్‌లో వెల్లడించారు.



నామినేషన్ దాఖలు చేసిన పద్మారావు

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని తన నివాసం నుంచి ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్ , కాలేరు వెంకటేష్‌లతో కలిసి వెస్ట్ మారేడ్ పల్లి లోని జోనల్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని గత పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రజలందరూ ఆలోచించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఎంపిగా గెలిచిన తర్వాత పార్లమెంట్‌లో మన సమస్యలపై గళం విప్పి పోరాడవచ్చున్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పదేండ్లలో హైదరాబాద్ తాగు నీటి సమస్య, కరెంట్ సమస్యలు లేకుండే.. కానీ ఇప్పుడు అడుగడుగునా నీటి కష్టాలు ఎదురైతున్నాయన్నారు. పద్మారావు గౌడ్‌కు ఎంతో అనుభవం ఉందని, అందరి మధ్య ఉంటాడని కావున పజలందరూ ఆలోచించి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు..కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఇంద్రజాల కళ ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుంది

- వందే భారత్ సినీ నిర్మాత దర్శకులు మల్లం రమేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇంద్రజాల కళ ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుం దని వందే భారత్ సినీ నిర్మాత దర్శకులు మల్లం రమేష్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ తెలంగాణ మెజీషియన్ అసోసి యేషన్ ప్రారంభోత్సవ జరిగింది. ఈ సభలో అధ్యక్షులు శ్రీరంగం ప్రవీణ్, గుమ్మడవెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు వందే భారత్ సినీ నిర్మాత దర్శకులు మల్లం రమేష్, కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సినీ నటుడు మెజీషియన్ జేవీఆర్, తెలుగు మెజీషియన్స్ అడ్మిన్ ప్రదీప్ రంగ్రేజ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ తెలంగాణ మెజీషియన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కళ్లప్పగించి సంభ్రమాశ్చర్యాలకు గురవుతూ మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ ఆసక్తిగా తిలకించే ప్రదర్శన ఇంద్రజాలం అని తెలిపారు. ఇంద్రజాల కల ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుందని మనసుకు ఎంతో ఉత్సాహాన్ని అందిస్తూ ప్రత్యేకంగా చిన్నారులను ఎంతో ఆకట్టుకుంటుందని ఇటువంటి కళను ప్రోత్సహించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై వైద్య సిబ్బందికి అవగాహన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉస్మానియా ఆసుపత్రిలో గౌలిగూడ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ మహమ్మద్ ముస్తఫా ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం వైద్యులకు, వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాద నివారణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ఆస్పత్రిల్లో ఉన్న అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసే విధంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. మెట్లకు అడ్డంగా ఎటువంటి సామాన్లు ఉండకూడదన్నారు. అత్యవసరాల ఫైర్ డోర్లకు తాళాలు వేయకూడదన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్టలను వాడకూడదని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ అలారం విన్న వెంటనే భవనాన్ని కాళీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనలు ఇచ్చి అగ్ని ప్రమాదాలకు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఆర్ఎంఓ లు డాక్టరు శేషాద్రి,డాక్టర్ రఫీ, డాక్టర్ అనురాధ, డాక్టర్ సాయి శోభ, డాక్టర్ బి శ్రీనివాసులు, డాక్టర్ కవిత, డాక్టర్ సుమయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్, నర్సింగ్ ఆఫీసర్ శిరీష, లీడింగ్ ఫైర్ మాన్ సునీల్ కేతిరెడ్డి, జి ఎస్ రెడ్డి, దినేష్, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.

సైఫాబేగంకు నంది అవార్డు ప్రదానం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సామాజిక సేవ గాను అసిస్టెంట్ డైరెక్టర్ సైఫాబేగం కు జాతీయ నంది అవార్డును అందజేస్తున్న వెంకటరెడ్డి ,కృష్ణా తదితరులు

సివిల్ సర్వీసెస్‌కు 115 మంది అభ్యర్థుల ఎంపిక పట్ల హర్షం

- ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశవ్యాప్తంగా 2023 సంవత్సరంలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు ఫలితాలు వెల్లడై 1,143 ఉద్యోగాలలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ద్వారా 115 మంది ఎంపిక కావడం పట్ల ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమాజంలో ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేష న్లు కల్పించిన ప్రధాని మోడీకి అగ్రవర్ణ పేదలు రుణపడి ఉంటారని తెలిపారు. దేశంలో అగ్రకుల సామాజిక వర్గాల నిరుపేదలు అభివృద్ధి చెందాలనే బలమైన ఆశయంతో ప్రధాని మోడీ 2019లో 103 రాజ్యాంగ సవరణ చేసి దేశంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగ విద్యార్థులకు ఆశా దీపంగా ఈ 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో ప్రతిఏటా 80 నుండి 100 మంది విద్యార్థులు ఎంపిక అవుతున్నారని చెప్పారు.2023లో జరిగిన నియామకాలలో ఐపీఎస్-20, ఐఏఎస్-17, ఐఎఫ్ఎస్సి-04 గ్రూప్ ఎ-64, గ్రూప్ బి-10 ఉద్యోగాలకు మొత్తం 115 మంది విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందడం చారిత్రక విజయమన్నారు.అత్యున్నతమైన ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు. పేదరికం నుండి వచ్చిన వారు భవిష్యత్తులో అన్ని సామా జిక వర్గాలలోని అణగారిన వర్గాల ప్రజలకు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రక్రియకు అనుసంధాన కర్తలుగా ఉండి నిస్వార్ధంతో సేవలు అందిస్తూ ప్రజా మన్ననలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, యాద కార్తీక్, రంగ శ్రీధర్, మురిశెట్టి సంతోష్, ఏవి.రావు, శేఖర్ రెడ్డి, వీరమల్ల కళ్యాణ్, జి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహం బయటపడిందంటూ వదంతులు





సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారీలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

శ్రీకృష్ణుని విగ్రహం బయటపడిందంటూ వదంతులు వ్యాపించిన సంఘటన సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం... రామ్ కోఠి లోని అమృత కపాడియా నవజీవన్ ఉమెన్స్ కళాశాల సుమారు రెండు సంవత్సరాలుగా మూసివేశారు. అయితే ఈ బిల్డింగ్ విషయమై కోర్టులో కేసు నడుస్తుందని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం అమృత్ కపాడి యా కళాశాలలో ఒక్కసారిగా కృష్ణుడి విగ్రహం బయట పడిందని వార్తలు వైరల్ కావడంతో స్థానిక ప్రజలు ఆ కృష్ణుని విగ్రహానికి పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అయితే ఆ విగ్రహం రాతిది కాకుండా లోహంది కాకుండా ఉండడంతో స్థానిక ప్రజలకు అనుమానం వచ్చింది. కొందరు కావాలని ప్లాస్టిక్ పారిస్ విగ్రహాన్ని ఎక్కడి నుంచో తీసుకువచ్చి మూసి ఉన్న కళాశాలలో గోతి తవ్వి పాతి పెట్టారనేది తెలుస్తున్నది. విషయం తెలుసుకున్న స్థానిక సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీ క్షించారు. కళాశాల గేటు తాళంను పగలగొట్టి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి చొరబడి కావాలనే శ్రీకృష్ణుని విగ్రహాన్ని గోతి తవ్వి పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. భవనం విషయంలో కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఇరువర్గాలలోని ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

సికింద్రాబాద్‌కు కిషన్ రెడ్డి చేసింది ఏమీ లేదు

- సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్



నవతెలంగాణ-అంబర్‌పేట:

సికింద్రాబాద్ పార్లమెంట్‌కి అంబర్‌పేట నియోజకవర్గం కిషన్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని కేవలం మాటల గారడీతో పబ్బం కడుపుతో ఎన్నికల ముందు డ్రామాలాడుతున్నారని సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్ అన్నారు. శుక్రవారం సీపీఎం పార్టీ అంబర్‌పేట నియోజకవర్గంలో పార్టీ కార్యాలయంలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మహేందర్ మాట్లాడుతూ బీజేపీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేశామని జయప్రకాష్ నారాయణతో కలిసి విలేకరులతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలు చెప్పడమే తప్ప మరొకటి కాదని తేలిపోయిందన్నారు. రాష్ట్రంలో అనేక జిల్లాలో జాతీయ రహదారులను వేశామని చెబుతున్నారని వేసిన రోడ్లు ప్రయివేట్ కాంట్రాక్టర్లతో కలిసి పీపీపీ పద్ధతిలో 30 సంవత్సరాల వరకు లీజులు ఇచ్చి ప్రయివేట్ వ్యక్తులతో రోడ్లు వేయించారని వేసిన రోడ్లకి టోల్‌గేట్ ఏర్పాట్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని అది కూడా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అని చెప్పడం సిగ్గుచేటన్నారు. అంబర్ పేట్ లోని చే నెంబర్ ఫ్లైఓవర్ 2021 సంవత్సరంలో ప్రారంభమై ఇప్పటివరకు పూర్తి కాలేదని ఫ్లైఓవర్ నిర్మాణ కారణంగా సుమారు 1000 మంది ప్రయివేట్ వ్యక్తుల దుకాణాలు ఇతర వ్యాపారాలు దెబ్బతిన్నాయని దాని కారణంగా వాళ్లు అప్పులపాలై ఆస్తుల అమ్ముకుంటున్నారన్నారు. కేంద్రం నుండి రావాల్సిన 180 కోట్లు కూడా విడుదల చేయలేని వ్యక్తి ఈసారి ఎన్నికల్లో గుణపాఠం చెప్పి చిత్తుగా ఓడిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శులు ఎం.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించకపోతే సామాజిక బానిసత్వం తప్పదు

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడిం చకపోతే దళిత జాతులకు సామాజిక బానిసత్వం తప్పదని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో దళిత బహుజన పార్టీ తరపున హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం అభ్యర్థి షేక్ బాషాకు వడ్లమూరి కృష్ణ స్వరూప్ బీ-ఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ జస్టిస్ పునాదులపై అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని బీజేపీ కేంద్ర సర్కార్ రద్దు చేయాలనే కుట్రలు చేస్తుందని ఆరోపించారు.బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు ప్రధాని మోడీకి రాజకీయ ఏజెంట్లుగా పని చేస్తూ అణగారిన వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన విధానంతో పొలిటికల్ పవర్ సాధన కోసం కృషి చేస్తున్న దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు ఈ లోక్ సభ ఎన్నికల్లో ఓటు వేసి పౌర సమాజాన్ని బల పరచాలని ఆయన సూచించారు.

'లివర్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి'



- వర్ల్డ్ లివర్ డే సందర్భంగా గ్లెనిగల్స్ ఆస్పత్రిలో అవగాహన

నవతెలంగాణ-సిటీబ్యూరో

లివర్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని లివర్ సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారితీయకుండా జాగ్రత పడవచ్చని వరల్డ్ లివర్ డే థీం ప్రకటించింది. ఈ సందర్భంగా గ్లెనిగల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం సైక్లథాన్, వాకథాన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్లెనిగల్స్ ఆస్పత్రిలో సీసీఈఓ డాక్టర్ నాగేష్ రావు మాట్లాడుతూ గ్లెనిగల్స్ ఆస్పత్రిలో 1000 పైగా లివర్ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన ఏకైక సెంటర్ అన్నారు. దక్షిణ భారతదేశంలోనే మొట్ట మొదటి సారిగా లివర్ మార్పిడి చేసిన ఘనత, మల్టీ ఆర్గాన్ (కిడ్నీ, కాలేయం) మార్పిడి, నగరంలో స్ప్లిట్ లివర్ మార్పిడి , చిన్నారికి మోనో సెగ్మెంట్ కాలేయ మార్పిడిని తొలిసారిగా నిర్వహించిన ఘనత గ్లెనిగల్స్ ఆస్పత్రి సొంతమన్నారు. అనంతరం సీనియర్ హెపటాలజిస్ట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ చందన్‌కుమార్ మాట్లాడుతూ లివర్ సంబంధ వ్యాధులకు ప్రధానంగా ఆల్కహాల్, ఫ్యాటీలివర్, ఊబకాయం వంటి కారణాలు ప్రధానంగా చెప్పవచ్చు న్నాం. లివర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు రెగ్యులర్‌గా లివర్ చెకప్‌లు చేయించుకుంటూ ఫ్యాటీ లివర్ నుంచి కాపాడుకోవాలని లివర్ ట్రాన్స్‌ప్లాంట్ అండ్ హెచ్‌పీబీ సర్జన్ డాక్టర్ అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో సైక్లథాన్, ప్రజలు, డాక్టర్లతో కలిసి వాకథాన్‌లను నిర్వహించారు. వాకథాన్‌ను సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌ప్లాంట్ అనస్థీషియాలజిస్టులు డాక్టర్ స్మిత్, గణేష్, కాలేయ మార్పిడి శస్త్రవైద్యుడు రాజగోపాల్ ఆచార్య, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ వ్యవస్థాపకులు రవీందర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'శంకర్ స్కిన్, హెయిర్ క్లినిక్' ప్రారంభం



● ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

131 - కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేస్ 1 నందు డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శంకర్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రాల్గొని, పారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరీష్, బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఐదు నామినేషన్లు



నవతెలంగాన-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి - 7 పార్లమెంట్ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజు శుక్రవారం జిల్లాలో (5) మంది స్వతంత్ర అభ్యర్థులు ఆరు నామినేషన్లు వేసినట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయి వరప్రసాద్, రాజేష్ మిశ్రా శివ్, చలిక చంద్ర శేఖర్, ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, కుడుపూడి వివిఎస్ నారాయణ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీలవి మోసపూరిత వాగ్దానాలు



● ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కాంగ్రెస్ బీజేపీ పార్టీలవి మోసపూరిత వాగ్దానాలు అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శుక్రవారం 132 - జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జయరాం నగర్, గణేష్ హౌసింగ్ సొసైటీ, శ్రీ కృష్ణా నగర్, మహా నగర్ కాలనీ, రుక్మిణి ఎస్టేట్స్, ప్రశాంత్ నగర్ కాలనీలలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తుంటే, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ నీచమైన రాజకీయాలు చేస్తున్నాయి తప్పా.. ప్రజల బాధలను, వారి సంక్షేమాన్ని పట్టించుకోరన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు హెలికాప్టర్లలో వచ్చి హాయ్, భాయ్ చెప్పే నాయకులే తప్ప స్థానిక సమస్యలపై వారికి కనీస అవగాహన లేదన్నారు. అదే గత 25 ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉండే ప్రజా సంక్షేమం కోసం పనిచేసే రాగిడి లక్ష్మారెడ్డి లాంటి నాయకుడిని గెలిపిస్తే ప్రజా సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి పట్టింపు వేగంతో జరుగుతుందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

గణేష్ నగర్ : యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, రవి, వేణు చారి, అనంతరామిరెడ్డి, ప్రతాపరెడ్డి, రాములు ఉన్నారు.

ప్రశాంత్ నగర్ : ప్రతాపరెడ్డి, నాగభూషణం, శ్రీను, దుర్గాప్రసాద్, నరసింహ, రాజేష్, నాగరాజు, కృష్ణ, శివ, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, జీడిమెట్ల డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్, నదీమ్ రాయ్, ఎల్లా గౌడ్, వేణు, జయరాం నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకుల మద్దతు రాగిడి లక్ష్మారెడ్డిపై ఉండాలి : ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: షాపూర్ నగర్‌లోని ఎంజెఎస్ గార్డెన్స్ నందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్లతో నిర్వహించిన సమావేశానికి శుక్రవారం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నాయుడు లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ... సర్వమత సారం... ఇదే బీఆర్ఎస్ పార్టీ అవి మతమన్నారు. గత పదేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కుల, మత వర్గ వర్ణాలకు అతీతంగా ఎన్నో సంక్షేమ పథకాలు, నిరుపేద క్రిస్టియన్ సోదరులకు బట్టలను పంపిణీ చేసి, అందరిని సమదృష్టితో చూసిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇటువంటి సంక్షేమ పథకాలు నిరు పేదలకు అందలేదన్నారు. తెలంగాణ అభివృద్ధి ఏదైనా జరిగిందంటే అది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం లోనేనన్నారు. కావున అందరి సంక్షేమ కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరో మారు ఎన్నుకొని మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ...ఆ దేవుడి ఆశీస్సులు, దైవ సేవకుల, జనులంతా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసుకునేందుకు ఎంపీగా లక్ష్మారెడ్డిని గెలిపిస్తే రెట్టింపు వేగంతో అభివృద్ధి చెందవచ్చున్నారు.

ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, క్యూసిసిఏ అధ్యక్షులు సత్యనారాయణ, చైర్మెన్ శౌరి, జనరల్ సెక్రెటరీ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి పార్లమెంట్ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్...

జగద్గిరిగుట్ట: మల్కాజిగిరి పార్లమెంట్ గడ్డ.... బీఆర్ఎస్ అడ్డ అని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు అడిగే హక్కు లేదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శుక్రవారం గాజుల రామారం డివిజన్ శ్రీరామ్ నగర్, బేకరీ గడ్డ, ఎన్టీఆర్ నగర్లలో ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులతో సంబంధం లేకుండా గత 20 ఏండ్లుగా ఎన్నో సామాజిక కార్యక్రమాలు, ఎన్నో ఉపాధి కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉండే సేవకుడు రాగిడి లక్ష్మారెడ్డి గెలిస్తే మన బస్తీలు, కాలనీలు రెట్టింపు వేగంతో అభివృద్ధి చెందుతాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు మన ప్రాంతానికి చెందినవారే కాదని, మన సమస్యలు వారికి ఎట్లా తెలుస్తాయని ప్రశ్నించారు. పార్లమెంట్లో తెలంగాణ గొంతుకై నిలిచేందుకు మన అభ్యర్థి,మన అభివృద్ధిని కోరుకుంటూ ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహుమానం అందజేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు విజయ రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ యస్. కమలాకర్, నవాబ్, ఇబ్రహీం, చెట్ల వెంకటేష్, దిలీప్, బాబీ చౌదరి, బోయిని మహేష్, వీరన్న, శివశెట్టి తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్‌లో స్థానంలో గెలుపు తధ్యం



● కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తన గెలుపు తధ్యమని మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆమె కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, పార్టీ కార్యకర్తలతో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రచారాన్ని ఉధృతం చేశారు. ముందుగా కేపీహెచ్‌బీ కాలనీలో గల వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంఐజి ఫ్లాట్స్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సునీత మహేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది అన్నారు. భవిష్యత్తులో ఇందిరమ్మ కమిటీల ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. తనను నాన్ లోకల్ అంటున్నారని అసలు సిసలైన లోకల్ అభ్యర్థిని తానేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సంక్షేమంలో అభివృద్ధిలో పేద ప్రజలకు సేవ చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని సంక్షేమ పథకాలు ధనవంతులకే చెందాయని పేదల నష్టపోయారన్నారు. అనంతరం నియోజకవర్గ కోఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి అధ్యక్షతన అల్లాపూర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ సమన్వయంతో పని చేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ ఒక్కరిని గుర్తిస్తామన్నారు. ఎంపీ సీట్లు గెలుచుకోవడం ద్వారా తెలంగాణలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుందన్నారు తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేయించుకోవడానికి మార్గం సుగమమవుతుందన్నారు. కూకట్‌పల్లిలో 100 పడకల ఆస్పత్రి, కాలేజీ, ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరింపబడతాయన్నారు. సర్వే రిపోర్టులు అన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని లక్ష మెజార్టీతో ఎంపీ సీటు గెలుస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లల్లో కార్యకర్తల సమావేశం పెద్ద ఎత్తున నిర్వహించారు. సమావేశాల్లో టీపీసీసీ కార్యదర్శి సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు



మేడ్చల్ నియోజకవర్గం కండ్ల కొయ్యలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం బౌరంపేట్ నివాసులు బాల్ రెడ్డి మాధవరెడ్డి కుమారుని వివాహ వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పాక్స్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కొల్తూరు మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే అధికారులను ఉపేక్షించబోం..



● మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా పనిచేస్తే ఉపేక్షించేదిలేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, సందర్శించారు. డొమెస్టిక్ వాటర్ కనెక్షన్ ఉన్నవాళ్లకు సరైన సమయానికి నీళు సరఫరా కావడం లేదని మాజీ ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువచ్చారు. ఆయన శుక్రవారం వాటర్ బోర్డు కార్యాలయానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా, డొమెస్టిక్ కనెక్షన్ ఉన్నవాళ్లకు గంటల వ్యవధిలోనే నీటి సరఫరా జరగాలని అధికారులకు సూచించారు. డొమెస్టిక్ కనెక్షన్ల పేరిట కమెర్షియల్ కనెక్షన్‌లు ఉన్నవారికి నీటిని సరఫరా చేస్తూ, దందాలు చేసే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహించదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎండాకాలంలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటుందని సూచించారు. స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తాను ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



● మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్పలో భూగర్భ డ్రయినేజీ సమస్య పరిష్కారానికి త్వరలో కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి తెలిపారు. స్థానిక సమస్యలు పరిష్కరిస్తూ... డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం డ్రయినేజీ సమస్యపై సురేష్ రెడ్డి, హెచ్ఎం డబ్ల్యూఎస్ (HMWS) అధికారి ఏ.అనూషతో కలిసి రాజీవ్ గృహకల్పలో ముఖ్యంగా బ్లాక్ నెంబర్ 105 చుట్టుపక్కల వీధులలో పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వెంటనే... పైప్ లైన్ ఏర్పాటు ప్రతి పాదనలు సిద్ధం చేసి, త్వరలోనే ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేస్తానని ఏఈతెలిపారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.


'మల్కాజిగిరి' రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది



● ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా ప్రతినిధుల, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పెట్టుబడులు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చిందని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని పక్కకు పెట్టి బీఆర్ఎస్ నాయకులపై ఎదురుదాడికి దిగుతూ పబ్బం గడుపుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ రాజకీయాల పరమావధిగా ప్రజల సమస్యలను పక్కకు పెట్టి నీచ రాజకీయాలు చేసే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పక్కకు పెట్టి మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లిలో ఈనెల 20వ తేదీ మొదలు 22వ తేదీ వరకు జరగబోయే శ్రీశ్రీశ్రీ విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం శంభీపూర్ లోని కార్యాలయంలో కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ నేతృత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణని కలిసి ఆహ్వాన పత్రికను వారికి అందజేసి ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కొల్తూరు మల్లేష్ ముదిరాజ్, నాయకులు సద్దాం, మల్లేష్, రాములు నాయక్, రవి, సతీష్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

అభ్యర్థులు ఖచ్చితంగా ఖర్చుల వివరాలను నమోదు చేయాలి



నవతెలంగాన-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకులైన మనోజ్ అలోయిస్ లక్రా, ధ్రువ్ భోళాలు అన్నారు. శుక్రవారం వ్యయ పరిశీలకులు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, షాడో టీమ్‌లతో కలెక్టరేట్ లోని సమావేశ మందిరములో టీం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని, అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలనీ ఇన్ కమ్ టాక్స్, బ్యాంకు అధికారులను ఆదేశించారు. పరిశీలకులు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, షాడో టీమ్, అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్, ప్రచురణ కర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127ఏ ప్రకారం నిబంధలను పాటించాలని అన్నారు. ఎంసిఎంసి ద్వారా ఎన్నికలలో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్ పై దృష్టి సారించాలని, సోషల్ మీడియా పై పటిష్ట నిఘా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బు, మద్యం పంపిణీ పై ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. లావాదేవీల పై పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని టీంలు జాగ్రత్తగా ఉండి పర్మిషన్స్ సరిగా ఉందా లేదా అని చెక్ చేయాలన్నారు. ఎన్ ఓ సి గ్రీవెన్స్ టీం ద్వారా సీజ్ చేసిన డబ్బు, మద్యం ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. సువిధ పోర్టల్ లో నమోదు పై రాజకీయ పార్టీల వారికీ అవగాహన కల్పించామని, ఎంసిసి నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో చెక్ పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి అక్రమంగా తరలించే మద్యం, నగదు పై దృష్టి పెట్టామని తెలిపారు. అనంతరం సి విజిల్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1950 కాల్ సెంటర్, గ్రీవెన్స్ కమిటీ సెంటర్, ఎంసిఎంసి, మీడియా సెంటర్‌లను వ్యయ పరిశీలకులు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిసి నోడల్ అధికారి కృష్ణ రెడ్డి, ఎక్స్ పెండిచర్ మానిటరింగ్ నోడల్ అధికారి రాజేందర్ రెడ్డి, నోడల్ అధికారులు, ఇతర టీం సభ్యులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగాలలో రాణించాలి



● జనసేన పార్టీ కూకట్‌పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని జేఎన్‌టీయూ నుంచి హైటెక్ సిటీ రోడ్డు 3వ ఫేస్‌లో భవిరెడ్డి భూశంకర్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన టీ టైం పాయింట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ స్వయం ఉపాధితో పాటు మరికొందరికి ఉపాధి కల్పించాలన్నారు. యువత యొక్క స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు యువత స్వయం ఉపాధికై రుణాల రూపేనా సహాయం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జనసేన పార్టీ కోఆర్డినేటర్ కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, అంజి, పులగం సుబ్బు, షణ్ముఖ, సామన రాజు, వెంకటేశ్వరరావు, బాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరేద్దాం

● కార్పొరేటర్ బివిజయ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పై గులాబీ జెండా ఎగరేద్దాం అని అందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని చంద్ర నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ముఖ్య నాయకుల, పార్టీ శ్రేణులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటు పడిందని తెలిపారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన విధానం ప్రజలకు అర్థం అయిపోయిందని జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కారు గుర్తుపై ఓట్లు వేయించి భారీ మెజారిటీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని సూచించారు. ప్రతీ ఓటరు బిఆర్ఎస్‌కి ఓటు వేసే విధంగా కృషి చేయాల ని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఆర్ఐటీఎం, ఫార్మసీ కళాశాలలో ఘనంగా 2కే24 వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఫార్మసీ కళాశాలలో ఎలిసీఎం 2కే 24 పేరిట వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి 4000 పైగా పాల్గొన్నారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా కళాశాల ఫౌండర్ సెక్రెటరీ మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కళాశాల బోర్డు డైరెక్టర్స్, అను శ్రేయ రెడ్డి, ట్రెజరర్ మమత రాజశేఖర్ రెడ్డిలు హాజరై మొదట జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ సెక్రెటరీ మల్కాజిగిరి శాసనసభ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కళాశాల వార్షిక దినోత్సవం వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక అభివృద్ధికి తోడ్పడాలని, వారి యొక్క తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, అలాగే కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ అర్ణబ్ మాలిక్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న ఏ.వీ.సావిత్రి లలిత గీత పోటీ రజతోత్సవం



నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 21 తేదీ న శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ లలిత గీత గాయని ఏ.వీ.సావిత్రి స్మారక లలిత గీత పోటీల రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమ రాజు విజయ కుమార్ తెలిపారు. ఎందరో యువ గాయకులు ఈ పోటీల్లో పాల్గొని గుర్తింపు పొందారని చెప్పారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను సంస్థ కార్యాలయంలో నత్య కళా కారులు సుధామాల మధుమతి, స్నేహ రామచందర్ లక్ష్మి మానస హరినాథ్ బాబు లతో కలసి విడుదల చేశారు. నాటి కరుక్రమానికీ ముఖ్య అతిథిగా పే అండ్ అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జీ.వసుంధర పాల్గొనగా పోటీ విజేతలకు ప్రముఖ సంగీత కళాకారులు లోకనాథ శర్మ, ఆనంద మోహన్ బహుమతులు అందజేస్తారు అతిథులుగా ప్రముఖ గాయకులు వేదవతి ప్రభాకర్, శశికళ సురేఖ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా గాయకుడు వినోద్ బాబు తబల కళాకారుడు శివ శంకర్‌లను సత్కరిస్తారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన తేజ్ పాల్



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ కంటోన్మెంట్ బోర్డ్ ఏడో వార్డ్ అధ్యక్షుడు తేజ్ పాల్ శుక్రవారం కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మైనపల్లి హనుమంతరావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో ఆటో ఏడో వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరారు ఈ సందర్భంగా తేజ్ పాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై తాను కాంగ్రెస్ లో చేరినట్టు చెప్పారు

పెట్రోల్ బంక్‌లో ఘర్షణ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎస్సార్ నగర్ మెయిన్ రోడ్డు వద్ద గల భారతి పెట్రోల్ పంపులో ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 9:30 గంటలకు శ్రీరామ్నగర్ నివాసి బంటి తన టు వీలర్ వాహనంలో పెట్రోల్ పోయించుటకు భారతి పెట్రోల్ పంపునకు వెళ్లి లైన్ లో నిలుచున్నాడు. అయితే పెట్రోల్ పోస్తున్న వ్యక్తి తన డ్యూటీ అయిపోయిందని వేరే వాళ్ళు వచ్చి పోసే వరకు ఆగాలని కోరాడు. ఈ విషయంలో బంటికి పెట్రోల్ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. పెట్రోల్ బంకు సిబ్బంది, కస్టమర్ బంటిని కింద పడవేసి కాళ్లతో చేతులతో తన్నిన వీడియోలు బయటకు వచ్చాయి .అయితే బంటి మొదట పెట్రోల్ పంప్ సిబ్బందిని కొట్టాడని ఆ తర్వాత పెట్రోల్ బంకు సిబ్బంది బంటిని కొట్టడం జరిగిందని పెట్రోల్ బంక్ సిబ్బంది మధుర నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ సాయినాథరెడ్డి పెట్రోల్ బంకు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటి ని అదుపులోనికి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



నివేదిత ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత శుక్రవారం మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బోయిన్‌పల్లిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు తనకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమె ప్రచారానికి మద్దతు తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వర్ రెడ్డి ఇంటింటికి వెళ్లి నివేదితను పరిచయం చేశారు. ఆమెను గెలిపించాలని స్థానికులకు ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి కార్పొరేటర్ పరామర్శ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండ వీకర్ సెక్షన్ అంబేద్కర్ నగర్ బస్తి అధ్యక్షుడు వెంకటేష్ సతీమణి కమల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా పసివుద్దీన్ పరామర్శించారు. వారిని ఓదార్చి వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంకటేష్ సతీమణి కమల ఆత్మ కు శాంతి కలగాలని భగవంతుని వేడుకుంటున్నానన్నారు. బోరు బండ డివిజన్‌లోని అన్ని బస్తీలలో కార్యకర్తలు ఎవరూ. మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు .త్వరలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజలకు మంచి సేవ అందిస్తామని, అన్ని మంచి రోజులే ఉంటాయని తెలిపారు.

మాదిగలకు కాంగ్రెస్ సీట్లు ఇవ్వకపోవడానికి కారణం మందకృష్ణ

- ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

సుమారు కోటి మంది మాదిగలు తెలంగాణలో ఉండి కూడా రెండు పార్లమెంటు సీట్లు కాంగ్రెసును అడుక్కునే పరిస్థితికి కారణం, మాదిగ జాతిని వివిధ పార్టీలకు మందకృష్ణ మాదిగ తాకట్టు పెట్టడమేనని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. బీజేపీకి మాదిగ జాతిని తాకట్టు పెట్టిన కారణంగా కాంగ్రెస్ మాదిగలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వలేదని తెలిపారు. ఏ పార్టీకి మద్దతు ఇవ్వకుండా మందకష్ణ మాదిగ ఉంటే ప్రతీ పార్టీని అడిగే హక్కు ఉంటుందని చప్పారు. అలా కాకుండా ఒక పార్టీకి ప్రతీ ఎన్నికల్లోను మద్దతు ఇచ్చి తాను లబ్దిపొంది వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా రాజకీయ పార్టీలు పట్టించుకోకుండా ఉండడానికి ప్రధాన కారణం మంద కష్ణ మాదిగ అన్నారు. ఇప్పటికైనా మాదిగ జాతిలోని విద్యార్థులు మేధావులు మహిళలు ఉద్యమకారులు మందకష్ణ మాదిగ మోసాలకు అడ్డుకట్ట వేయకపోతే మాదిగ జాతి తన అస్తిత్వాన్ని కోల్పోతుందని ఆయన హెచ్చరించారు.



ఇన్ ఫ్లుయన్సర్ కనెక్ట్ ప్రచారం మరింత సులువు

- మిస్ ఆంధ్ర ప్రదేశ్ 2018 సహర్ కృష్ణ

నవతెలంగాణ-బంజారా హిల్స్

చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారు తమ వ్యాపార ప్రచారాలను మరింత సులువుగా నిర్వహించుకునేందుకు ఇన్ ఫ్లుయన్సర్ కనెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని మిస్ ఆంధ్ర ప్రదేశ్ 2018 సహర్ కృష్ణ అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ఇన్ ఫ్లుయన్సర్ కనెక్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోర్టల్ నిర్వాహకులు నరేంద్ర గోకవరపు, ఉపద్రష్ట పార్థసారథి, యోగ గురువు స్వాతి,డాక్టర్ గౌరీ వందనలతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాపారం నిర్వహించుకుంటూ తమ వ్యాపారాలను అభివద్ధి చేసుకునేందుకు శ్రమిస్తున్న వారికి ఈ పోర్టల్ దోహదపడుతుందని చెప్పారు. ప్రకటనల కోసం భారీగా ఖర్చు చేయలేని వారు ఈ ఫ్లాట్ ఫామ్ ద్వారా తక్కువ ఖర్చుతో ప్రచారం నిర్వహించుకోవచ్చునన్నారు. తమ పోర్టల్లో నటీనటులతో పాటు రాజకీయ నాయకులు వివిధ రంగాల నిష్ణాతులు ఉంటారని నరేంద్ర తెలిపారు.తమ పోర్టల్ ద్వారా వారికి నచ్చిన వారిని సంప్రదించి వారి వ్యాపారాలను అభివద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.



నామినేషన్‌లో పాల్గొన్న మాజీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా శుక్రవారం జి. కిషన్ రెడ్డి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్‌ను మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మహంకాళి టెంపుల్‌లో కేంద్ర మంత్రితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నామినేషన్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలో మాత్రమే విద్యను అందించాలి

- ప్రయివేటు రంగంలో వద్దు
- ప్రొ.కంచె ఐలయ్య
- మహనీయుల స్ఫూర్తి అవసరం
- సీఈఓ డా.వెంకట్ మారోజు



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ రంగంలో మాత్రమే విద్యను అందిం చాలని, ప్రయివేటు రంగంలో వద్దని ప్రొ.కంచె ఐల య్య అన్నారు. ఓయూ పూలే అంబేద్కర్ సమగ్ర పరిశోధన, సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిం చిన మహనీయుల జయంతి ఉత్సవాలను శనివా రం ఓయూ ఆర్ట్స్ కళాశాల లో రూమ్ నెంబర్ 133 లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యా పకులు, పరిశోధక విద్యార్థులు హాజయ్యారు. ముఖ్య అతిథులుగా ఓయూ పూర్వ విద్యార్థి, అమెరికాలోని సోర్స్ ట్రేస్ సీఈఓ వెంకట్ మారోజు, విశ్రాంత అధ్యా పకులు, సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్యలు పాల్గొన్నారు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఆంగ్లమాధ్యమంలో ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రయివేటు విద్యావిధానానికి స్వస్తి పలికి ప్రభుత్వరంగంలో మాత్రమే విద్యను అందిం చాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం దిశగా ఇంటినుంచే మార్పు కోసం అడుగు పడాలని వివరించారు. సమాజంలో సామాజిక అసమానతలకు కులమే కారణమన్నారు. కుల రహిత సమాజం దిశగా కార్యాచరణ ఉండాలని తెలిపారు. వెంకట్ మారోజు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహనీయుల స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆచరణీయమన్నారు. రాజకీయ ప్రజా స్వామ్యం నుంచి సామాజిక ప్రజాస్వామ్యం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విజ్ఞానం ద్వారానే రాజకీయ, సామాజిక అసమా నతలు లేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోగలమని స్పష్టం చేశారు. నేటికీ లక్షలాది మంది పేదరికం, వివక్షతను ఎదుర్కొంటున్నారన్న, విజ్ఞాన విప్లవం ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.



ఓయూ వీసీ ప్రొ. దండెబోయిన రవిందర్ యాదవ్ మాట్లాడుతూ కలిసికట్టుగా మహనీ యులను స్మరించుకోవటం, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకే పూలే-అంబేద్కర్ సమగ్ర పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ ల లను ఒకే వేదికపైకి తెచ్చి సమగ్ర అధ్యయన కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చి సామాజిక సమస్యలపై పరిశోధనలు జరుపుతున్నట్టు వెల్లడించారు. గత మూడేండ్లలో ఓయూలో తీసుకొచ్చిన సంస్కరణలను చెప్పారు. పూలే, అంబే ద్కర్ సహా ప్రొఫెసర్ కంచ ఐలయ్య రచనల ప్రభా వం తనపై ఉందని గుర్తు చేశారు. అందుకే ఓయూ లో 50శాతం పరిపాలనా పగ్గాలను మహిళలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఓయూ రాజనీతి శాస్త్ర విభాగం నుంచి ఐఏఎస్ సాధించిన నరేంద్ర పడాల్‌ను అతిథులు సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, మహాత్మా జ్యోతిబా పూలే పరిశోధనా కేంద్రం, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, మహల భాభాయి చందా మహిళా పరిశోధనా కేంద్రం, మైనార్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యదా అజీమ్ ఉన్నీసా ల నేతత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ఆచార్య బి. రెడ్యానాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ఆచార్య జి. మల్లేశం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య అర్జున్ రావు కుతాడి అతిథులుగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న టెక్నోస్మానియా



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ-2024 రెండో రోజు కొనసాగింది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ లో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియ-2024లో భాగంగా డిపార్ట్మెంట్ ఫుడ్ టెక్నా లజీ ఆధ్వర్యంలో ఫుడ్ సినర్జిసం- 2024ను శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ అగ్రి కల్చరల్ యూనివర్సిటి సీనియర్ ప్రొఫెసర్ డా. బి. వి. ఎస్. ప్రసాద్ రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ ప్రాసెస్ ఇంజినీరింగ్ అండ్ న్యూట్రిషన్ ఆఫ్ ఫుడ్ అనే అంశం పై ప్రసంగించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్స్ క్రోమా -2024 ను నిర్వహించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ అప్పారెల్ అండ్ టెక్స్టైల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డా. పుష్పలత కృటం ట్రెడ్స్ ఆఫ్ కంటిన్యూటీ ఎవల్యూషన్ ఇన్ టెక్స్టైల్స్ అనే అంశం పై ప్రసంగించారు. అనంతరం వివిధ విభాగాల ఆధ్వర్యంలో సమాంతరంగా ఒకే సారి ఐడియా



ప్రెజెంటేషన్స్, మోడల్ మేకింగ్, క్రాస్ వర్డ్, ట్రెజర్ హంట్, క్విజ్, శారీ స్వాగ్ లాంటి కార్యక్రమలు నిర్వహించారు.

సాయంత్రం విద్యార్థులు డ్యాన్సులు, పాటలు, స్కిట్స్, కవిత్వం తో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య చింత సాయిలు, కన్వీనర్ ఆచార్య ఎస్.శ్రీను నాయక్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వి. రమేష్ కుమార్, హెడ్ డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆచార్య వి.వి.బసవ రావు,ఆచార్య బి. రాజం , ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్స్ డా. ఎ. పరశురామ్, డా. బి. పరమేశ్వర్లు, డా. సాదం ఐలయ్య, డా. వి. భా స్కర్, డా. కె. శ్రీనివాసులు, డా. ఎస్. అనిత, డా. ఎ. కవిత, డా. ధీరజ్, ఆర్.రేణు, స్టూడెంట్ కో ఆర్డినేటర్ లు శ్యామ్ సుందర్, మాధవి, ఆకాష్, పి. అఖిల, ముకేష్, జె. సాహిత్య ఎం. సూరి దుర్గ, ఎం. అరవింద్, కళా శాల అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బీజేపీ ప్రభుత్వ విధానాలను ఓడిద్దాం



- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ
- మే డే పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కంటోన్మెంట్

బీజేపీ ప్రభుత్వ విధానాలను ఓడిద్దామనిఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 138 సంవత్సరాల క్రితం 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ జరిగిన పోరాటంలో అనేకమంది కార్మికులు మతి చెంది వారి రక్తతర్పణంతో మేడే ఏర్పడిందన్నారు. దాని ఫలితంగానే మనదేశంలో ఎనిమిది గంటల పని విధానం అమలవుతుందని.. కానీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి 12 గంటల వరకు పని చేయించే పద్ధతుల్లో చట్టాలను మార్పులు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేకత ప్రభుత్వాన్ని రాబోవు రోజుల్లో కార్మిక వర్గం ఓడించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు.మే 1న వాడవాడలో ఏఐటీయూసీ జండాలను ఘనంగా ఎగురవేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ ఎల్లయ్య, ఉపాధ్యక్షులు బి సమ్మయ్య, కే ఐలయ్య, పి రాజు, కార్యదర్శులు డి రాజు, కొమురయ్య, కె కుమార్ తదితరులు పాల్గొన్నారు

కేర్ హాస్పిటల్‌లో బాలునికి విజయవంతంగా కాలేయ మార్పిడి



నవతెలంగాణ-బంజారాహిల్స్

"అత్యంత అరుదైన జన్యు పరమైన రుగ్మత అలగిల్లీ సిండ్రోమ్. ఒక లక్ష జననాలలో సరా సరిన ఒకరికంటే తక్కువ మందికి మాత్రమే ఇది సంభవిస్తుంది. ఈ అరుదైన స్థితిలో కాలేయం లోపల బైల్ డక్ట్ (పిత్త నాళాలు) కెనాల్ సిస్టమ్ అభివృద్ధి చెందింది. దీనివల్ల కాలేయ రక్తంలో పిత్తరసం చేరి మెల్లగా కామెర్లు, తీవ్రమైన దురద తదనంతర కాలంలో కాలేయం విఫలమవుతుంది. తల్లిదండ్రుల జన్యువులలో ఎవరి జన్యువులలో అయినా రహస్యం గా ఇది ఉంటే అది పిల్లలకు బదిలీ అయ్యే అవకాశం కూడా ఉంది. చిన్నారుల ఎదుగుదలపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది' అని బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ మహ్మద్ నయీమ్ తెలిపారు. బంజారా హిల్స్ కేర్ ఆస్పత్రిలో శుక్రవారం బాలునికి విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మహ్మద్ నయీమ్ మాట్లాడుతూ.. 12 ఏండ్ల బాలుడు వరుణ్ మిత్ర, చిన్నప్పటి నుంచీ భయంకరమైన ఆరోగ్య సవాలును ఎదుర్కొన్నాడని తెలిపారు. నిరంతర కామెర్లు,ఎదుగుదల మందగించడం, తీవ్రమైన దురద,శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో పాటు అనేక ఇబ్బందికరమైన లక్షణాలను వరుణ్ అదిగమించాడని.. కేర్ హాస్పిటల్స్‌లో వైద్య పురోగతిని పొందడంతో అతని జీవిత ప్రయాణం హృదయపూర్వక మలుపు తీసుకుందని చెప్పారు. అతని ఊపిరితిత్తుల ధమనిలో అడ్డంకిని పరిష్కరించడానికి మొదట్లో హార్ట్-స్టెంటింగ్ ప్రక్రియ కూడా జరగడం విశేషమన్నారు. తమ కుమారుడి ఆరోగ్యం క్షీణించడంతో ఆందోళన చెందిన వరుణ్ తల్లిదండ్రులు కేర్ హాస్పిటల్స్‌ను ఆశ్రయించారని ఆతెలిపారు. కేర్ హాస్పిటల్స్ కాలేయ వైద్య బృందం బాలుడి ఆరోగ్యం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అతని కాలేయం, గుండెతో సహా బహుళ అవయవాలను ప్రభావితం చేసే అరుదైన జన్యుపరమైన రుగ్మత అయిన "అలగిల్లే సిండ్రోమ్‌తో"బాధపడుతున్నట్టు వైద్య పరీక్షల ద్వారా గుర్తించామన్నారు. అతని కాలేయ పనితీరు వేగంగా క్షీణించడంతో పాటు పల్మనరీ ఆర్టరీ స్టెనోసిస్ నుండి ఉత్పన్నమయ్యే సమస్యలు, ఉండడంతో చికిత్స కోసం వివిధ స్పెషలిటీ డాక్టర్ల కలయిక అవసరం పడిందని తెలిపారు. వరుణ్ తల్లి తన బిడ్డ మనుగడ కోసం తన కాలేయంలో కొంత భాగాన్ని దానం చేయడంతో వరుణ్ తన జీవితాన్ని తిరిగి ప్రారంభించాడని తెలిపారు.

వరుణ్ తల్లి అరుణ నగర నివాసి మాట్లాడుతూ.. మా అబ్బాయి బలహీనంగా ఉండటంతో పాటుగా బరువు బాగా తక్కువగా ఉండటం వల్ల తాము చాలా భయపడ్డామన్నారు. సర్జరీకి అతను తట్టుకోగల డా అని భయంగా ఉండేదన్నారు. అయితే డాక్టర్లు,నర్సులు అంకిత భావంతో కూడిన సేవలతో అతనికి పునర్జన్మ ఇచ్చారని కామెర్ల బారిన పడకుండా ఉండటం ఓ అద్భుతం అన్నారు. అతని జీవితంలో తొలిసారిగా అతను దురదలు లేకుండా సాధారణంగా ఉండగలిగాడని తెలిపారు. ఆస్పత్రి సీఓఓ సయెద్ కమ్రాన్ మాట్లాడుతూ అతి బలహీ నమైన, సున్నితమైన చిన్నారికి అత్యంత క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడానికి తమ మల్టీ డిసిప్లీనరీ బందం విజయవంతమైన నైపుణ్యాలు, కేర్ ఆస్పత్రి వద్ద ఉన్న అత్యాధునిక సదుపాయాలకు ఉదాహరణగా నిలుస్తాయని చెప్పారు. ఎంఎస్ డాక్టర్ అజిత్ సింగ్, అనెస్తాసియా విభాగ డాక్టర్లు,ఇతర వైద్య సిబంది, నర్సులు,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కంచు కోట ఖైరతాబాద్



- ఎమ్మెల్యే, కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

'మీ కుటుంబ సభ్యునిగా మిమ్మల్ని నమ్మి మీ అందరితో చర్చించకుండా సొంత ఇంటి పార్టీలో చేరడం మీపై నమ్మకమే' అనిఎమ్మెల్యే, కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం సికింద్రబాద్ పార్లమెంటు ఖైరతాబాద్ బూత్ లెవల్ సమావేశం జయ గార్డెన్‌లో జరిగింది. ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్,మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,ఎంపీ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలతో కలిసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రజా పాలనలో ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వటంతో పాటు తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయననే భరోసాతో ఎంపీ అభ్యర్థిగా తనను ప్రకటించారని అన్నారు.నమ్మకం బలం బలహీనత మీరేననీ తనను 20 వేలకు తగ్గకుండా మెజారిటీతో విజయం అందించిన ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో కూడా అత్యధిక మెజారిటీ అందించాలని కోరారు. ఈ ఘనత ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలకు దక్కాలని, నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీనీ తూచా తప్పకుండా నెరవేర్చే బాధ్యత తనపై ఉందని తెలిపారు. కార్పొరేటర్లు లక్ష్మి రామన్ గౌడ్,వనం సంగీత శ్రీనివాస్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని వైద్యురాలి క్లినిక్ సీజ్

నవతెలంగాణ-బంజారా హిల్స్

అర్హత లేని వైద్యురాలి క్లినిక్ సీజ్ చేయడంతో పాటు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి లైసెన్సు లేకుండా డాక్టర్ పేరిట వైద్య సేవ లను అందిస్తున్న అన్నపురెడ్డి అలియాస్ రాజ్యలక్ష్మి అనే మహిళను డ్రగ్స్ కంట్రోల్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ.లక్ష విలువ చేసే 40 రకాలకు సంబంధించిన వివిధ ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.

శిల్పారామంలో సంగీత విభావరి



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

మాదాపూర్‌లోని శిల్పారా మంలో నిర్వహించిన సంస్కృ తిక కార్యక్రమంలో భాగంగా ఎంపీ థియేటర్‌లో శ్రీ వాగ్దేవి సంగీత శిక్షణాలయం సంగీత గురువర్యులు గాయత్రీ దేవి శిష్యా బృందం సంగీత విభా వరి నిర్వహించారు. శ్వేతా, శరణ్య, భార్గవి, అపర్ణ, మొదలైన వారు సీతమ్మ మాయమ్మ, ప్రణ మామ్యహం, జగదానందకారకా, బ్రోవ భారమ, అన్నపూర్ణే, సుమనస, ఆదిలక్ష్మి, శ్రీమన్నారాయణ, ఇదిగో భద్రాద్రి, పహిరమా ప్రభో మొదలైన సంకీర్తనలను అలరిం చారు. వీరికి పవన్‌సింగ్ వయో లిన్, శ్రీకాంత్ మృదంగం, ఘటం వెంకటేష్ సహకరించారు.

ఎంబీ మండి రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చందానగర్

చందానగర్ డివిజన్ పరి ధిలోని శ్రీదేవి థియేటర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబీ మండి, రెస్టారెంట్‌ను చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డితో కలి సి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మాదా పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులు గురు చరణ్ దూబే, నాగరాజు, రామరాజు, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

- వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అందజేత
- ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ



నవతెలంగాణ-సిటీబ్యూరో

వివిధ రంగాల్లో నిష్ణాతులైన సుమారు 40 మంది కళాకారులు, విద్యావేత్తలు వైద్యరంగ నిపుణులు సినీ ప్రముఖులు తదితరులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. బేగంపేటలోని ప్లాజా హెరీటల్లో సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన ఈ కార్యక్ర మానికి తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ ముఖ్య అతిథిగా హాజరై ఉగాది పురస్కారా లను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ లక్ష్మీకాంతం, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్, పారిశ్రామిక వేత్త ఆర్క్ గ్రూప్ సీఎండీ గుమ్మి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వారిలో సినిమా విభాగంలో సినీ దర్శకుడు శ్రీనివాస్ నేదునూరికి ఈ పురస్కారాన్ని అందజేశారు. వృద్ధుల పట్ల నేటి తరం ప్రవర్తిస్తున్న తీరును ముక్కుసూటిగా ప్రశ్నిస్తూ.. మనసులను కదిలించే సంధ్యారాగం చిత్రాన్ని రూపొందించడమే కాకుండా సామాజాన్ని జాగృతం చేసే పలు రచనలు చేసినందుకుగాను శ్రీనివాస్ నేదునూరి ఈ ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నేదునూరి మాట్లాడుతూ తన రచనలను, సంధ్యారాగం సినిమాను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ జ్యూరి కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందన్నారు. సీనియర్ సినిమా జర్నలిస్ట్ వినాయకరావు, ప్రైమ్ 9 న్యూస్ చైర్మెన్ బండి శ్రీనివాస్, సామాజిక సేవలో బి. విజయ్ కుమార్ లయన్ టీవీఎస్ రావు, డాక్టర్ ఎస్ఎన్వీ సుబ్బా రావు, కోన శ్రీనివాసరావు, ఎం.ఎస్ విజయకుమార్, భవాని, వినోద్, వ్యాపార వేత్త, నిశ్చయం గ్రూప్ సీఈవో విష్ణుప్రియ తదితరులు ఉన్నారు.

లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 10 ఏండ్ల జైలు

నవతెలంగాణ-కూకట్ పల్లి



బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి స్పెషల్ ఫాస్ట్రాక్ కోర్టు పది సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి మూసాపేట్ డివిజన్ యాదవ్ బస్తీ చెందిన ఏ.అన్నమ్మ రామచంద్రరావు డైలీ లేబర్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారి గానే పనికి వెళ్లాడు. అదే బిల్డింగ్ లో అద్దెకుంటున్న బార్బర్ షాప్ కిషోర్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయం చూసి 16 సంవత్సరాల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో 23/08/2015న కంప్లైంట్ ఇచ్చారు. ఐపీసీ 376 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్షాదారాలన్నీ పరిశీలించిన తర్వాత కూకట్‌పల్లి స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జ్ జె.విక్రమ్ శనివారం తీర్పునిచ్చారు నిందితుడు కిషోర్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష పదివేల రూపాయలు ఫైన్ విధించారు. బాధితులకు తెలంగాణ గవర్నమెంట్ లిగల్ సెల్ తరపున 7లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించారు..

ఏసీపీ, సీఐ, ఎస్ఐ సస్పెండ్

నవతెలంగాణ-బంజారా హిల్స్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహిల్ ఆక్సిడెంట్ కేసులో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ కేసు విషయంలో సరైన రీతిలో వ్యవహరించ నందుకు పాత బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్, సీఐ రాజ్ శేఖర్ రెడ్డి, ఎస్ఐ చంద్ర శేఖర్‌లను సస్పెండ్ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. క్రైమ్ నెంబర్ 137/2022 కేసులో రహిల్ కు సహకరించినందుకు సస్పెండ్ చేసినట్లు సమాచారం.

దీర్ఘకాలిక సెలవుల రద్దు

- విదేశీ ప్రయాణాలకు అనుమతి రద్దు
- ఎన్నికల విధులకు రిపోర్ట్ చేయాలి
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ ఆదేశాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది కొరత ఏర్పడటంతో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న వారిని వెంటనే ఎన్నికల విధులకు రిపోర్ట్ చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక సెలవులతో పాటు విదేశీ ప్రయాణాల కోసం అనుమతులు తీసుకున్న వారు కూడా ఎన్నికల విధుల్లోకి రావాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బంది నియామక ఉత్తర్వులు జారీ చేసి నప్పటికీ సంభందిత శాఖల అధికారుల నుండి అనుమతి తీసుకున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది కొరత ఏర్పడడంతో వీరంతా వెంటనే రిపోర్ట్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దీర్ఘకాలిక సెలవు లతో పాటు, విదేశాల కు వెళ్ళ అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్ నామినేషన్ దృశ్యాలు









కిషన్ రెడ్డిని బలపరిచిన శారద మల్లేశ్



నవతెలంగాణ-ఓయూ

కేంద్రమంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయనను అజయ్ , సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్, మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శారద మల్లేష్ బలపరిచారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. లక్ష్మణ్ , బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

- బజరంగ్ దళ్

నవతెలంగాణ-బంజారా హిల్స్



హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే హనుమాన్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని బజరంగ్ దళ్,విహెచ్‌పీలు డిమాండ్ చేశాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరసింహమూర్తి,పండరీనాథ్,బజరంగ్దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు మాట్లాడారు... వినాయక ఉత్సవాలు,శ్రీరామనవమి వేడుకల అనంతరం అత్యధికంగా జరుపుకునే పండుగ హనుమాన్ జయంతి అని అన్నారు.ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా వీర హనుమాన్ విజయ యాత్రను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ ర్యాలీలో సుమారు 3 లక్షల మంది హిందువులు పాల్గొంటారని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం హనుమాన్ జయంతిని అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.

ఎన్నికల నిర్వహించాల్సింది పోయి నిర్వీర్యం చేస్తారా..

- గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ను నిర్వీర్యం చేస్తున్న వీసీ
- గెజిటెడ్ అసోసియేషన్ నేత బోయా కుమార్

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ప్రస్తుత వీసీ ప్రో. దండ బోయిన రవీందర్ పూర్తిగా నిర్వీర్యం చేసి అసోసియేషన్ అంటూ లేకుండా చేశారని ఓయూ గెజిటెడ్ అసోసియేట్ నేత బోయా కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 సంవత్సరం నుండి ఓయూ డైరీలో అసోసియేషన్ సభ్యుల పేర్లు కూడా లేకుండా తొలగించి వేయడం దీనిని నియంత్రించుటకు తాము అనగా ఆఫీసర్ అసోసియేషన్ కనీసం నాలుగు సార్లు రాతపూర్వకంగా, వ్యక్తిగతంగా అధికారులను, రిజిస్ట్రార్ ని కలిసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. అయినా వారి తీరు మారలేదన్నారు. ప్రస్తుత వీసీ చివరకు అసోసియేషన్ ఉనికిని లేకుండా చేయడం జరిగిందన్నారు. చివరకు స్టేట్ తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ వారు వీసీని స్వయంగా కలిసి ఇట్టి సమస్యపై చర్చించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా కొందరు ఆఫీసర్స్ అసోసియేషన్ కావాలని. మరికొందరు వద్దని విన్నవించుకోవడం జరిగిందన్నారు. అయితే ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకొని యునానమస్ రిజల్యూషన్ తీసుకొని తన వద్దకు వచ్చిన పది రోజుల్లోనే ఎన్నికల నిర్వహిస్తారని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అందరూ ఇంజనీరింగ్ కళాశాల ఈ క్లాస్ రూమ్ లో మీటింగ్ ఏర్పాటు చేసుకొని రిల్యూషన్ రిజర్వేషన్ కాపీని తీసుకొని అధికారులకు విన్నవించుకున్నారని.. కనీసం నెల రోజుల పైన అవుతున్నా అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ రిజిస్ట్రార్‌ను కలిసి సమస్యపై చర్చించినా అనుకూల ంగా స్పందించి ఆఫీసర్ అసోసియేషన్ ఫైల్‌ను వీసీ అప్రూవల్ కైపంపించారన్నారు. నేటికి వీసీ ఈ ఫైల్ ఓయూ లో గల గల ఒకరిద్దరి అధికారుల మాటలు విని, వారి సూచన మేరకు ఫైల్ ని పక్కకు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కావున అందరి నిర్ణయాన్ని గౌరవించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి లో ఉంటు వ్యక్తిగత కక్షపురితంగా వ్యహరించే వారికి రోజులు దగ్గర పడ్డాయి అన్నారు.

ఇస్మాయిల్‌కు ఘన సన్మానం

- రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొన్న ఇస్మాయిల్



నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తో పాటుగా భారత్ జోడు భారత్ జోడో న్యాయ యాత్రలో పూర్తిస్థాయిలో పాల్గొన్న సనత్ నగర్ నియోజకవర్గంకు చెందిన ఇస్మాయిల్‌ను పార్టీ సనత్ నగర్ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోటా నీలిమ శుక్రవారం బేగంపేట్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోటా నీలిమ మాట్లాడుతూ భారత్ దేశం లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసినట్టు తెలిపారు. దేశంలో సామాజిక న్యాయ సాధన తో పాటు అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అధికారంలో రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్మాయిల్ మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్రలో అనేక సంస్కృతుల తో పాటు అక్కడికి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం దొరికిందని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్, ఎస్సీ బ్లాక్ అధ్యక్షుడు రమేష్, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

ఎండీ. జహంగీర్ నామినేషన్‌కు తరలిన పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-తుర్కయంజాల్

భువనగిరి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ నామినేషన్ సందర్భంగా భువన గిరి పట్టణంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. రాగన్నగూడలోని సీపీఎం కార్యాలయం నుండి శుక్రవారం వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సం దర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ మాట్లాడుతూ ప్రజా ఉద్య మాల రథసారథి, కార్మిక, కర్షక వారధి, పేదల పెన్నిధి ఎండి జహంగీర్‌ను ప్రజలు ఆదరించాలన్నారు. అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇతర పార్టీల నాయకులు వారి వారి రాజకీయ, వ్యాపార స్వ ప్రయోజ నాల కోసం రోజుకో జెండా మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు పట్టించు కున్న దాఖలాలు లేవని అన్నారు. ధన ప్రభావంతో మత విద్వేషాలతో ప్రజల్ని మభ్యపెట్టి రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవాలని చూసే పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న సీపీఐ (ఎం)ను ప్రజలు ఆదరించాలని కోరారు.

మహమ్మద్ అస్థాక్‌కు సన్మానం

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఆస్థాక్ (770) సివిల్ స‌ర్వీసెస్ సాధించిన సందర్భంగా వీడీడీ ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నారాయ ణరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూరుమూల గ్రామాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం గొప్ప విషయం అన్నారు. ఇలాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు ఎన్.శుభప్రద్ పటేల్ మా ట్లాడుతూ నేటి యువతకు ఆస్థాక్ స్ఫూర్తి అన్నారు. ఈ ప్రాంతం నుంచి మరింత మంది ఉన్నతంగా రాణిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీడీడీఎఫ్ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రతినిధులు మారుతీ, తిరుప తిరెడ్డి, ఫకర్దీన్, మానిక్‌రెడ్డి, కేదార్‌నాథ్, సుజీత్ మఠంలా, ఆస్థాక్ తల్లిదండ్రులు మహమ్మద్ జాఫర్, రిజ్వాన్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో .. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, చార్లెస్ డార్విన్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్తలు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, చార్లెస్ డార్విన్ వర్ధంతి సభను కమలానగర్ ఆఫీసులో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ప్రముఖ విజ్ఞానవేత్త జయ ప్రకాష్ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు చార్లెస్ డార్విన్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం జయప్రకాష్ మాట్లాడుతూ.. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గురుత్వాకర్షణ శక్తి సూత్రాలను వివిధ ప్రయోగాల ద్వారా ఆధునికరించి సాపేక్ష సిద్ధాంతాన్ని రూపొందించారని చెప్పారు. ఫలితంగా ప్రపంచం ఎంతో పురోభివృద్ధి చెందటానికి దోహదపడిందన్నారు. జయరాజు మాట్లాడుతూ.. చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని రుజువులతో నిరూపించి మానవాభివృద్ధికి నూతన విధానాలను రూపొందించారని పేర్కొన్నారు. నాచురల్ సెలక్షన్ ద్వారా మానవ పరిణామ క్రమాన్ని వివిధ జీవ జాతుల పరిణామాన్ని సూత్రబద్ధ పద్ధతిలో నిరూపించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, చార్లెస్ డార్విన్ తమ ప్రతిభ ద్వారా అనేక పరిశోధనలు జరిపి మానవ సమాజానికి శాస్త్ర విజ్ఞాన ఫలితాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. ఇలాంటి శాస్త్రవేత్తలను మననం చేసుకోవటమే కాక, వారి శాస్త్ర పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి స్టడీ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జయరాజ్, జయప్రకాష్, గిరీష్, బాలు, శ్రీనివాసరావు, ఉన్ని కృష్ణన్, భాస్కర్‌రావు, పీబీ.చారి, శివరామకృష్ణ, వెంకటసుబ్బయ్య తదితరులున్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి : బండారి



- కాప్రాలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కాప్రా

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా డివిజన్ బీఆర్ఎస్ నాయకులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్థానికుడైన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. అనంతరం రాగిడి మాట్లాడుతూ.. మల్కాజిగిరి ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. మాటలతో మభ్యపెట్టే నాయకుల మాటలు నమ్మి ఆగం కావొద్దన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాననన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్, డివిజన్ అధ్యక్షులు సూదుగు మహేందర్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి గిల్బర్ట్, ఇంద్రయ్య, తదితరులున్నారు.

చర్లపల్లి డివిజన్‌లోని శ్రీ కృష్ణ కన్వెన్షన్‌లో..



చర్లపల్లి డివిజన్‌లోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్ పాష హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మల్కాజిగిరిలో ఓటు హక్కు లేదన్నారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గిరి బాబు, ప్రధాన కార్యదర్శి అనీల్, మహేష్‌గౌడ్, డివిజన్ ముఖ్య నాయకులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డికి ఓటేయండి




- కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డికి ఓటేయాలని ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని మానవపురం కాలనీలో సునీతారెడ్డి గెలుపు కోసం ఏఎస్‌రావు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఈ సదర్భంగా ఇంటింటికీ తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి మాటే లేకుండా పోయిందన్నారు. సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయన్నారు. కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి జలీల్ పాషా, అంజిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, భాషా, లింగం, నర్సింహా, శివ, అనీల్, భవానీ, ఉషా, ధనలక్ష్మి, పాపిరెడ్డి, రాజు, రెడ్డప్ప రెడ్డి, స్వామి ,మురళీచారి, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి: విశ్వసాయి



నవతెలంగాణ-మేడ్చల్

యువత రాజకీయాల్లో రాణించాలని జర్నలిస్ట్ విశ్వసాయి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి ఏదైనా పార్టీ తనకు అవకాశం ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని విడుదల చేసిన ప్రకటనను చూసి కొన్ని ప్రముఖ రాజకీయ పార్టీలు అయన్ను సంప్రదించాయని పేర్కొన్నారు. మల్కాజిగిరి స్థానం నుంచి కాకుండా ఇతర స్థానాల్లో పోటీచేయాలని వారు కోరినట్లుగా తెలిపారు. ప్రస్తుతం మల్కాజిగిరి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

మల్కాజిగిరిపై ఎవరి జెండా ఎగిరేనో..!

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకమే
- చెమటోడుస్తున్న నేతలు
- ఓటరు నాడీ పట్టేదేవరో



నవతెలంగాణ-బోడుప్పల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకర్గం దేశంలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్న నియోజకవర్గం. అందులోనూ అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటుండడంతో మినీ భారత్‌గా పేరొందింది. ఈ ఎన్నికల్లో మల్కాజిగిరి హాట్ టాపిక్ అయ్యింది. మల్కాజిగిరిలో గెలుపు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఎందుకంటే ఇక్కడి నుంచి గత ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచి సీఎం అయ్యారు. ఇప్పుడు సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా నిలుపుకోవడానికి రేవంత్ శత విధాలుగా ప్రయత్నం చేస్తున్నారు.

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో తుడిచి పెట్టుకు పోయిన బీఆర్ఎస్ మల్కాజిగిరిలో అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. శాసనసభ ఎన్నికల ఒరవడినే మళ్లీ కంటిన్యూ చేయాలని గులాబీ నేతలు ముందుకు సాగుతున్నారు. ఇక బీజేపీ విషయానికి వస్తే హుజురాబాద్, గజ్వేల్ స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మోడీ షరిష్మాతో గెలిచి కేంద్రంలో మంత్రి కావాలనే కృతనిశ్చయంతో తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలకు మల్కాజిగిరి పార్లమెంటు గెలుపు అత్యంత ప్రతిష్టాత్మకమైంది. మరి ఓటరు నాడీ పట్టేదేవరూ.. ఇక్కడ గెలిచేది ఎవరో వేచి చూడాలి.

కాంగ్రెస్‌కు జీవన్మరణ సమస్య..

2019 మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి మూడున్నర లక్షల మెజార్టీ ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఓడించి మల్కాజిగిరి ఎంపీగా గెలిచారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడై కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి సీఎం అయ్యారు. ఇప్పుడు ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్ కంటే కూడా తనకు రాజకీయ పునర్:జన్మనిచ్చిన మల్కాజిగిరి స్థానమే ఆయనకు ప్రతిష్టాత్మకమైంది. మల్కాజిగిరిలో గెలుపొందాలంటే బలమైన అభ్యర్థి కావాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో దశాబ్దాల పాటు చక్రం తిప్పిన పట్నం మహేందర్‌రెడ్డి ఫ్యామిలీ నుంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రెండు పర్యాయాలు, వికారాబాద్ జిల్లాకు ఒకసారి జడ్పీచైర్ పర్సన్‌గా అనుభవం ఉన్న పట్నం సునీతారెడ్డిని రంగంలోకి దింపారు. దానికి తోడు స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేలా రంగం సిద్ధం చేశారు. పార్లమెంట్ గెలుపు బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షిస్తుండడంతో పాటు గడిచిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఆయా నియోజకవర్గాలకో ఆర్డినేషన్ బాధ్యతలు అప్పగించారు. కుత్బుల్లాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు పార్టీలో చేరుతుండడంతో గెలుపుపై కాంగ్రెస్ ధీమాగానే ఉందనే చెప్పాలి.

పట్టుకోసం గులాబీ లీడర్ల పాట్లు..

గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో నష్టం జరిగినా గ్రేటర్ హైదరాబాదు, శివారు ప్రాంతాల్లో బీఆర్ఎస్ తన బలాన్ని నిలబెట్టుకుంది. అందులో భాగంగానే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు ఎమ్మెల్యే స్థానాలను గెలిచింది. ఇక్కడ గెలిచినా రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో గెలిచిన ఎమ్మెల్యేలు, ద్వితీయశ్రేణి నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో గెలుపుపై మీమాంసలో పడింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డిలు పోటీ పడ్డారు. కానీ శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన రాగిడి లక్ష్మారెడ్డికి అధిష్టానం టికెట్ ఇచ్చింది. ఇక్కడ సుమారు మూడు లక్షలకు పైగా మెజార్టీ ఉన్న పార్లమెంట్ స్థానం గెలవకపోతే భవిష్యత్తులో బీఆర్ఎస్ మనగడే ప్రశ్నార్థకంగా మారుతుందని గులాబీ శ్రేణుల్లో బుగులు మొదలైనట్టు తెలుస్తోంది. దానికి తోడు గత ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బీజేపీలోకి వెళ్లడం, ఉప్పల శ్రీనివాస్ గుప్తా కాంగ్రెస్‌లో చేరడం, కార్పొరేటర్లు, మేయర్లు పార్టీని వీడు తుండడంతో గులాబీ నేతలు అయోమయంలో పడుతున్నారు.

ఈటలకు ప్రతిష్టాత్మకం..

బీఆర్ఎస్‌లో ఓ వెలుగు వెలిగిన ఈటల అనివార్య కారణాలతో బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీ తరఫున హుజురాబాద్ ఉప ఎన్నికల్లో గెలుపొందారు. అనంతరం కేసీఆర్‌పై బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టి బీజేపీ జాతీయ నాయకత్వానికి దగ్గరయ్యారు. కొందరి వ్యవహారంతో పార్టీ మారుతారని వార్తలు వచ్చాయి. దీంతో జాతీయ నాయకత్వం కలుగచేసుకుని ఈటలకు చేరికల కమిటీ చైర్మెన్ పదవీని కట్టపెట్టింది. అ విధంగా పార్టీ పటిష్టతకు పనిచేసిన ఈటల అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టికెట్ సాధించారు. ఇక్కడ గెలుపొందక పోతే ఈటల రాజకీయ భవిష్యత్తు మాత్రం ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఎన్నికల షెడ్యూల్ రావడంతోనే మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో మోడీతో భారీ స్థాయిలో రోడ్డు షోలు నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కీలక నేతలను పార్టీలోకి చేర్చుకోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ అనుకూలతలు...

1)రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం
2) అభ్యర్థి అందరికి తెలిసిన వ్యక్తి కావడం
3) ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో చేరుతుండడం

వ్యతిరేకతలు...

1) వలస నేతలకు టికెట్ ఇచ్చారనే విమర్శలు, సంక్షేమ పథకాల అమలుపై సందిగ్ధత ఉండటం.
2) గతంలో పార్టీని ఇబ్బందులు పెట్టిన వారు పార్టీలో చేరుతుండడం లాంటి వ్యతిరేకతలు ఉన్నాయి.

బీఆర్ఎస్ పార్టీ అనుకూలతలు

1) పార్లమెంట్ సెగ్మెంట్‌లో అన్ని స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఉండడం.
2) పార్టీకి బలమైన క్యాడర్ ఉండడం.

వ్యతిరేకతలు

1) అభ్యర్థి అందరికి పరిచయం లేకపోవడం
2) ఎమ్మెల్యేల సహకారం కొరవడడం
3) రోజుకో నేత ఇతర పార్టీలోకి వెళ్తుండడం

బీజేపీ అనుకూలతలు

1) కేంద్రంలో అధికారంలో ఉండడం.
2) బీసీ అభ్యర్థి, కేసీఆర్‌పై పోరాడిన వ్యక్తిగా గుర్తింపు.
3) దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఓటర్లుగా ఉండడం.

వ్యతిరేకతలు..

1) పార్టీకి నిర్మాణం లేకపోవడం.
2) అభ్యర్థి స్థానికుడు కాకపోవడం.
3) గడిచిన పదేండ్లల్లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు నిధులు సరైన కేటాయించకపోవడం, నిరుద్యోగం, అధిక ధరలు లాంటి వ్యతిరేకతలు బీజేపీపై ఉన్నాయి.

మతసామరస్యానికి ప్రతీక ఈద్-మిలాప్



- ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాప్ జరుపుకుంటారని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఫారూక్ శుక్రవారం మల్కారంలో ఏర్పాటు చేసిన ఈద్ - మిలాప్ కార్యక్రమానికి పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ అనంతరం కుల మతాలకు అతీతంగా జరిగే ఈద్ - మిలాప్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు ముజీయుద్దీన్, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కోటేష్‌గౌడ్, కార్పొరేటర్లు యువరాజు, సాయికుమార్, శ్రీకాంత్, యువజన సంఘం అధ్యక్షులు వినయ్ కుమార్, సదానంద్, రాజుయాదవ్, వెంకన్న, వెంకటేష్ తదితరులున్నారు.

రేపు చికెన్, మటన్ దుకాణాలు బంద్



- కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

మహవీర్ జయంతి సందర్భంగా జవహర్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని చికెన్, మటన్, ఫిష్, వ్యాపార దుకాణాలు ఆదివారం రోజు బంద్ చేయాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

శానిటేషన్ సిబ్బందితో సమావేశం

జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అధ్యక్షతన శానిటేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పరిధిలోని దుకాణాలదారుల నుంచి లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, జవాన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ ప్రజలందరూ చెత్తను మీ ఇంటి దగ్గరికి వచ్చే చెత్త బండిలో, లేదా మున్సిపల్ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీలలో వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నీటిని ఉచితంగా అందించాలి

- జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం



నవతెలంగాణ- జవహర్ నగర్

డంపింగ్ యార్డు బాధిత ప్రాంతాలకు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఉచితంగా నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని జుగ్గి జోపీడీ మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి బాబుసింగ్, డంపింగ్‌యార్డు జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ బోర్డ్ జనరల్ మేనేజర్ అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఆర్డర్ ప్రకారం ఉచిత నీరు, ఉచిత నీటి కనెక్షన్లు, ఉచిత వైద్యం, కనీస మౌలిక వసతులు ప్రభుత్వం, రాంకీ సంస్థ అందించాలని కోరారు. లేని యెడల ఉద్యమిస్తామని అన్నారు. డంపింగ్ యార్డు బాధిత ప్రాంతాలైన జవహర్ నగర్, కీసర, దమ్మాయిగూడ, నాగారం, సాకేత్ ప్రాంతాలు నీటి కాలుష్యం మరియు వాతావరణ కాలుష్యంతో దాదాపు 18 లక్షల మంది సామాన్య ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2017లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్ట్ ఈ ప్రాంతాలకు ఉచిత నీటిని, ఉచిత వైద్యం కల్పించాలని ఎన్జీటీ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జుగ్గి జోపీడీ పార్లమెంట్ ఇన్‌చార్జి బాబు సింగ్, కన్వీనర్ తాళ్లపల్లి లింగం, కో కన్వీనర్ రంగుల శంకర్ నేత, మేడ్చల్ కో కన్వీనర్ ముత్యం సుజాత, జేఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ శివ కేశవ్, జేఎంసీ సెక్రెటరీ శ్రవణ్, శివ, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే చేరికలు : ఈటల



నవతెలంగాణ-మేడ్చల్

మోడీ దేశానికి చేసిన అభివృద్ధిని చూసే యువకులు, మహిళలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని మల్కాజి గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సూతరిగూడ గ్రామంలో కౌన్సిలర్ రజిత వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 150 మంది నాయకులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు అమరం సరస్వతి మోహన్ రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, హంసారాణి కృష్ణ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, తదితరులున్నారు.

ఇంటింటికీ చెత్త సేకరణ పై అవగాహన



నవతెలంగాణ-ఉప్పల్

ప్రతీ ఇంటిలోని చెత్తను ఇంటింటికీ చెత్త సేకరించే ఆటోలకు ఇవ్వాలని రామంతపూర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్, కామాక్షిపురం కాలనీ వాసులకు జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది, యూసీడీ మహిళ విభాగం ఆర్పీలు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ సభ్యులు, స్కూలు విద్యార్థులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీధి వీధిన తిరుగుతూ జీహెచ్ఎంసీ ఆటోకు చెత్తను ఇవ్వాలని మహిళలను ప్రోత్సహించారు. ఆరు బయట ప్రదేశాల్లో, మోరీల్లో చెత్తను పడేయొద్దని సూచించారు. ప్రతీ రోజు చెత్తను జీహెచ్ఎంసీ ఆటో వాళ్లకు ఇచ్చి నెల అయ్యాక వారికి యూజర్ చార్జెస్ డబ్బు చెల్లించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆటో వారికి జీహెచ్ఎంసీ ఎలాంటి జీతభత్యాలు చెల్లించని విషయాన్ని ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగం సెక్షన్ హెడ్ చందన చౌహన్, మహిళ విభాగం యూసీడీ సెక్షన్ అధినేత్రి రమాదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీధర్ రెడ్డి, శానీటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు దస్తగిరి, మారయ్య, సిద్ధి లింగం, జంగయ్య, ఎస్ఎఫ్ఏలు బాబురావు, కిషోర్‌కుమార్, విద్యాసాగర్, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ "పసుపు, కుంకుమ, వాయనం" అందజేశారు. చెత్తను ఆరు బయట ప్రదేశాల్లో వేసిన వారికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

- పాల్గొన్న మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలంగాణలో గ్రామ దేవతలకు ప్రత్యేక స్థానం ఉంటుందని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో పోచమ్మ ఆలయ పునర్:నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ తో కాలనీ ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు జమాల్ పూర్ నవీన్ కుమార్, కుతాడి సాయి కుమార్, ఆలయకమిటీ అధ్యక్షులు సాంబయ్య గౌడ్, సెక్రటరీ ప్రతాప్ చారి, ట్రెజరర్ లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ సుశీల, శ్రీనివాస్, బీజేపీ నాయకులు రంగుల శంకర్, సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

24న విఖ్యాత శాస్త్రీయ సంగీత గాయకులకు సత్కారం

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగ రాగిణి నిర్వహణలో ఈ నెల 24 తేదీన శ్రీత్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదికపై విఖ్యాత శాస్త్రీయ సంగీత గాయకులు శోభారాజ్ డి.వి.మోహనకృష్ణలను సత్కరిస్తున్నామని సంస్థ అధ్యక్షులు రమణకుమారి కార్యదర్శి సుబ్బలక్ష్మిలు శుక్రవారం గానసభలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చారిత్రక నవలా రచయిత డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ పాల్గొనగా ప్రముఖ గాయని హైమావతి భీమన్న అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సామాజిక కార్యకర్త శైలజ, గానసభ అధ్యక్షుడు కళాజనార్ధన మూర్తి పాల్గొననున్నారు. ఈ సందర్భంలో అన్నమయ్య సంకీర్తన గానం సత్య ప్రసాద్ వ్యాఖ్యానంలో రమణ కుమారి, వెంకటి బాబు, హిమజ, శశి, కాంతి ఉన్నారు.

23న పాత్రికేయులకు శృతిలయ, స్కిల్‌వెల్ పురస్కారాలు

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 23 తేదీన రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై క్రోధి నామ ఉగాది పురస్కారాలు పాత్రికేయులకు బహుకరించనున్నట్టు శృతిలయ ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఆమని, స్కిల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు, యూ బ్లడ్ డాక్టర్ జగదీష్, ధన క్రాప్స్ సీఎండీ. రవికుమార్‌లు తెలిపారు. ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని విశిష్ట పాత్రికేయ పురస్కారాలు రాధాకృష్ణ, కనకదుర్గ, కాసుల ప్రతాప్ రెడ్డి, తడి ప్రకాష్, పున్న కృష్ణమూర్తి, ఆర్. కమలాసనరావు, ఉత్తమ పాత్రికేయ పురస్కారాలు గీతాంజలి, వీరహత్ అలీ, పి. శ్రీధర్, గురునాథ్, మోహనమూర్తి, రవిచంద్రలకు బహుకరిస్తారు. అతిథులుగా మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్, తదితరులు పాల్గొనన్నారు. ఈ సందర్భంలో విఖ్యాత గాయని శిష్టా జానకి జన్మదిన పురస్కరించుకొని ఆమనీ బంధం పాటలతో విభావరి ఉంటుందని తెలిపారు.

బీబీసీటీ అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చ బొల్లారంలో ఉన్న వీబీసీటీ అపార్టుమెంట్‌లో ఏసీ షార్ట్ సర్క్యూట్ వల్ల శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఫైర్ సిబ్బంది అపార్టుమెంట్ వద్దకు చేరుకొని మంటలు అదుపు చేశారు. మంటలను ఆర్పేందుకు ఇంట్లోకి వెళ్లిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.



శరీరానికైన గాయం బయటకు కనిపిస్తుంది. కానీ మనసుకైన గాయం మాత్రం ఎవరికీ కనిపించదు. దాన్ని అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుంది. అలాంటి గాయానికి ఎలాంటి మందులూ అంత త్వరగా పని చేయవు. ఈ గాయాలు మానాలంటే చాలా సమయం పడుతుంది. అయినా సమస్య పరిష్కారమవుతుందని కచ్చితంగా చెప్పలేము. అలా మనసుకు గాయమైన ఓ వ్యక్తి కథే ఈ వారం ఐద్వా అదాలత్...

లేనిపోని భయాలతో...

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

పల్లవికి 42 ఏండ్లు ఉంటాయి. ఇద్దరు పిల్లలు. భర్త అజయ్‌కి మంచి ఉద్యోగం, ఆర్థికంగా బాగానే ఉన్నారు. పిల్లలు ఉదయం వెళితే సాయంత్రం వస్తారు. ఇంటికి రాగానే ట్యూషన్, కోచింగ్ అంటూ వెళ్ళిపోతారు. పల్లవి కూడా ఉద్యోగం చేస్తుంది. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉంటారు. ఇంట్లో దేనికీ కొదవలేదు. పల్లవికి ఏమైనా కావాలంటే ఎవరినీ అడగాల్సిన పని లేదు. తనకు ఇష్టమైంది కొనుక్కోవచ్చు. బట్టలు, నగలు ఏవైనా సరే 'ఎందుకు కొన్నావు' అని అజయ్ అడగడు. అతనికి కావల్సినవి కూడా ఆమే తీసుకొస్తుంది.

పెండ్లి, ఫంక్షన్లు ఏమున్నా పల్లవినే గిఫ్టులు తెచ్చి ఇస్తుంది. వీటి కోసం ఎప్పుడూ అజయ్ దగ్గర డబ్బులు తీసుకోలేదు. అలా తీసుకోవడం ఆమెకు ఇష్టం లేక కాదు. ఆమె కూడా ఉద్యోగం చేస్తుంది కనుక డబ్బులు ఉన్నాయి. ఇక భర్తను అడగటం ఎందుకని ఆమె ఉద్దేశం. పల్లవి తనకు వచ్చిన జీతం మొత్తం చిట్టీలకు, ఎల్.ఐ.సిలకు, ఇంట్లో ఖర్చులకు ఉపయోగించేది. అయితే కరోనా సమమయంలో ఆమెకు ఉద్యోగం పోయింది. దాంతో చేతిలో డబ్బుల్లేవు. ఎలాగో అలా చిట్టీ పూర్తి చేసింది. ఎల్.ఐ.సికి ప్రతి ఏడాది రెండు లక్షలు కట్టాలి.

భర్తకు చెబుదామంటే తను ఏమనుకుంటాడో అనే సందేహం. అయితే ఎల్.ఐ.సి అజయ్ కడుతున్నాడు. కానీ ఆమె చేతికి డబ్బులు ఇవ్వడం లేదు. ఆమే అడగడం లేదు. పిల్లలకు కూడా ఏమీ కొనివ్వలేకపోతుంది. ఈ బాధ ఆమెను నిత్యం ఇబ్బంది పెట్టేది. దాంతో వేరే ఉద్యోగం చూసుకునేందుకు ప్రయత్నించాలనుకుంది. కానీ ఆరోగ్యం సహకరించడం లేదు. ప్రతి చిన్న విషయానికి ఎక్కువగా ఆలోచించి మానసికంగా కుంగిపోతుంది. ఆ ప్రభావమే శరీరంపై పడింది. చిన్న చిన్న పనులు చేసినా అలసిపోతుంది. జ్వరం వచ్చినా ఆస్పత్రికి వెళ్ళడం లేదు.



> భర్తకు చెబుదామంటే తను ఏమనుకుంటాడో అనే సందేహం. అయితే ఎల్.ఐ.సి అజయ్ కడుతున్నాడు. కానీ ఆమె చేతికి డబ్బులు ఇవ్వడం లేదు. ఆమే అడగడం లేదు. పిల్లలకు కూడా ఏమీ కొనివ్వలేకపోతుంది. ఈ బాధ ఆమెను నిత్యం ఇబ్బంది పెట్టేది.

అజయ్‌ని ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నానేమో అని నిత్యం ఆలోచించేది. మరీ ఇబ్బంది అయితే అప్పుడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళుతుంది. 'ఖర్చులకు డబ్బు ఎలా, ఎవరిని అడగాలి' అనే దిగులు రోజురోజుకు పెరిగిపోతోంది. గతంలో తల్లిదండ్రులు, తమ్ముళ్ల, ఆడపడుచులకు అందరికీ ఆమే డబ్బు ఇచ్చేది. అలాంటిది ఇప్పుడు తన పరిస్థితి ఇలా అయ్యిందని బాధపడుతుంది. దాంతో మానసిక ఒత్తిడికి గురయ్యింది. దానికి తోడు అధిక బరువు, థైరాయిడ్ కూడా చేరాయి. ప్రతి చిన్న విషయానికి చిరాకు పడుతుంది. దీని వల్ల అజయ్ తనకు ఎక్కడ దూరమవుతాడో అనే భయం మొదలయింది.

చిన్న చిన్న విషయాలకే ఏడవడం, ఎక్కువ ఆలోచించడం, అరవడం లాంటివి చేస్తుంది. ఒకసారి ఆస్పత్రికి వెళ్ళి తన సమస్యను అజయ్ ముందే డాక్టర్‌కు చెప్పింది. డాక్టర్ '40 ఏండ్ల తర్వాత హార్మోన్లలో రకరకాల మార్పులు వస్తాయి. దాని వల్లనే మీకు ఇలా అనిపిస్తుంది. నెలసరికి ముందు ఇలా అనిపించడం సహజం. మీ సమస్య ఇంట్లో అందరికీ చెప్పండి. ఇంట్లో వాళ్ళు మీకు సహకరిస్తారు. ముఖ్యంగా అజయ్ మీరు ఈ సమయంలో ఆమెకు అండగా నిలవాలి' అని చెప్పి పంపించింది.

రెండు మూడు నెలలు బాగానే ఉన్నారు. కానీ పల్లవిలో మళ్లీ అదే బాధ. 'నేను డబ్బులు సంపాదించలేక పోవడం వల్ల పిల్లల ముందు, అజయ్ ముందు తక్కువైపోతానేమో, నన్ను లెక్క చేయరేమో? ఇలాగే ఉంటే నాకంటూ ఎలాంటి గుర్తింపు ఉండదు. వాళ్ళు చెప్పినట్టు నేను చేయాల్సి వుంటుంది' అని మనసులో ఆలోచిస్తూ ఉండేది. ఇలాంటి పరిస్థితుల్లోనే తన సమస్యకు పరిష్కారం చూపమంటూ ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

మేము అజయ్‌ను, పిల్లలను పిలిపించాము. అజయ్ మాట్లాడుతూ 'మాకు ఎలాంటి సమస్యా లేదు. ఆమెకు కావల్సినవన్నీ ఇంట్లో ఉంటాయి. ఆమె ఉద్యోగం చేయక పోయినా మాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఆమె ఆరోగ్య పరిస్థితి అంతగా బాగోలేదు. ఎక్కువగా ఆలోచించి సమస్యలు తెచ్చుకుంటుంది. ఒకసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. ఇప్పుడు మీ దగ్గరకు తీసుకొచ్చింది. నేను ఆమెను ఇష్టపడి పెండ్లి చేసుకున్నాను. అలాంటిది ఆమెను ఎందుకు వదిలిపెడతాను? పల్లవిని నేను ఇప్పటి వరకు ఒక్క మాట కూడా అనలేదు. అయినా ఆమె ఎందుకు ఇలా అనుకుంటుందో అర్థం కావడం లేదు' అన్నాడు.

'మా మమ్మీ ఇప్పుడు ఉద్యోగం చేయకపోయినా మా కోసం అప్పట్లో దాచిపెట్టిన డబ్బు ఉంది. కానీ అది తను వాడుకోవడం లేదు. మాకు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటుంది. ఇంకా చెప్పాలంటే మమ్మీ ఉద్యోగం చేసినప్పటి కంటే మాకు ఇప్పుడే బాగుంది. మేము ఇంటికి వచ్చే సరికి తినడానికి ఏదో ఒకటి వేడి వేడిగా చేసి పెడుతుంది. ఇంతకు ముందు కూడా చేసేది కాని పొద్దున్నే చేసి పెట్టి వెళ్ళేది. ఇప్పుడైతే మాతో పాటే మేము తినే వరకు కూర్చుంటుంది. అప్పుడు ఫోన్లో అడిగేది. మాకైతే ఇప్పుడే బాగుంది' అన్నారు పిల్లలు.



> 'మాకు ఎలాంటి సమస్యా లేదు. ఆమెకు కావల్సినవన్నీ ఇంట్లో ఉంటాయి. ఆమె ఉద్యోగం చేయక పోయినా మాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఆమె ఆరోగ్య పరిస్థితి అంతగా బాగోలేదు. ఎక్కువగా ఆలోచించి సమస్యలు తెచ్చుకుంటుంది. ఒకసారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. ఇప్పుడు మీ దగ్గరకు తీసుకొచ్చింది. నేను ఆమెను ఇష్టపడి పెండ్లి చేసుకున్నాను. అలాంటిది ఆమెను ఎందుకు వదిలిపెడతాను?

అందరి మాటలు విన్న తర్వాత పల్లవి మానసిక ఒత్తిడితో పాటు, హార్మోన్ల అసమతుల్యతతో బాధపడుతుందని అనిపించి... 'అజయ్ మీరు మీ భార్య కోసం ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించాలి. అలాగే ఆమెకు ఆసక్తి ఉంటే వేరే ఉద్యోగం చూసుకోవడంలో సహకరించండి. ఉద్యోగం లేక, ఖర్చులకు మీపై ఆధారపడుతున్నాననే ఫీలింగ్ ఆమెలో బాగా ఉంది. కనుకే మీరే అడిగి మరీ ఆమెకు డబ్బులు ఇవ్వండి. మిమ్మల్ని అడగటానికి ఇబ్బంది పడుతుంది. ఈ విషయం గురించి మేము కూడా ఆమెతో మాట్లాడతాము. దాంతో సగం సమస్య తగ్గిపోతుంది. ఇక పోతే హార్మోన్ల సమస్యకు ఒక సారి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్ళండి. ఆమెకు మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంది. నాలుగు రోజులు పిల్లల్ని తీసుకొని సరదాగా ఎక్కడికైనా వెళ్ళిరండి. అప్పుడు కాస్త మార్పు వచ్చే అవకాశం ఉంది' అన్నాము. దానికి అతను ఒప్పుకున్నాడు.

పల్లవితో 'నీకు ఉద్యోగం లేనంత మాత్రానా బాధపడాల్సిన పని లేదు. ఇంటి బాధ్యతలన్నీ చూసుకుంటున్నావు. మీ పిల్లలు కూడా మీతో గడపడానికి ఇష్టపడుతున్నారు. మీ భర్తను డబ్బులు అడగటానికి మొహమాట పడాల్సిన అవసరం లేదు. మీరు ఇంటి బాధ్యతలు ఎలా చూస్తున్నారో మీ అవసరాలకు డబ్బు ఇవ్వాల్సిన బాధ్యత కూడా అతనికి వుంది. దాన్ని భారం అని ఎవ్వరూ అనుకోరు. ముందు ఆ ఆలోచన మీ మనసులో నుండి తీసెయ్యండి. మీకు చేయ్యాలనిపిస్తే మరో ఉద్యోగానికి ట్రై చేయండి. అజయ్ కూడా మీకు సహకరిస్తారు. చక్కగా మందులు వాడుతూ, ప్రశాంతంగా ఉండండి. మనసులో లేనిపోని భయాలు పెట్టుకోకండి. మీ ఇంట్లో వాళ్ళందరికీ మీరంటే చాలా ఇష్టం. మీకు ఎలాంటి సమస్య వచ్చినా మేము అండగా ఉంటాం' అని ధైర్యం చెప్పి పంపించాము.


- వై వరలక్ష్మి
9948794051

ముఖం డల్‌గా మారితే..

క్రమం తప్పకుండా చర్మానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే అందంగా ఉంచుకోవడం సాధ్యమవుతుంది. కానీ నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలితో మన చర్మాన్ని సంరక్షించుకోవడానికి తగినంత సమయం దొరకడం లేదు. వారాంతాల్లో క్రమం తప్పకుండా కొన్ని ఫేస్ ప్యాక్‌లను అప్లై చేయడం వల్ల చర్మ సౌందర్యం మెరుగుపడుతుంది. స్కిన్ టోన్ మెయింటెయిన్ అవుతుంది. అలాంటి కొన్ని ఫేస్ ప్యాక్‌లను వేసుకోవటం ద్వారా చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవచ్చు.

పసుపు, పెరుగు ఫేస్ ప్యాక్

ఈ ఫేస్ ప్యాక్ కోసం ఓ గిన్నెలో ఒక టీస్పూన్ పసుపు, రెండు టేబుల్ స్పూన్లు పెరుగు కలపండి. తర్వాత దీన్ని ముఖం, మెడ భాగంలో అప్లయి చేసి 20 నిమిషాల పాటు ఉంచుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ ఫేస్ ప్యాక్ ను వారానికి రెండు సార్లు ఉపయోగిస్తే చర్మంపై ఉన్న నల్లటి మచ్చలు తొలగిపోయి చర్మం కాంతివంతంగా ఉంటుంది.



తేనె, నిమ్మకాయ ఫేస్ ప్యాక్

ఈ ఫేస్ ప్యాక్ కోసం ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టీస్పూన్ నిమ్మరసం కలపండి. తర్వాత దీన్ని ముఖానికి పట్టించి 15-20 నిమిషాల పాటు ఉంచుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. ఈ ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై ఉన్న నల్లమచ్చలు, చర్మం నల్లబడటం పోయి ముఖం కాంతివంతంగా ఉంటుంది.

ఓట్ మీల్, పాలు ఫేస్ ప్యాక్

ఈ ఫేస్ ప్యాక్ కోసం, ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల వోట్ పౌడర్ తీసుకొని, అవసరమైన మొత్తంలో పాలు వేసి పేస్ట్ చేయండి. తర్వాత దీన్ని ముఖం, మెడ వంటి ప్రాంతాల్లో అప్లయి చేసి, కాసేపు మృదువుగా మసాజ్ చేయాలి. ఇప్పుడు 15-20 నిమిషాల పాటు ఉంచుకొని తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. దీనివల్ల చర్మంలోని మృతకణాలు తొలగిపోతాయి.

బొప్పాయి, తేనె ఫేస్ ప్యాక్

ఈ ఫేస్ ప్యాక్ కోసం ముందుగా కాస్త పండిన బొప్పాయిని తీసుకుని మెత్తగా చేసుకోవాలి. తర్వాత అందులో ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి కలపాలి. ఇప్పుడు దీన్ని ముఖం, మెడ భాగంలో అప్లయి చేసి 15-20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ ఫేస్ ప్యాక్ చర్మంలోని మలినాలను ఎఫెక్టివ్‌గా తొలగించి, చర్మ కాంతిని మెరుగుపరుస్తుంది. ఇది చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుతుంది.

కలబంద, దోసకాయ ఫేస్ ప్యాక్

ఈ ఫేస్ ప్యాక్ కోసం మీరు రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, పావు కప్పు దోసకాయను తీసుకొని మిక్సర్ జార్‌లో రుబ్బుకోవాలి. తర్వాత దీన్ని ముఖం, మెడ భాగంలో అప్లై చేసి 20-30 నిమిషాల పాటు ఉంచుకొని తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి. ఈ ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల చర్మం తాజాగా, కాంతివంతంగా ఉంటుంది. ■



ఈబీలపై ఈడీ చర్యలుండవా?

మనీలాండరింగ్ చట్టాన్ని ఎందుకు ఉపయోగించటంలేదు : ఏచూరి

న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్ల(ఈబీ)కు సంబంధించిన కేసులను దర్యాప్తు చేయటానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని ఎందుకు ఉపయోగించటం లేదని సీపీఐ(ఎం) జనరల్ సెక్రెటరీ సీతారాం ఏచూరి ప్రశ్నించారు. ఒక జాతీయ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఈబీలలో మనీలాండరింగ్‌కి సంబంధించి మీకు క్లియర్ కట్ కేసులు ఉన్నాయి. ఈబీలను తాము సంపాదించిన లాభాల కంటే చాలా రెట్లు కొనుగోలు చేసిన అనేక సంస్థలు ఉన్నాయి. నష్టపోయినప్పటికీ ఈబీలను అనేక సంస్థలు కొనుగోలు చేశాయి. వారికి ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?" అని ఆయన ప్రశ్నించారు.

ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు ఈ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసిన విషయం విదితమే. ఇది దాతలు, రాజకీయ పార్టీల మధ్య క్విడ్ ప్రోకో ఏర్పాట్లకు దారితీయవచ్చని న్యాయస్థానం అభిప్రాయపడింది. 2019, ఏప్రిల్ 12 నుంచి ఈబీలను స్వీకరించిన రాజకీయ పార్టీల వివరాలను జారీ చేసి, వాటిని ఎన్నికల కమిషన్(ఈసీ)కి సమర్పించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)ను కోర్టు ఆదేశించిన విషయమూ తెలిసిందే. ఈబీ విరాళాలలో బీజేపీకి సింహభాగం అందిందని బ్యాంక్ షేర్ చేసిన డేటా విశ్లేషణలో తేలింది. ఈబీల కొనుగోలుదారులలో కొన్ని కంపెనీలు కేంద్ర ఏజెన్సీల దాడులను ఎదుర్కొంటున్నవే కావటం గమనార్హం. ఏడేండ్లలో నష్టాలతో ఉన్నవి, లాభం లేకుండా ఉన్న 33 కంపెనీలు ఈబీల ద్వారా మొత్తం రూ. 581.7 కోట్లను విరాళంగా ఇచ్చాయి. వీటిలో రూ. 434.2 కోట్లను బీజేపీ ఎన్‌క్యాష్ చేసిందని విశ్లేషణలో తేలింది. కాగా, ఈబీలకు వ్యతిరేకంగా కోర్టులో దాఖలైన కేసులో పిటిషనర్లలో సీపీఐ(ఎం) కూడా ఒకటి. ఈబీల ద్వారా నిధులను అంగీకరించని రాజకీయ పార్టీగా సీపీఐ(ఎం) ఉన్నది.

ఎలక్టోరల్ బాండ్లు ఒక ప్రధాన పోల్ సమస్యగా మారాయని ఏచూరి అన్నారు. తాము ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా.. మోడీ ప్రభుత్వం దేశాన్ని ఈ విధంగా దోచుకోగలదన్న విషయం తమకు తెలియదని చెప్తున్నారని తెలిపారు. వారు (మోడీ, కేంద్రం) డిక్షనరీలో అందుబాటులో ఉన్న అన్ని సాధనాలనూ ఉపయోగించారనీ, దోపిడీ, క్విడ్ ప్రోకో, స్వీట్ హార్ట్ డీల్స్, మనీలాండరింగ్, బెదిరింపు చర్యల ద్వారా వేల కోట్ల రూపాయలను సేకరించి, కూడబెట్టారని ఏచూరి అన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణిస్తాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని కాంగ్రెస్, సీపీఐ(ఎం) పార్టీలు అంగీకారానికి వచ్చాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతా రాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డితో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాలకుపైగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో భట్టి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లౌకికవాద పార్టీలుఇండియా కూటమిలో ఉన్నాయని చెప్పారు. సాధారణ ఎన్నికల్లో లౌకిక ప్రభుత్వ ఏర్పాటు కోసం కృషి చేస్తామని అన్నారు. తెలంగాణకు సంబంధించి తమ పార్టీ ఆదేశాల మేరకు సీపీఐ(ఎం) కార్యాలయానికి వచ్చాననీ, ఎన్నికల్లో కలిసి ప్రయాణం చేద్దామని కోరానని చెప్పారు. కాంగ్రెస్‌తో కలిసి అడుగులు వేయాలనీ, మద్దతు ప్రకటించాలంటూ అభ్యర్థించడం కోసం వచ్చానని అన్నారు. ఇరు పార్టీల పరంగా అభిప్రాయాలు పంచుకున్నామని వివరించారు. ఇరువురి అభిప్రాయాలపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి శనివారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

లౌకిక ప్రభుత్వమే లక్ష్యం : తమ్మినేని

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పార్టీ కార్యాలయానికి రావడం, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలంటూ కోరడం ఆహ్వానించదగినదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను కాపాడుకోవాలని చెప్పారు. బీజేపీని గద్దెదించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. సహజంగానే కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం అనివార్య పరిణామమని చెప్పారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలన్నది తమ నిర్ణయమన్నారు. అందులో తేడా రాదని అన్నారు. కలిసి పనిచేయడానికి సంబంధించి ఉభయత్రా ఇచ్చిపుచ్చుకోవడాలు, గౌరవాలు కొన్ని అంశాలున్నాయని వివరించారు. సీట్లు, మద్దతు విషయంలో తమ అభిప్రాయం భట్టితో చెప్పామని అన్నారు. వాటిపై సీఎం, కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి చెప్తామన్నారని అన్నారు. శనివారం ఓ నిర్ధారణకు వస్తామన్నారు. తాము కోరిన విషయాల్లో సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. పోటీ విషయంలో తమ ప్రతిపాదన పెట్టామనీ, ఆ విషయం శనివారం తేలుతుందన్నారు. మిగతా స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కేరళలో బీజేపీతో సీపీఐ(ఎం) ఘర్షణ పడుతున్నదని, వందల మంది తమ పార్టీ కార్యకర్తలను బీజేపీ హత్య చేసిందని అన్నారు. అక్కడ బీజేపీని నిలువరించడానికి సీపీఐ(ఎం) శాయశక్తులా కృషి చేస్తోందనీ, అందులో విజయం సాధించిందని అన్నారు. అక్కడకు పోయి రేవంత్‌రెడ్డి బీజేపీతో సీపీఐ(ఎం)కు సంబంధాలున్నాయని వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. తెలంగాణలో బీజేపీ రాకుండా కాంగ్రెస్, సీపీఐ(ఎం) కలిసి ఆలోచించాలని సూచించారు. బీజేపీ ఒక్క సీటు కూడా గెలవకుండా చూడాలన్నారు. భువనగిరి సీటుపై చర్చ జరిగిందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి చర్చించినపుడు తుది నిర్ణయానికి వస్తామన్నారు.

కాగ్ సభ్యునిగా వేణుగోపాల్‌రావు

న్యూఢిల్లీ : సీనియర్ జర్నలిస్ట్ ఎం. వేణుగోపాలరావు తెలంగాణ స్టేట్ ఆడిట్ అడ్వైజరీ బోర్డ్ (ఎస్ఏఏబీ) సభ్యులుగా నియమితులయ్యారు. 2024-26 రెండేండ్లపాటు ఆయన సభ్యులుగా కొనసాగనున్నారు. ఈమేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) తెలంగాణ అధికారి పి. మాధవి గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే రెండో వారంలో జరగనున్న ఎస్ఏఏబీ సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ అయిన ఎం.వేణుగోపాల్‌రావు ప్రజాశక్తిలో సుదీర్ఘ కాలం పనిచేశారు. ఎస్ఏఏబీ సభ్యులుగా నియమితులైన వేణుగోపాల్‌రావుకి, సీపీఐ(ఎం) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, నవతెలంగాణ ఎడిటర్ సుధా భాస్కర్, సీజీఎం ప్రభాకర్, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సీజీఎం వై.అచ్యుత్‌రావు అభినందనలు తెలిపారు.

'దూరదర్శన్' కాషాయీకరణ

న్యూఢిల్లీ : మోడీ సర్కారు హయాంలో ప్రతి రంగమూ కాషాయీకరణ మయం అవుతున్నది. ఇప్పటికే విద్య కాషాయీకరణను మొదలు పెట్టిన మోడీ ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా సిలబస్‌లలో మార్పులు, చేర్పులు చేస్తూ వస్తున్నది. ఇప్పుడు దేశ ప్రజలు వీక్షించే ప్రభుత్వ ప్రసార దూరదర్శన్ ఛానెల్ పైనా బీజేపీ సర్కారు కన్ను పడింది. డీడీ న్యూస్ కొత్త లోగో కాషాయ రంగును సంతరించుకున్నది. ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఈ వార్తా ఛానెల్ సోషల్ మీడియా పోస్ట్‌లో కొత్త లోగోను ఆవిష్కరించింది.

అయితే, డీడీ న్యూస్ కలర్ మార్పు చాలా మందికి నచ్చటం లేదు. దీంతో ప్రభుత్వ తీరుపై పలువురు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొందరు నెటిజన్లు అయితే ఈ కలర్ నచ్చలేదనీ, మోడీ సర్కారు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికల సమయంలో ఇలాంటి మార్పులు చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఇది ప్రభుత్వ ప్రసార మాధ్యమాన్ని 'కాషాయీకరించటం' అని అభివర్ణించారు. ఈ అంశంపై ప్రసార భారతి మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జవహర్ సిర్కార్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. తాను దూరదర్శన్ కాషాయీకరణ పట్ల ఆందోళనను వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. దూరదర్శన్.. పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ప్రసార భారతి విభాగాలలో ఒకటి. మరొకటి ఆల్ ఇండియా రేడియో.

గత నెలలో దూరదర్శన్ నేషనల్ ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు అయోధ్యలోని రామ మందిరంలో జరిగే హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని తెలిపింది. కాగా, కేంద్రంలోని మోడీ సర్కారు.. దూరదర్శన్‌ను బీజేపీ పార్టీ ప్రసార, ప్రచార మాధ్యమంగా వాడుకుంటున్నదనే ఆరోపణలూ ఇప్పటికే ఉన్నాయి. ఆ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా వచ్చిన 'కేరళ స్టోరీ' చిత్రాన్ని ఈనెలలో దూరదర్శన్ ప్రసారం చేయటాన్ని నెటిజన్లు ఉదహరిస్తున్నారు. ఈ చిత్రాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేయటంపై కేరళ సీఎం పినరయి విజయన్ సైతం తప్పుబట్టారు. ఈ చిత్ర ప్రసారం లోక్‌సభ ఎన్నికల సమయంలో మత ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుందనీ, ప్రభుత్వ ప్రసార సంస్థ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. ఈ సినిమా పోలరైజేషన్‌ను ప్రేరేపించిందని విజయన్ తెలిపారు.

మూడి మస్సై పోతావ్..

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉండాలని ప్రజలు తమకు అవకాశమిస్తే.. బీఆర్ఎస్, బీజేపీ కలిసి 100 రోజుల్లోనే కూల్చాలని అనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ కథలకు కాలం చెల్లింది.. అయన మాటలు ఇక చెల్లుబాటు కావని విమర్శించారు. ఢిల్లీలో మోడీ, గల్లీలో కేడి జత కట్టారని, తెలంగాణ ప్రజలు రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్నికారెడ్డి, అనిరుద్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ మల్లురవి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఓబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.

మోడీ, కేడీ తోడు దొంగలు

మహబూబాబాద్ ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటేనని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును ప్రధాని నరేంద్రమోడీ తప్పు పట్టారని, తల్లి నుంచి బిడ్డను వేరు చేసినట్టుగా మాట్లాడిన మోడీకి తెలంగాణ ప్రజలు ఎలా ఓట్లు వేస్తారని నరేంద్రమోడీని, కిషన్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలో ఉండే మోడీ ఇక్కడ ఫాం హౌస్‌లో ఉండే కేడీ ఇద్దరు తోడు దొంగలేనని అన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, జహీరాబాద్, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం బీఆర్ఎస్ బలహీనమైన అభ్యర్థులను బరిలోకి దింపిందన్నారు. బిడ్డ బెయిల్ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కేసీఆర్ ఇచ్చే కమిషన్‌లకు మోడీ కక్కుర్తిపడ్డాడని అందుకే కాళేశ్వరంలో జరిగిన అంత అవినీతిపై కేసు పెట్టి జైలుకు పంపలేకపోయారన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని మూసి వేసింది ఈ బీజేపీ నేతలుకాదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీ కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరి చేస్తే నరేంద్ర మోడీ ఆ ఫ్యాక్టరీని లాహోర్‌కు తరలించారన్నారు. జూన్ 4వ తేదీన 14 మంది ఎంపీలను గెలిపించుకొని జూన్ 9న జరిగే ఢిల్లీ ఎర్రకోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడబోతున్నామన్నారు. పోరిక బలరాంనాయక్ సామాన్యుడని, అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి అని, ఆయనను భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బీజేపీ పార్టీకి గతంలో గెలుచుకున్న ఆ నాలుగు సీట్లు కూడా ఇప్పుడు దక్కవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారతరాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నిందని మంత్రి దనసరి అనసూయసీతక్క అన్నారు.

ఏ దాడినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం !

ఇరాన్ నగరంపై డ్రోన్‌లతో దాడి

కూల్చివేశామన్న ఇరాన్

వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ తిరస్కరణ

టెల్‌అవీవ్ : తమ గగనతలంపైకి దూసుకువచ్చిన మూడు డ్రోన్‌లను కూల్చివేశామని ఇరాన్ ప్రకటించింది. ఇస్ఫహాన్ నగరంపైకి వచ్చిన ఈ డ్రోన్‌లను ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలు ప్రయోగించి కూల్చివేసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఇరాన్‌పై ఎలాంటి దాడులు జరిగినా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా వున్నామని ఇరాన్ ఆర్మీ ప్రకటించింది. వైమానిక దాడుల ముప్పుతో సహా దేన్నైనా ఎదుర్కొనేందుకు తాము అప్రమత్తంగా వున్నామని ఇరాన్ పదాతిదళ కమాండర్ ఇన్ చీఫ్ కియొమార్స్ హేదరి పేర్కొన్నారు. తమ దేశ గగనతలంపై అనుమానాస్పదంగా ఏది కనిపించినా వెంటనే శక్తివంతమైన వైమానిక రక్షణతో దాన్ని ఎదుర్కొంటామని శుక్రవారం కమాండర్ ఇన్ చీఫ్‌ను ఉటంకిస్తూ ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. కాగా, ఇరాన్‌లోని ఒక ప్రాంతంపై ఇజ్రాయిల్ దాడి జరిపిందని అమెరికాకు చెందిన పేరు వెల్లడించని అధికారులు అమెరికా మీడియాకు తెలిపారు. కాగా ఇజ్రాయిల్ ఆర్మీ మాత్రం దీనిపై వ్యాఖ్యానించడానికి తిరస్కరించింది. ఇరాన్‌పై దాడి గురించి అమెరికాకు చివరి నిముషంలో సమాచారమిచ్చారని ఇటలీ విదేశాంగ మంత్రి తెలిపారు. కాగా ఈ దాడి నేపథ్యంలో పలు ఇరాన్ నగరాల్లో విమానాలను తాత్కాలికంగా నిలుపుచేశారు. సిరియా, ఇరాక్‌ల్లో పేలుళ్ళు సంభవించినట్లు కూడా వార్తలు వచ్చాయి. గాజాలో ఇజ్రాయిల్ గత ఆరుమాసాలుగా కొనసాగిస్తున్న మారణహోమం నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. డమాస్కస్ నగరంలోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయంపై అమెరికా జరిపిన దాడిలో ఇరాన్ కమాండర్లు, దౌత్యవేత్తలతో సహా 13మంది మరణించారు. ఈ దాడికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌ల వర్షం కురిపించింది. ఆ దాడికి తాము ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయిల్ ప్రకటించింది. అత్యంత ప్రమాదకరమైనటువంటి ఈ ప్రతీకార దాడుల చక్రాన్ని ఆపాల్సిన సమయం ఆసన్నమైందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ స్పష్టం చేశారు. అయితే ఇరాన్‌పై జరిగిన తాజా దాడిని ఆయన ప్రకటనలో ప్రస్తావించలేదు. ఎలాంటి ప్రతీకార చర్యలనైనా సరే ఖండించాల్సిందేనని అన్నారు. మొత్తంగా పశ్చిమాసియాను యుద్ధ మేఘాలు ఆవరించకుండా ముందుగానే జాగ్రత్త పడాల్సిన తరుణమిదని అన్నారు. ఇందుకోసం అంతర్జాతీయ సమాజం కృషి చేయాలన్నారు. ఇజ్రాయిల్ దాడితో ఒక్కసారిగా ఇస్ఫహాన్ నగరం అందరి దృష్టికి వచ్చింది. 22లక్షల మంది జనాభా వుండే ఈ నగరం ఇరాన్‌లో జన సాంద్రత కలిగిన నగరాల్లో మూడవది. ఇక్కడ అణు కేంద్రం వుంది.

ఆంక్షలు విధిస్తాం : జీ-7 హెచ్చరిక

ఇటలీలోని కాప్రి దీవిలో జరుగుతున్న జీ-7 విదేశాంగ మంత్రుల సమావేశంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధానంగా చర్చలు జరిగాయి. చర్చల అనంతరం అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయిల్ దాడిపై వ్యాఖ్యానించడానికి తిరస్కరించారు. ఏ దాడి విషయంలోనూ అమెరికా జోక్యం చేసుకోదని మాత్రమే వ్యాఖ్యానించారు. మొత్తంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించాలన్నదే జీ-7 లక్ష్యమని చెప్పారు. అమెరికా-ఇజ్రాయిల్ మధ్య ప్రస్తుతమున్న సంబంధాల గురించి వ్యాఖ్యానించమని కోరగా, ఇజ్రాయిల్ తన స్వంతంగా నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ అమెరికా తన భద్రతకు కట్టుబడి వుంటుందని చెప్పారు. అంతకుముందు ఇటలీ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడి గురించి అమెరికాకు చివరి నిముషంలో సమాచారం అందిందని చెప్పారు.

నేతన్నలకు రూ.50 కోట్లు విడుదల

మిగతా బకాయిలు త్వరలోనే విడుదల చేయండి : సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న మిగతా బకాయిలను కూడా వీలైనంత తొందరలోనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గతేడాది బతుకమ్మ చీరలకు సంబంధించి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.351 కోట్లు చెల్లించలేదు. దీంతో వేలాది కార్మిక కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. సిరిసిల్లలో కార్మికులు వరుసగా ఆందోళనలు చేయటంతో పాటు బకాయిలను చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలుమార్లు కార్మికులు, ఆసాములతో చర్చలు జరిపారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బకాయిలు విడుదల చేయాలని సీఎంను కోరారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బకాయిలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని బకాయిలను క్లియర్ చేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న తమ్మినేని


దప్పు కొడుతున్న రాఘవులు, చెరుపల్లి...


కమ్యూనిస్టులను గెలిపించండి

నవతెలంగాణ-భువనగిరి

"కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి లౌకికతత్వానికి హాని కలిగిస్తోంది. బీజేపీతో దేశానికి పెను ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రాలను మున్సిపల్ స్థాయికి దిగజార్చుతోంది.. పన్నుల్లో 50 శాతం నిధులు రాష్ట్రాలకు ఇవ్వాలి.. మాజీ సీఎం కేసీఆర్ అహంకారంతోనే ఓడిపోయిండు.. రేవంత్‌రెడ్డి అలాగే వ్యవహరిస్తున్నారు.. అహంకారం తగ్గించుకోవాలి.. ఇండియా కూటమిలో అందరం ఉన్నామన్న విషయం మర్చిపోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవాలి.." అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుల బీవీ.రాఘవులు అన్నారు.

శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఏఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీ పదేండ్ల పాలనలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వ్యవసాయ కార్మికులు విచ్ఛిన్నమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, మైనార్టీల జీవితాలు బుగ్గిపాలయ్యాయన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే సీపీఐ(ఎం) లక్ష్యం అన్నారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి యత్నిస్తూ.. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ పూలమాలలు వేస్తే, తాము ఆయన ఆశయాలు, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పూల మాలలు వేస్తామన్నారు. ఎన్నికల్లో సీపీఐ(ఎం)ను ఆదరించాలని కోరారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలని జనానికి పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశ ఐక్యత, అభివృద్ధికి ఆటంకమని చెప్పారు. సీఏఏ పౌరసత్వ చట్టాన్ని తీసుకొచ్చిందని, అది లౌకిక వాదానికి, మైనార్టీలకు హాని కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేశంలో వసూలు చేసే అన్ని రకాల పన్నుల్లో 50 శాతం రాష్ట్రాలకు కేటాయించాలని రాఘవులు కోరారు.


భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్

బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను మున్సిపాల్టీల స్థాయికి దిగజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. మత, కుల వ్యవస్థల వల్ల మైనార్టీలు, గిరిజనులు మహిళలకు హక్కులు, ప్రత్యేక సంక్షేమ పథకాలు అందకుండా పోతాయన్నారు. ప్రభుత్వ రంగాన్ని ఒకవైపు నిర్వీర్యం చేస్తూ ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌కు మోడీ ఒప్పుకోవడం లేదన్నారు.

కేంద్రం వివక్షపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఢిల్లీకి వెళ్లి పోరాడారని రాఘవులు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎదిరించిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేంద్ర ప్రభుత్వం జైల్లో పెట్టించిందని తెలిపారు. బీజేపీ ప్రగల్భాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, అభ్యర్థుల చరిత్రను, సీపీఐ(ఎం) అభ్యర్థి చరిత్రను చూసి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు.

మునుగోడు ఎన్నికల్లో సీపీఐ(ఎం) సహాయంతో బీఆర్ఎస్ గెలిచిందని గుర్తు చేశారు. కానీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ కుమార్తె కవితను జైల్లో పెడతారని బీజేపీకి భయపడి కమ్యూనిస్టులతో అవగాహనకు రాలేదని చెప్పారు. బీజేపీ కవితను జైల్లో పెట్టిందని, దీంతో కేటీఆర్ నోరు మూగబోయిందని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ఇండియా కూటమిలోకి రావాలని ఆహ్వానించారు. తమ పార్టీకి బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్‌తో, కేరళలో కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ భవిష్యత్ కోసం ఇండియా కూటమిలో చేరి బీజేపీని ఓడించడానికి పని చేస్తున్నామన్నారు.

కేరళకు వెళ్లి సీపీఐ(ఎం)ను తిట్టే అంత సమయం రేవంత్‌కు ఉందని, బీజేపీపై పోరాడడానికి మాత్రం లేదని రాఘవులు విమర్శించారు. పేనుకు పెత్తనం ఇస్తే తలంతా కొరిగినట్టు కేరళకు వెళ్లి ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌ను విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కక్షగట్టి కేసు నమోదు చేసినంత మాత్రాన విజయన్ దోషి కాదని తెలిపారు. పొట్ట చించుకుంటే పేగులు కాళ్ల మీద పడ్డట్టు రేవంత్ వ్యవహారం ఉందని విమర్శించారు. ఓటుకు నోటు సంగతి ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధినేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ రూ.1500 కోట్లకు సంబంధించి అపరాధ రుసుం కట్టాలని కేసు నమోదైందని, దాన్ని తాము తీవ్రంగా ఖండించామని గుర్తు చేశారు. కానీ, రేవంత్‌రెడ్డి నోరు ఉందని పారేసుకోవద్దని హితవు పలికారు. రాజకీయాలు ఉండాలి కానీ ప్రతిదానినీ ఒకే విధంగా చూడొద్దన్నారు. కేసీఆర్ అహంకారంతోటే ఓడిపోయారని రేవంత్ రెడ్డి ఆ బాటలో నడవద్దని సూచించారు. బీజేపీ, కమ్యూనిస్టులు కలిసి కేరళలో పనిచేస్తున్నారని రేవంత్ పేర్కొనడం అతని అవివేకమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఎంపీ సీట్లు రాకుండా అడ్డుకునేందుకు తాము సహాయం చేస్తామని, ఆ రకంగా కలిసి రావాలని కోరారు. ప్రతి ఓటు విలువైనదని వివరించారు. భువనగిరిలో ప్రజాతంత్ర శక్తులు, లౌకిక శక్తులు సీపీఐ(ఎం)కు ఓటు వేయాలని కోరారు. సీపీఐ(ఎం)కు వేసే ప్రతీ ఓటు దేశ అభివృద్ధికి వేసినట్టేనని చెప్పారు.

జహంగీర్ గెలుపు అవసరం : వీరయ్య, చెరుపల్లి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న జహంగీర్ మూసీ కాలుష్యంపై నెలరోజుల పాటు పోరాటం చేశారన్నారు. గంగా ప్రక్షాళనకు కోట్లు ఖర్చు పెట్టే కేంద్రం మూసీ కాలుష్యంపై డబ్బులు ఖర్చు చేయడం లేదన్నారు. మూసీనది సమస్యపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే జహంగీర్‌ను గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో గొంతెత్తి అడుగుతారని చెప్పారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో జహంగీర్‌ను గెలిపించి ఎర్రజెండా చరిత్రకు పూర్వ వైభవం తీసుకురావాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, మల్లు లక్ష్మి, తీగల సాగర్, జాన్‌వెస్లీ, అబ్బాస్, డిజి.నర్సింహారావు, పోతినేని సుదర్శన్, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, బుర్రి ప్రసాద్, వెంకట్రాములు, అరుణ జ్యోతి, విజయలక్ష్మి, జగదీష్, ఎస్.రమ, వెంకట్ పాల్గొన్నారు.

రేవంత్ అనవసర ఆరోపణలు చేయొద్దు : తమ్మినేని

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీ ఫాసిస్టు విధానాలు, ఆర్ఎస్ఎస్ భావజాలం దేశాన్ని భ్రష్టు పట్టించేలా ఉన్నాయన్నారు. దేశాన్ని హిందూ దేశంగా, రాజ్యంగా మారుస్తామని బీజేపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారని, ఇది ప్రమాదకరమని అన్నారు. హిందూ రాజ్యమంటే అధికంగా ఉండే హిందువులకు మేలు చేయడం కాదన్నారు. అలా అనుకుంటే పొరపాటేనన్నారు. అగ్రకులాల్లో ఉన్న కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టడమేనన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తీసేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడమే బీజేపీ లక్ష్యమని చెప్పారు. అగ్రకుల భావజాలం, కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతారని, పేదలు మరింత పేదలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం అంటే ఒక ఫ్యూడల్ ధర్మమని, అది మనువాదం నుంచి వచ్చిందని చెప్పారు. రాజ్యాంగానికి కూడా పెను ప్రమాదం పొంచి ఉందని, ప్రజలు గ్రహించాలని అన్నారు. బీజేపీని ఓడించడానికి అందరితో కలిసి వెళ్తామని చెప్పారు. ఇండియా కూటమి పార్టీలను కాంగ్రెస్ సంప్రదించడం లేదన్నారు. కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించాలని సూచించారు. ఈనెల 21వ తేదీన కాంగ్రెస్ నాయకత్వం సీపీఐ(ఎం)ను కలవనున్నట్టు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఏదేమైనా రాష్ట్రంలో తాము భువనగిరి స్థానం నుంచి పోటీలో ఉండటం ఖాయమన్నారు. కాంగ్రెస్ మొండి వైఖరి విడనాడాలన్నారు. అనవసర ఆరోపణలు చేయొద్దని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. మా దేహం ముక్కలైనా సరే దేశాన్ని ముక్కలు కానివ్వబోమని, ఈ దేశంలో బీజేపీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్పష్టమైన లక్ష్యంతో సీపీఐ(ఎం) ముందుకు పోతుందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశానికి తిరుగు లేదని చెప్పారు.. కానీ ఆ తర్వాత కాంగ్రెస్ వచ్చాక.. వైఎస్ రాజశేఖరరెడ్డి ఇక కాంగ్రెస్‌కు తిరుగు లేదన్నారు.. బీఆర్ఎస్ కూడా అదే చెప్పింది. కానీ ప్రస్తుతం ఆ పార్టీల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చని.. అర్థం చేసుకోకపోతే కమ్యూనిస్టులం ఆత్మవిశ్వాసం నిలబెట్టుకోలేమన్నారు. భువనగిరి తెలంగాణ సాయుధ పోరాట నాయకత్వం వహించిన ఉద్యమాల గడ్డ అని తెలిపారు. అలాంటి ఉద్యమ గడ్డలో సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక ప్రజా సమస్యలపై 35 ఏండ్లుగా పోరాడుతున్న వ్యక్తి ఎండీ జహంగీర్ అని తెలిపారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.


సీడీ ఆవిష్కరిస్తున్న తమ్మినేని, రాఘవులు

ఎరుపెక్కిన భువనగిరి..



సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ నామినేషన్ దాఖలు సందర్భంగా భువనగిరి నగరం ఎరుపెక్కింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని భువనగిరి, మునుగోడు, ఆలేరు, నకిరేకల్, తుంగతుర్తి, జనగామ, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సీపీఐ(ఎం) కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎర్రజెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. నినాదాలతో భువనగిరి పట్టణం మార్మోగింది. ర్యాలీ అగ్రభాగాన రాఘవులుతోపాటు అభ్యర్థి జహంగీర్, సీపీఐ(ఎం) రాష్ట్ర నేతలు నడుస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఓపెన్‌టాప్ జీప్‌లో కార్యకర్తలకు అభివాదం చేశారు. కళాకారులు కోలాటం వేసుకుంటూ ముందుకు నడిచారు. పీఎన్ఎం కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి.

నవచిత్రం

లక్ష్మీదేవీ కటాక్షం లభించిందా?



మహతి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై యు. శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కే.పురుషోత్తం రెడ్డి నిర్మించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. ఈ చిత్ర ట్రైలర్ విడుదలై, విశేష ఆదరణ పొందుతోంది.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎలక్షన్స్ డేట్‌నే సినిమాలో ఎలక్షన్ డేట్ లాగా అనౌన్స్ చేశారు. డైలాగ్ కింగ్ సాయి కుమార్ తన పాతికేళ్ళ పొలిటికల్ కెరీర్‌ను నిలబెట్టుకోవడం కోసం ఈ ఎలక్షన్‌ను చాలా ప్రస్టేజ్‌గా తీసుకుంటాడు. మరో పక్క పోలీస్ ఆఫీసర్ ఎలాగైనా ఈ ఎలక్షన్‌లో ఒక్క రూపాయి కూడా పంచకుండా చూసుకుంటూ ఉంటాడు. ఇప్పుడు ఆ పోలీస్ బందోబస్త్ నుండి, తక్కువ టైంలో 100 కోట్లని, రెండు లక్షల మంది ఓటర్లకు, ఓటుకు 5000 చొప్పున ఎలా పంచుతారు అనే నేపథ్యంలో సినిమా కథ ఉండబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెప్పింది. కామెడీతో పాటు హుకింగ్ డ్రామా కూడా ఉంది ఈ ట్రైలర్‌లో ఉండటం విశేషం.

ఒక పక్క సాయి కుమార్‌కి ఎలక్షన్ ఫండ్ రావడం ఒక ఛాలెంజ్ అయితే, ఇంకో పక్క లాస్ట్ మినిట్‌లో వచ్చిన ఫండ్ ఎలా పంచాలి అనేది ఇంకో ఛాలెంజ్, ఈ తరుణంలో చిరాకు పడి అన్ని దారులు మూసుకున్న సాయి కుమార్ లక్ష్మీ దేవిని ఎలక్షన్ ఫండ్ కటాక్షించమని డిమాండ్ చేస్తారు. లక్ష్మీ దేవి ప్రత్యక్షమవుతుంది. ఇలాంటి విభిన్నమైన కథాంశాలతో సాగే ఈ 'లక్ష్మీ కటాక్షం' త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నారు.

వినయ్‌జి, అరుణ్, దీప్తి వర్మ, చరిస్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయి కిరణ్ ఏడిద, ఆమని తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన, డైరెక్టర్: సూర్య, మ్యూజిక్: అభిషేక్ రుఫుస్, డి ఓ పి: నని ఐనవెల్లి, ఎడిటర్: ప్రదీప్ జే.



సునీత మారస్యార్, టోని కిక్, చిన్ని కృష్ణ

సినిమాగా అల్లా.. హే అల్లా

టోని కిక్, సునీత మారస్యార్ హీరో, హీరోయిన్లుగా ఎ3 లేబుల్స్ బ్యానర్‌పై కొత్త చిత్రం శుక్రవారం ఫిల్మ్ నగర్ సన్నిధానంలో లాంఛనంగా ప్రారంభమైంది. బుల్లెట్ బండి లక్ష్మణ్ దర్శకత్వంలో గిరీష్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రచయిత చిన్నికృష్ణ క్లాప్ కొట్టగా, ఏబి ఫ్లెక్స్ ప్రదీప్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రైటర్ వెలిగొండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్మాత గిరీష్ కుమార్ మాట్లాడుతూ, "నాది కర్నాటక. రామ్, లక్ష్మణ్ చేసిన 'అల్లా హే అల్లా..' పాట వినగానే నచ్చింది. అందులో సోల్ బాగా కనెక్ట్ అయ్యింది. ఎంటైర్ టీమ్‌ను కలిసి మాట్లాడినప్పుడు వారు చెప్పిన విషయాలు ఎంతో నచ్చి సినిమా చేయాలనుకున్నాను. ఏ 3 లేబుల్స్ బ్యానర్ పై తొలి సినిమా చేస్తున్నాను' అని తెలిపారు.

హీరో టోని కిక్, హీరోయిన్ సునీత మారస్యార్ మాట్లాడుతూ, 'మా డైరెక్టర్ బుల్లెట్ బండి లక్ష్మణ్‌కి ధన్యవాదాలు. ఆయన చేసిన 'అల్లా హే అల్లా..' కాన్సెప్ట్‌తోనే ఇప్పుడు సినిమాను స్టార్ట్ చేశాం. మంచి కథ కుదిరింది. మమ్మల్ని నమ్మి ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని అన్నారు.

డైరెక్టర్ బుల్లెట్ బండి లక్ష్మణ్ మాట్లాడుతూ, 'సినీ ఇండస్ట్రీలోకి ఎప్పుడో వచ్చి ఇబ్బందులు పడి వెనక్కి వెళ్లిపోయాం. అయితే జానపద పాటలు ద్వారా ప్రేక్షకుల ఆదరణ పొందాం. నాలోని సినిమా కలను గుర్తించిన మా నిర్మాత గిరీష్ కుమార్ సినిమా చేయటానికి ముందుకు వచ్చారు. ఆయన రుణ తీర్చుకోలేనిది. ఇది వరకు నాలుగు నిమిషాల్లోని పాటలో ఓ కథను చెప్పే ప్రయత్నం చేశాను. ఇప్పుడు మా నిర్మాత రెండు గంటల సినిమా చేయమని అడిగారు. మా ప్రతీ పాట, మాట థియేటర్స్‌కి ఆడియెన్స్‌ను రప్పించేలా, వారి మనసు మెప్పించేలా ఉంటాయి. నన్ను యూ ట్యూబ్‌లో ఆదరించినట్లే సినిమాలోనూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

రుస్లాన్ హిట్ ఖాయం

బాలీవుడ్ హీరో ఆయుష్ శర్మ నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రుస్లాన్'. కరణ్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. సుశ్రీ మిశ్రా హీరోయిన్. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై నిర్మాత కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్‌ని నిర్వహించింది.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,'ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అవుతుందో చెప్పలేకపోతున్నాను. అంత అద్భుతంగా ఉంటుంది. ఆయుష్ ఇందులో ఎక్స్‌ట్రార్డినరీగా చేశాడు. రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. జగపతిబాబు ప్రజెన్స్ సినిమాని మరింత ప్రత్యేకంగా నిలుపుతుంది' అని తెలిపారు. 'ఈ సినిమా నాకు చాలా స్పెషల్. ఇందులో నేను చాలా డిఫరెంట్ డైమెన్షన్ ఉన్న పాత్ర చేస్తున్నాను. ఇది నా రెండో హిందీ చిత్రం' అని జగపతి బాబు చెప్పారు. హీరో ఆయుష్ శర్మ మాట్లాడుతూ,'ఈ సినిమా తప్పకుండా మా అందరికీ గొప్ప విజయాన్ని చేకూర్చుతుందని నమ్ముతున్నాను' అని చెప్పారు. 'హిందీలో ఇది మా మొదటి సినిమా. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. ఎమోషన్, యాక్షన్, మంచి డైలాగ్స్, అందమైన విజువల్స్‌తో గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని నిర్మాత కెకె రాధామోహన్ తెలిపారు.


జగపతిబాబు, ఆయుష్ శర్మ, సుశ్రీ మిశ్రా, కె.కె.రాధామోహన్

ఆటలు

చెన్నైకి లక్నో చెక్

- సూపర్‌కింగ్స్‌పై సూపర్‌జెయింట్స్ గెలుపు
- చెన్నై 176/6, లక్నో 180/2



నవతెలంగాణ-లక్నో

చెన్నై సూపర్‌కింగ్స్ జోరుకు లక్నో సూపర్‌జెయింట్స్ బ్రేక్ వేసింది. 177 పరుగుల లక్ష్యాన్ని లక్నో సూపర్‌జెయింట్స్ మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. 8 వికెట్ల తేడాతో సూపర్‌కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. ఛేదనలో ఓపెనర్లు కెఎల్ రాహుల్ (82, 53 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (54, 43 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కగా.. నికోలస్ పూరన్ (23 నాటౌట్, 12 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), మార్కస్ స్టోయినిస్ (8 నాటౌట్) రాణించారు. 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ సీజన్లో నాల్గో విజయం నమోదు చేసింది. అంతకుముందు, రవీంద్ర జడేజా (57 నాటౌట్, 40 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచ, ఎం.ఎస్ ధోని (28 నాటౌట్, 9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది.

సొంతగడ్డపై టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సూపర్‌కింగ్స్ స్టార్ ఓపెనర్ రచిన్ రవీంద్ర (0)ను సున్నా పరుగులకే అవుట్ చేసిన మోషిన్ ఖాన్.. లక్నో సూపర్‌జెయింట్స్‌కు అదిరే ఆరంభం అందించాడు. మరో ఓపెనర్ అజింక్య రహానె (36, 24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) పవర్‌ప్లేలో రాణించాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (17, 13 బంతుల్లో 1 ఫోర్)తో కలిసి ఇన్నింగ్స్‌కు ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. కానీ పవర్‌ప్లే ముగిసేలోపే రుతురాజ్ గైక్వాడ్ నిష్క్రమించగా.. పది ఓవర్ల లోపే రహానె సైతం డగౌట్ బాట పట్టాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న శివం దూబె (3), సమీర్ రిజ్వీ (1) అనూహ్యంగా విఫలమయ్యారు. సూపర్‌జెయింట్స్ స్పిన్నర్ కృనాల్ పాండ్య మాయజాలంతో పరుగుల కట్టడి చేశాడు. ఈ దశలో రవీంద్ర జడేజా (57 నాటౌట్) ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. మోయిన్ అలీ (30, 20 బంతుల్లో 3 సిక్స్‌లు)తో కలిసి మంచి స్కోరు దిశగా నడిపించాడు. సూపర్‌జెయింట్స్ బౌలర్ల మెరుపులతో చెన్నై సూపర్‌కింగ్స్ స్వల్ప స్కోరుకే పరిమితం అయ్యేలా కనిపించింది. కానీ ఆఖర్లో క్రీజులోకి వచ్చిన ఎం.ఎస్ ధోని (28 నాటౌట్) సూపర్‌కింగ్స్‌కు డిఫెండ్ చేసుకోగల స్కోరు అందించాడు. 9 బంతుల్లోనే మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు సంధించిన మహేంద్రుడు.. సూపర్‌జెయింట్స్ బౌలర్లను డెత్ ఓవర్లలో దంచికొట్టాడు. ధోని మెరుపులతో చివరి నాలుగు ఓవర్లలో సూపర్‌కింగ్స్ 63 పరుగులు పిండుకుంది.

సన్‌రైజర్స్‌కు ఎదురుందా?

- నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో హైదరాబాద్ ఢీ
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-న్యూఢిల్లీ

సన్‌రైజర్స్ హైదరాబాద్ పేరు వినగానే అందరికీ మంచి బౌలింగ్ జట్టు గుర్తొచ్చేది. 2024 ఐపీఎల్ సీజన్లో పాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ బ్రాండ్‌ను పూర్తిగా చెరిపేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ అంటే అరాచక బ్యాటింగ్‌కు చిరునామాగా మారింది. ఉప్పల్‌లో ముంబయి ఇండియన్స్‌పై 277, చిన్నస్వామిలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై 287 పరుగులతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల రికార్డును సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఫిరోజ్ షా కోట్ల స్టేడియం వేదికగా రిషబ్ పంత్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.



సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో విజయంపై కన్నేసి నేడు బరిలోకి దిగుతుంది. ఈ సీజన్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి భిన్నమైన వ్యూహంతో బరిలోకి దిగుతుంది. బ్యాట్‌తో, బంతితో పవర్‌ప్లేలో ఎదురులేని ఆధిపత్యం సాధించటమే సన్‌రైజర్స్ తొలి లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ ప్రణాళికను అమలు చేసేందుకు సన్‌రైజర్స్ ఎందుకైనా వెనుకాడటం లేదు. వికెట్లు పడినా ఎదురుదాడి మంత్ర వీడటం లేదు. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, ఎడెన్ మార్క్రామ్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డిలకు తోడుగా ఇప్పుడు అబ్దుల్ సమద్ సైతం ఫామ్‌లోకి వచ్చాడు. సన్‌రైజర్స్ బ్యాటర్లు అందరూ స్ట్రయిక్‌రేట్ 200తో పరుగులు సాధిస్తున్నారు. దీంతో హైదరాబాద్ అలవోకగా భారీ స్కోర్లు నమోదు చేస్తుంది. కెప్టెన్ పాట్ కమిన్స్‌కు లెఫ్ట్ హ్యాండర్లపై మంచి రికార్డుంది. నేడు డెవిడ్ వార్నర్, రిషబ్ పంత్‌లతో కమిన్స్ పోరు ఆసక్తికరంగా మారనుంది. ఢిల్లీ క్యాపిటల్స్ శిబిరం సైతం గత రెండు మ్యాచుల్లో విజయాలతో ఊపుమీదుంది. పృథ్వీ షా, రిషబ్ పంత్‌లకు తోడు జేక్ ఫ్రేసర్, అభిషేక్ పోరెల్ దంచికొడుతున్నారు. బంతితో ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్‌లు అంచనాలు అందుకుంటున్నారు. హాట్‌ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

వస్త్ర ఎగుమతులు తిరోగమనం

- భారత్‌లో రెండో ఏడాదిలోనూ పతనం
- కోవిడ్ నాటి కంటే అధ్వాన్నం
- ఎక్స్‌పోర్టర్స్ ఆందోళన



న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో భారత వస్త్ర ఉత్పత్తులు వెలవెల పోతున్నాయి. వరుసగా రెండో ఏడాదిలోనూ టెక్స్‌టైల్ ఎగుమతులకు డిమాండ్ తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ వస్త్ర ఎగుమతులు తిరోగమనాన్ని చవి చూశాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తలు వస్త్ర రంగాన్ని దెబ్బతీస్తున్నాయి. మరోవైపు ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడేలా భారత్ ఈ రంగానికి మద్దతును ఇవ్వడం లేదనేది ఆ రంగం పారిశ్రామిక వర్గాల ప్రధాన విమర్శ. గడిచిన 2023-24లో టెక్స్‌టైల్ ఎగుమతులు 34.4 బిలియన్ డాలర్ల (రూ.2.86 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే ఒక్క బిలియన్ డాలర్లు (రూ.83వేల కోట్లు)లేదా 3 శాతం పతనాన్ని చవి చూశాయి. ముఖ్యంగా 2021-22లోని 41 బిలియన్ డాలర్ల (రూ.3.41 లక్షల కోట్లు)ఎగుమతులతో పోల్చితే గతేడాది 16.3 శాతం క్షీణత చోటు చేసుకుందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనంలో వెల్లడించింది.

టెక్స్‌టైల్ రంగంలోకి పత్తినూలు, బట్టలు, తయారు చేసిన వస్తువులు, చేనేత ఉత్పత్తులు వస్తాయి. 2023-24లో పత్తి నూలు ఎగుమతులు మాత్రం 740 మిలియన్ డాలర్లకు పెరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన నిర్యాట్ పోర్టల్ డేటా వెల్లడించింది. మొత్తం వస్త్ర ఎగుమతుల్లో ఉత్తర అమెరికాకు 11 బిలియన్ డాలర్లు, ఆ తర్వాత యూరప్‌కు 10 బిలియన్ల, పశ్చిమాసియా, నార్త్ ఆఫ్రికాకుకు కలిపి 4 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి.

"మొత్తం పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. ముఖ్యంగా ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో నెలకొన్న మాంద్యంతో వినియోగదారుల విశ్వాసం తగ్గింది. ఎర్ర సముద్ర సంక్షోభం కారణంగా సముద్ర సరుకు రవాణా దాదాపు 100 శాతం పెరిగింది. ఎయిర్ కార్గో ద్వారా సరుకులను రవాణా చేయాలనే డిమాండ్ కారణంగా విమాన సరుకులు 200 శాతం వరకు పెరిగాయి. కాగా.. గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ ఎగుమతుల తగ్గుదల చోటు చేసుకోవడాన్ని సరిదిద్దుకోవాల్సి ఉంది." అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ) వైస్ ప్రెసిడెంట్ ఇస్రార్ అహ్మద్ అన్నారు.

మొత్తం వస్త్ర ఎగుమతుల్లో 42 శాతం వాటా కలిగిన రెడీమేడ్ వస్త్రాల విభాగంలో 10 శాతం పతనం చోటు చేసుకుంది. వస్త్ర ఎగుమతుల్లో కీలక వాటా కలిగిన తిరుపూర్ పరిశ్రమలు కరోనా నాటి కంటే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తిరుపూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ రాజా ఎం షణ్ముగం అన్నారు. యూరప్‌లో విలువ ఆధారిత వస్త్రాలకు డిమాండ్ తగ్గడం ఈ క్షీణతకు కారణమన్నారు. ఉత్పత్తి, ఎగుమతి సామర్థ్యాలను పెంచడానికి ప్రభుత్వ మద్దతు అవసరమన్నారు. టెక్స్‌టైల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ పథకాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ బకాయిల చెల్లింపుల కోసం ఆరు నెలల పాటు మారటోరియం విధించాలని కోరారు.

విప్రోలో తగ్గిన 24,516 మంది ఉద్యోగులు



బెంగళూరు : ఐటీ కంపెనీల్లో కొత్త ఉద్యోగ నియామకాలు తగ్గిపోగా.. మరోవైపు ఉన్న వారిని వేలల్లోనే తీసేసినట్లు తెలుస్తోంది. దేశంలోనే నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రోలో ఏడాదిలో 9.5 శాతం ఉద్యోగులు తగ్గారు. ఆర్థిక సంవత్సరం 2023-24లో ఆ సంస్థలో నికరంగా 24,516 మంది ఉద్యోగులు తగ్గిపోయారు. దీంతో 2024 మార్చి ముగింపు నాటికి 2,58,570 నుంచి 2,34,054 మంది ఉద్యోగులకు తగ్గారు. ఇదే విషయాన్ని ఆ కంపెనీ ఆర్థిక ఫలితాల సందర్భంగా వెల్లడించింది. 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో విప్రో నికర లాభాలు 8 శాతం తగ్గి రూ.2,835 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3,074.5 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.23,190 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో రూ.22,208 కోట్లకు తగ్గింది.

స్టాక్ మార్కెట్లకు ఉపశమనం

ముంబయి : వరుసగా నాలుగు రోజులు నష్టాల్లో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం స్వల్ప ఉపశమనం లభించింది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఆందోళన వాతావరణం వల్ల గత కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కాగా.. వారంతం సెషన్‌లో కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 599 పాయింట్లు పెరిగి 73,088 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 151 పాయింట్లు రాణించి 22,147 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, మారుతీ సుజుకి సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి.

మహిళల కోసం 'హెల్త్ పవర్' బీమా ప్లాన్

- ఫ్యూచర్ జనరాలి ఆవిష్కరణ

న్యూఢిల్లీ : వివిధ దశలలో మహిళల వైద్య అవసరాలను తీర్చడానికి ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'హెల్త్ పవర్' పేరుతో కొత్త పాలసీని ఆవిష్కరించినట్లు తెలిపింది. క్యాన్సర్, యుక్తవయస్సు, మెనోపాజ్ సంబంధిత రుగ్మతలు తదితర సమగ్ర ఆరోగ్య బీమా ప్లాన్ అని పేర్కొంది. అండాల నిల్వ, మూలకణాల నిల్వ, నవజాత శిశువు లోపానికి లంప్సమ్ ప్రయోజనం, నర్సింగ్ కేర్, సీనియర్ కేర్, ఎముకలను బలోపేతం చేసే ఇంజెక్షన్లు, జాయింట్ ఇంజెక్షన్లు, గర్భధారణ కవర్‌తో సహా అనేక మెరుగుపర్చబడిన మెటర్నిటీ ప్రయోజనాలు ఇందులో ఉన్నాయని ఫ్యూచర్ జెనరాలి ఇండియా ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ అనూప్ రౌ పేర్కొన్నారు.

హ్యుందాయ్ 'గ్రామీణ్ మహోత్సవ్' క్యాంపెయిన్

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా కొత్తగా 'గ్రామీణ్ మహోత్సవ్' క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. గ్రామీణ మహోత్సవ్‌లో భాగంగా 16 ప్రదేశాల్లో తమ ఉత్పత్తి ప్రదర్శనలు, నుక్కడ్ నాటకం, లైవ్ మ్యూజిక్, జానపద నృత్యం, ప్రాంతీయ ప్రతిభా ప్రదర్శనలను చేపట్టనున్నట్లు ఆ కంపెనీ సిఒఒ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు. గతేడాది తాము గ్రామీణ ప్రాంతాల్లో 1.15 లక్షల యూనిట్ల అమ్మకాలు చేశామన్నారు.

ఓటుతోనే దేశం పటిష్టం : బంగూర్ సిమెంట్

హైదరాబాద్ : పారిశ్రామిక సంస్థలు సాధారణంగా ఓటు హక్కు వినియోగంపై పెద్దగా పట్టించుకోవు. కానీ బంగూరు సిమెంట్ ప్రజలను ఓటు వేయడానికి ప్రోత్సహిస్తూ వినూత్నమైన మల్టీమీడియా ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. 'ఓట్ సాలిడ్.. దేశ సాలిడ్' అనే సందేశంతో దీన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. తన వెబ్‌సైట్‌లో ఓట్ కా వచన్ బటన్ ద్వారా ఓటు వేయాలని చేసిన ప్రతిజ్ఞలకు.. వారి తరుపున తాము సామాజిక కార్యక్రమాలకు ప్రతీ ప్రతిజ్ఞకు ఒక్క కిలో సిమెంట్‌ను విరాళంగా ఇవ్వనున్నామని పేర్కొంది.

రెడ్మీ నోట్ 13 5జి సీరిస్‌కు హైపర్‌ఓఎస్



న్యూఢిల్లీ : షావోమి తన రెడ్మీ నోట్ 13 5జి సిరీస్ స్మార్ట్‌ఫోన్లకు ఆండ్రాయిడ్ 14బేస్డ్ హైపర్ ఓఎస్ ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. దీన్ని రెడ్మీ నోట్ 13, రెడ్మీ నోట్ 13 ప్రో, రెడ్మీ నోట్ 13 ప్రో ప్లస్ మోడళ్లను కల్పిస్తున్నట్లు పేర్కొంది. దీంతో కొత్త లాక్ స్క్రీన్ ఆప్షన్, మల్టీ విండో సపోర్ట్, ఇంటరాక్టివ్ నోటిఫికేషన్ ఇతర పలు కొత్త ఫీచర్లు పొందవచ్చని తెలిపింది.



బీజేపీని గెలిపిస్తే ఆదివాసీల ఉనికికే ప్రమాదం

ఎన్‌ఓపీ కాదు... నో డ్యూ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి

బీజేపీ ఎంపీ అభ్యర్థికి వి శ్రీనివాసరావు సవాల్

కోలాహలంగా అరకు సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి అప్పలనర్స నామినేషన్

విజయనగరం : ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ఆదివాసీల ఉనికికే అత్యంత ప్రమాదకరమని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బ్యాంకులకు భారీ బకాయిల విషయంలో నో అబ్జక్షన్ సర్టిఫికెట్ చూపిస్తున్న అరకు బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత... నో డ్యూ సర్టిఫికెట్ చూపాలని సవాల్ చేశారు. గిరిజనులను మోసగిస్తున్న అరకు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని, ఆ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స... పార్వతీపురం కలెక్టరేట్‌లో శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం సీపీఐ(ఎం), సీపీఐ, న్యూడెమోక్రసీ, లిబరేషన్, కాంగ్రెస్, ఆప్ తదితర ఇండియా వేదిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాత బస్టాండ్ జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ దేశ సంపదను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. దీంతో, గిరిజనులకు తీరని నష్టం వాటిల్లుతోందని తెలిపారు. అధికారంలో ఉన్నంతకాలం బీజేపీ ప్రవేశపెట్టిన ప్రజా, గిరిజన వ్యతిరేక చట్టాలకు వంతపాడడం తప్ప, వైసిపి చేసిందేమీ లేదన్నారు. ఈ నేపథ్యంలో వైసిపికి ఓటేసినా బీజేపీ ని గెలిపించినట్టేనని వివరించారు.

మోడీ తిరిగి అధికారంలోకొస్తే రాష్ట్రం ముఖ్యంగా అల్లూరి, మన్యం జిల్లాలు ధ్వంసమవుతాయన్నారు. గిరిజన హక్కులన్నీ హారతి కర్పూరంలా కరిగిపోతాయని తెలిపారు. భారత రాజ్యాంగానికి బీజేపీ ఇప్పటికే తూట్లు పొడిచిందన్నారు. అటువంటి పార్టీతో రాష్ట్రంలోని టిడిపి, జనసేన పొత్తుపెట్టుకోవడం, వైసిపి తొత్తుగా వ్యవహరించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో బిజెపి, వైసిపి తరుపున ఈ ప్రాంతంలో గెలిచిన ఎంపీలు పీసా, 5వ షెడ్యూల్, 1/70 వంటి గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ బిజెపికి సహకరించారన్నారు. గిరిజన సంపద దోచుకున్నారని విమర్శించారు. బాక్సైట్ తదితర గనులను లూటీ చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించేందుకు డబ్బులు లేవని చెప్తున్న ప్రభుత్వం... తూర్పుగోదావరి నుంచి అరకు మీదుగా పార్వతీపురం వరకు ఏజెన్సీలో అదానీ ప్రయోజనాల కోసం రోడ్లను వేస్తోందని వివరించారు.

ఇండియా వేదికను గెలిపించుకోవడం చారిత్రక అవసరమన్నారు. డబ్బులు పంచి ఓట్లు కొనుక్కున్నవారు తిరిగి ప్రజలను దోచుకుంటారని, ఊళ్లకు ఊళ్లే దోచుకునే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇండియా వేదిక బలపర్చిన సీపీఐ(ఎం) అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స నిత్యం ప్రజాసమస్యలు, ముఖ్యగా గిరిజన సమస్యలపై పోరాటం చేశారని, ప్రజల కోసం ఎన్నో నిర్బంధాలు, కేసులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. గిరిజనుల రిజర్వేషన్లు, స్పెషల్ డిఎస్‌సి కోసం జరిగిన పోరాటంలో కీలకపాత్ర పోషించారని, ఆయనను గెలిపించుకోవాలని శ్రీనివాసరావు అన్నారు. భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో దేశసంపదను, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో గనులు, అటవీ సంపదను లూటీ చేసిందని విమర్శించారు. అనేక హక్కులను కాలరాసిందన్నారు. ముఖ్యంగా రిజర్వేషన్ వెసులుబాటును కాలరాస్తూ జిఓ నెంబర్ 3ను రద్దు చేసిందని గుర్తుచేశారు.

దీనిపై వైసిపి ప్రభుత్వం సవాలు చేస్తామని చెప్పినా, ఆచరణలో ముందుకు సాగలేదని విమర్శించారు. ఇటీవల ఐటిడిఎ పరిధిలో జరిగిన రిక్రూట్‌మెంట్లలో రిజర్వేషన్ అమలు కాకపోవడంతో గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. కమ్యూనిస్టుల చొరవతో పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం తీసుకొస్తే వాటిని ఉల్లంఘించి బాక్సైట్ ఇతర గనులను కొల్లగొట్టేందుకు అటవీ పరిరక్షణ సవరణ చట్టాన్ని దొంగచాటుగా తీసుకొచ్చిందన్నారు. అందులో భాగంగానే ఏజెన్సీలో పెద్దపెద్ద రహదారులు వేస్తోందని వివరించారు. 5వ షెడ్యూల్ నిబంధనలు, గ్రామ సభల అనుమతి వంటి ప్రాథమిక హక్కులను కూడా కాలరాస్తోందన్నారు. మరోవైపు ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడంతో సబ్ ప్లాన్ నిధులు లేకుండా పోయాయని తెలిపారు. ప్రత్యేక గ్రాంట్ ఇన్ ఎయిడ్ రద్దయిపోయిందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనకు ఎర్ర జెండా ఎనలేని పోరాటాలు చేసిందని, వాటిని మరింత ముందుకు తీసుకుపోవడానికి అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

చంద్రబాబు తరపున కుప్పంలో భువనేశ్వరి నామినేషన్



తిరుపతి : చిత్తూరు జిల్లా కుప్పంలో టిడిపి కూటమి అభ్యర్థి నారా చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం సాయంత్రం కుప్పం చేరుకున్న ఆమె పివిఎస్ అతిథి గృహంలో బస చేశారు. శుక్రవారం నామినేషన్ పత్రాలను తీసుకుని ముందుగా లక్ష్మీపురం వరదరాజస్వామి దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మసీదుకు వెళ్లారు. మతపెద్దలు దువ్వ నిర్వహించారు. ఆ తర్వాత చర్చిలో భువనేశ్వరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వరదరాజస్వామి దేవాలయం నుంచి బయటకు వచ్చిన ఆమెకు పలువురు వికలాంగులు విరాళం అందజేశారు. వైసిపి హయాంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, వికలాంగులకు గుర్తింపు లేకుండా పోయిందని, అందుకే తమవంతు బాధ్యతగా చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నామని అన్నారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో భువనేశ్వరి ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎస్ మునిరత్నంలతో కలిసి పట్టణ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని చంద్రబాబు తరపున నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొద్దాం : భువనేశ్వరి

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని తీసుకొద్దామని భువనేశ్వరి అన్నారు. ర్యాలీలో ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రింబవళ్లూ ఎంతో కష్టపడ్డారని, పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది పెట్టుబడిదారులు ముంచుకొచ్చారని వివరించారు. వైసిపి పాలనలో పెట్టుబడులు రాకపోగా వేధింపుల వల్ల ఉన్న పరిశ్రమలు తరలిపోతాయన్నారు. వైసిపి నేతల దోపిడీకి అడ్డుపడిన టిడిపి కార్యకర్తలను దారుణంగా చంపేశారని ఆరోపించారు. వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. అన్ని ప్రాంతాల ప్రజలూ వైసిపి పాలనలో నలిగిపోయారని,. జగన్ పాలన నుంచి విముక్తి కోరుతున్నారని అన్నారు. నామినేషన్‌కు బయలుదేరినప్పుడు యువత, నిరుద్యోగులు, మహిళలు, వికలాంగులు, రైతులు వచ్చి నామినేషన్ ఫీజు ఇచ్చారని తెలిపారు.

టాప్ర ప్రతిపాదనలకు పీఆర్సీ చైర్మెన్ సానుకూలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) చైర్మెన్, సిబ్బందితో శుక్రవారం హైదరాబాద్‌లో పెన్షనర్ల సమస్యలపై తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) చర్చలు జరిపింది. ఈ సమావేశంలో టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో పెన్షన్ సవరణ చేయాలని సూచించారు. 2023, జులై ఒకటి నుంచి అమలు చేయాలని కోరారు. మానిటరింగ్ బెనిఫిట్ కూడా అదేరోజు నుంచి వర్తింపచేయాలని తెలిపారు. కాంట్రిబ్యూషన్ లేకుండానే నగదు రహిత వైద్యం అందేలా ఆరోగ్య పథకం ఉండాలని సూచించారు. గత వేతన సవరణ కమిషన్ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఎయిడెడ్, ఇతర పెన్షనర్లకూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని తెలిపారు. కనీస పెన్షన్ రూ.30 వేలు, మెడికల్ అలవెన్స్ రూ.మూడు వేలు, అంత్యక్రియల ఖర్చు రూ.50 వేలు చెల్లించాలని కోరారు. రూ.398 వేతనంతో పనిచేసిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలనీ, కమ్యూటేషన్ 50 శాతం ఇవ్వాలనీ, గ్రాట్యూటీ రూ.30 లక్షల ఉండాలని సూచించారు. ఇంటి అద్దె, తీర్థయాత్రలకు వెళ్లేందుకు అలవెన్స్ ఇవ్వాలనీ, 65 ఏండ్ల వయస్సు వారికి అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ చెల్లించాలని కోరారు. పెన్షనర్ల కోసం డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను పునరుద్ధరించాలనీ, అందులో పెన్షనర్ సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. పీఆర్సీ చైర్మెన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో...

- అరబిందో శరత్ చంద్రారెడ్డి స్టేట్మెంట్ రికార్డుకు ట్రయల్ కోర్టు అనుమతి
- రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ అప్లికేషన్ దాఖలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సౌత్ గ్రూప్‌లో కీలక పాత్ర పోషించిన అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ రెడ్డి స్టేట్మెంట్‌ను రికార్డు చేసేందుకు సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు (ట్రయల్ కోర్టు) అనుమతిచ్చింది. సీఆర్పీసీ సెక్షన్ 164 కింద శరత్ చంద్రా రెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ శుక్రవారం ట్రయల్ కోర్టులో అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా స్టేట్మెంట్లను రికార్డ్ చేయడానికి శరత్ చంద్రారెడ్డి సమ్మతిస్తారా? అని కోర్టు ప్రశ్నించింది. అయితే సీఆర్పీసీ 164 వాంగ్మూలం ఇచ్చేందుకు శరత్ చంద్రారెడ్డి సిద్ధంగా ఉన్నారని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. వీరి సమాధానంతో సంతృప్తి చెందిన కోర్టు శరత్ చంద్రారెడ్డిని వాంగ్మూలం నమోదు చేసేందుకు అంగీకారం తెలిపింది. దీంతో త్వరలోనే శరత్ చంద్రారెడ్డి స్టేట్మెంట్‌ను సీబీఐ రికార్డు చేయనుంది. సీసీటీవీ కెమెరా ముందు సీఆర్పీసీ సెక్షన్ 164 కింద కేవలం సాక్షిగా మాత్రమే శరత్ వాంగ్మూలం రికార్డు చేయనున్నట్లు తెలిసింది. కాగా, ఈ కేసు విచారణలో పూర్తి స్థాయిలో దర్యాప్తు సంస్థలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు శరత్ చంద్రా రెడ్డి సీబీఐకి తెలిపినట్లు సమాచారం. లిక్కర్ పాలసీ, అమలు, సౌత్ గ్రూప్ అనుమతి, పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చిన తీరుపై తన దగ్గర ఉన్న ఆధారాలతో పాటూ వాంగ్మూలంలో ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో లిక్కర్ స్కాం కేసులో శరత్ చంద్రా రెడ్డి అరెస్ట్ ఉండదని సీబీఐ హామీ ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఈడీ కేసులో అప్రూవర్‌గా శరత్ చంద్రారెడ్డి

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే శరత్ చంద్రారెడ్డిని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసింది. లిక్కర్ స్కాం తెరపైకి వచ్చిన కొద్ది రోజులకే 2022 నవంబర్ 10న శరత్ చంద్రారెడ్డిని ఈడీ అదుపులోకి తీసుకుంది. అదే రోజు ఫెర్నార్డ్ రిచర్డ్ కంపెనీ ప్రతినిధి బినోయ్ బాబును అరెస్ట్ చేసింది.

రెండు రోజుల తర్వాత నవంబర్ 13న సౌత్ గ్రూప్‌లో కీలకంగా వ్యవహరించిన కవిత సన్నిహితుడు అభిషేక్ బోయినపల్లిని అరెస్ట్ చేసి విచారించింది. ఇలా మనీలాండరింగ్ కేసులో మొత్తం 17 మందిని ఈడీ అరెస్ట్ చేసి పలు దఫాలుగా స్టేట్మెంట్లు రికార్డు చేసింది.

ఆరూరికి భద్రత కల్పించండి :హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు 1 ప్లస్ 1 పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తనకున్న భద్రతను అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తీసేశారనీ, ఎంపీగా పోటీలో ఉన్నందున తనకు 2 ప్లస్ 2 భద్రత కల్పించాలంటూ రమేష్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి శుక్రవారం విచారించారు. రాజకీయ కక్షతో భద్రత తొలగించారని పిటిషనర్ వాదించారు. ఇరువురి వాదనల తర్వాత న్యాయమూర్తి, పిటిషనర్‌కు 1 ప్లస్ 1 భద్రత కల్పించాలనీ, డీజీపీ, వరంగల్ నగర పోలీసు కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

విధుల్లోకి తీసుకోండి

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని సస్పెండ్ చేసిన సిద్దిపేట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - ఇందిరా క్రాంతి పథం(డీఆర్‌డీఏ - ఐకేపీ) ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేసిన కొందరు ఉద్యోగులకు ఊరట లభించింది. సస్పెండ్ అయిన సుమారు వంద మందిలో కోర్టుకు వచ్చిన పది మందిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిద్దిపేట జిల్లాకు చెందిన 106 మంది ఐకేపీ ఉద్యోగులు ఏప్రిల్ 7న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ చేసే అధికారం జిల్లా ఎన్నికల అధికారి అయిన సిద్దిపేట కలెక్టర్‌కు లేదంటూ సిద్దిపేట్ జిల్లా పుల్లూరుకు చెందిన శ్రీనివాస్‌తో పాటు మరో తొమ్మిది మంది రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 129,134 నిబంధనలు తమకు వర్తించవని చెప్పారు ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారించి పది మందిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

కేంద్రానికి హైకోర్టు నోటీసులు

ఒకటో తరగతికి కనీస వయసును ఆరేండ్లుగా నిర్ణయిస్తూ తీసుకున్న ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్రం నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. కేంద్ర విద్యా శాఖ కార్యదర్శితో పాటు రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రాథమిక విద్యా శాఖ కమిషనర్, డైరెక్టర్‌లకూ నోటీసులు జారీ చేసింది. ఒకటో తరగతి చదవాలంటే కనీస వయసు ఆరేండ్లు ఉండాలన్న కేంద్ర నిర్ణయాన్ని సవాల్ చేస్తూ లాయర్ పరీక్షిత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమా డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. ఆరేండ్లు వచ్చే వరకు పిల్లలు స్కూళుకు వెళ్లకుండా చేయడం సరికాదనీ, కేంద్ర నిర్ణయం వల్ల పిల్లల భవిష్యత్‌కు సమస్యలు ఎదురవుతాయని పిటిషనర్ వాదించారు. చిన్న వయసులోనే వారి శారీరక, మానసిక శ్రేయస్సు దోహదపడుతుందన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయం జాతీయ విద్యా విధానం -2020, విద్యా హక్కు చట్టం -2009కి విరుద్ధంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనల తర్వాత ధర్మాసనం కేంద్రానికి నోటీసులు ఇచ్చి విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

శివ్ నాడర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శివ్‌నాడార్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఆ సంస్థ తెలిపింది. శుక్రవారం హైదరాబాద్‌లో శివ్‌నాడర్ యూనివర్శిటీ అడ్మిషన్స్ చైర్‌పర్సన్ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి 17 ప్రోగ్రాంలలో నాలుగేండ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తున్నామన్నారు. 286 ఎకరాల్లోని క్యాంపస్‌లో 250పైగా బోధన సిబ్బందితో సహా మూడు వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి స్కాలర్‌షిప్‌లను కూడా ఇస్తున్నామని వివరించారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 30 వరకు ఉందని చెప్పారు.

నెస్లేపై తగు చర్యలు తీసుకోండి

- ఎఫ్ఎస్ఎస్ఏఐని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : నెస్లే ఇండియా భారత్‌లో విక్రయించే బేబీ ఉత్పత్తుల్లో అధిక చక్కెర శాతం వుందన్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తక్షణమే ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ (భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ)ను కోరింది. ఈ మేరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సిఇఓ కమలా వర్ధనరావుకు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే లేఖ రాశారు. "భారత్‌లో నెస్లే కంపెనీ అనుసరిస్తున్న పద్ధతుల గురించి ఆందోళన కలిగించే విషయాలు వెల్లడిస్తూ స్విట్జర్లాండ్‌కి చెందిన దర్యాప్తు సంస్థ పబ్లిక్ ఐ ఒక నివేదికను ప్రచురించింది. భారత్‌లో విక్రయించే బేబీ సెరిలాక్ ఉత్పత్తుల్లో ఒక్కో ప్యాకెట్‌కు అదనంగా 2.7గ్రాముల చక్కెరను కలుపుతోందని, అదే జర్మనీ, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి ఇతర దేశాల్లో మాత్రం ఇటువంటి పరిస్థితి లేదని ఆ నివేదిక పేర్కొంది. "బేబీ ఉత్పత్తుల్లో అధికంగా చక్కెరను ఉపయోగించడం వల్ల మన దేశంలో పిల్లల ఆరోగ్యం, భద్రతకు సంబంధించి తీవ్ర పర్యవసానాలు కలిగించగల పరిస్థితులు వున్నాయి. మన ప్రజల ముఖ్యంగా శిశువులు, పిల్లల ఆరోగ్యం, సంక్షేమం మనకు అత్యధిక ప్రాధాన్యత గల అంశాలు. భద్రతా ప్రమాణాల నుండి పక్కకు మళ్ళితే అవి తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారి తీయగల ప్రమాదం వుంది." అని ఖరే ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నెస్లే పద్ధతులు, కార్యకలాపాలపై తగు చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎస్ఎస్ఏఐని కోరినట్లు తెలిపారు.

లైసెన్స్ లేకుండా క్లినిక్‌ల నిర్వహణ

- మూడు జిల్లాల్లో నకిలీలపై డీసీఏ దాడులు
- నిల్వ చేసిన ఔషధాల పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారుల దాడుల కొనసాగుతున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్, జనగామ, హైదరాబాద్ జిల్లాల్లో లైసెన్స్ లేకుండా క్లినిక్‌లు నడుపుతూ ప్రాక్టీస్ చేస్తున్న వారిపై దాడులు చేసి నిల్వ ఉంచిన ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల సందర్భంగా రూ.2.56 లక్షల ఔషధాలను సీజ్ చేశారు. ప్రాక్టీస్ చేసేందుకు అవసరమైన అర్హతలు లేకున్నా వారు తమను తాము ఆర్‌ఎంపీలుగా చెప్పుకుంటున్నారు. డ్రగ్ లైసెన్స్ లేకుండానే ఔషధాలను నిల్వ ఉంచినట్టు దాడుల సందర్భంగా గుర్తించారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం, వేపూర్ గ్రామంలో బండారి వెంకటస్వామి నుంచి రూ.ఒక లక్ష విలువైన 36 రకాల ఔషధాలను, జనగామ జిల్లా కేంద్రంలో సూర్యాపేట రోడ్ లోని చింతకింది యాదగిరి నుంచి రూ.65 వేల విలువైన 43 రకాల ఔషధాలను, హైదరాబాద్ జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌లో అన్నపురెడ్డి రాజలక్ష్మి నుంచి రూ.ఒక లక్ష విలువైన 40 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఔషధాల్లో యాంటిబయాటిక్స్ తో పాటు స్టెరాయిడ్స్ కూడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీటిని దుర్వినియోగం చేస్తే పలు రకాల అనారోగ్యాల బారిన పడే ప్రమాదముందని డ్రగ్ కంట్రోల్ అధికారులు హెచ్చరించారు. ఇలాంటి వ్యవస్థతో ప్రజారోగ్యమే ప్రమాదంలో పడుతుందని తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు సరికావు:టీజూడా

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ బీఆర్ఎస్ నాయకులు, వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) ఖండించింది.

నేవీ నూతన చీఫ్‌గా దినేష్ త్రిపాఠి

న్యూఢిల్లీ : నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం నేవీ చీఫ్‌గా ఉన్న అడ్మిరల్ ఆర్ హరి కుమార్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే ఇదే ఏడాది మే 31న రిటైర్ కానున్న నేపథ్యంలో ఆర్మీలో మరిన్ని మార్పులు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం త్రిపాఠి నేవీ వైస్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆర్ హరికుమార్ అనంతరం నేవీలో సీనియర్ అధికారి దినేష్ త్రిపాఠినే కానుండటంతో ఆయనను నేవీ చీఫ్‌గా నియమించినట్లు వారు పేర్కొన్నారు.